ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-7-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 152 పేజీలు: 10+4 వెల: 6.50


అపరకర్మ
మా తండ్రి గారు
కీ॥శే॥ గాట్టిముక్కల పద్మారావు గారు
తేది.21.06.2026 ఆదివారం రోజున స్వర్గస్తులైనారని తెలుపుటకు చింతిస్తున్నాము.
తేది.02.07.2026 గురువారం (ద్వాదశాహము) జరుపబడును.
కావున తామెల్లరూ విచ్చేసి వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని తెలియజేయడమైనది.
కీ॥శే॥ గాట్టిముక్కల పద్మారావు గారు
మరణం: 21.06.2026
కార్యస్థలం: ప్లాట్ నెం.272, రోడ్ నెం. 5, వివేకానందనగర్ కాలని, కూకట్‌పల్లి.
కూతురు - అల్లుడు
సుజనారావు - ఎల్. భవాని ప్రసాద్

## సప్తపది లేకుండా హిందూ వివాహమే కాదు



గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు 5

## ట్రైలర్‌ను ఢీకొన్న బస్సు

8 మంది సజీవదహనం, 22 మందికి తీవ్రగాయాలు

రాజస్థాన్‌లో విషాదం 5



రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో భారీ మంటల్లో దగ్ధమవుతున్న బస్సు

## మగవాళ్లను చంపడం ఎలా?

మెట్రోరైల్లో మహిళ చదివిన పుస్తకంపై హాట్ హాట్ చర్చలు 5



# నేడు ఇ-కేబినెట్

## మెట్రో రైలు, జీరామ్‌జీ ప్రధాన అజెండా

## పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహణ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై1:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం(జూలై 2) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో తొలి కాగిత రహిత (ఈ-క్యాబినెట్) సమావేశంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కేబినెట్ సమావేశానికి సిఎంతో పాటు మంత్రులు,అధికారులు హాజరు కానున్నారు. గత మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఇకపై క్యాబినెట్ సమావేశాలను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి సహా మంత్రులందరికీ ట్యాబ్‌లు అందజేశారు. ఇటీవల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజుకు కూడా ఇదే తొలి మంత్రివర్గ సమావేశం కానుంది. ఈ సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకు సంబంధించిన తాజా పరిణామాలు, తదుపరి కార్యాచరణపై చర్చ జరిగే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం, ప్రాజెక్టు పురోగతిపై మంత్రివర్గం కీలకంగా సమీక్షించే అవకాశం ఉందని సమాచారం. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బదులుగా కేంద్రం తీసుకొచ్చిన వీబీ జీరామ్ పథకాన్ని తెలంగాణలో అమలు చేయాలా లేదా అనే అంశంపైనా మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ పథకంలోని కొన్ని నిబంధనలపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ చర్చకు ప్రాధాన్యం ఏర్పడింది. వానాకాలం సాగు, విత్తనాలు, ఎరువుల సరఫరా, పంటల వైవిధ్యం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే చర్యలపై కూడా మంత్రివర్గం చర్చించనుంది. ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహకాలు కల్పించాలన్న వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రతిపాదనలను కూడా >>2



బుధవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌తో భేటీ అయిన అనలాగ్, మెగా సంస్థల ప్రతినిధులు. చిత్రంలో డి.సిఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

# హైదరాబాద్ ట్రాఫిక్‌కు ఎఐ సిగ్నల్స్

## అనలాగ్, మెగా సంస్థలతో సర్కార్ కీలక ఒప్పందం

### పట్టణ రవాణా వ్యవస్థ అభివృద్ధికి చర్యలు

### వాతావరణ మార్పులకు అనుగుణంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

### సిఎం రేవంత్‌తో చర్చించిన అనలాగ్, మెగా సంస్థల ప్రతినిధులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై1:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ ఎండీ పి. కృష్ణారెడ్డి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సమావేశమయ్యారు. బుధవారం జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ సీఈఓ, హైదరాబాద్ మెట్రోరైల్ అదనపు ఎండీ బి. అజిత్ రెడ్డి పాల్గొన్నారు. అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఈ సందర్భంగా చర్చించారు. అనలాగ్, మెగా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో భవిష్యత్తరాలకు అవసరమైన మేధోపరమైన మౌలిక సదుపాయాలు (నెక్స్ట్ జనరేషన్ ఇంటిలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలపై తమ ఆలోచనలను సమావేశంలో వివరించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. నగరంలో ఎదురయ్యే సమస్యలకు సత్వర పరిష్కారానికి దోహదపడే సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై వారు సమావేశంలో వివరించారు. నగరంలో అత్యాధునిక ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్లాట్ ఫామ్స్ వినియోగం వల్ల ప్రయోజనాలను తెలిపారు. సెన్సర్లు, రోబోటిక్స్ వంటి ఫిజికల్ ఇంటెలిజెన్స్ వినియోగం ద్వారా సురక్షితమైన, సమర్థవంతమైన, వేగంగా స్పందించే పట్టణ రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి ఎలా తోడ్పుతుందన్న అంశాలను వివరించారు. ట్రాఫిక్ రద్దీని గుర్తించి తదనుగుణంగా సిగ్నళ్ల వ్యవస్థ, నీటి లీకేజీలను ముందుగానే గుర్తించి మరమ్మతులు చేపట్టడం, అవసరానికి అనుగుణంగా విద్యుత్ వినియోగాన్ని నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు మార్గం సుగమం చేయడం వంటి కాగ్నిటివ్ సిటీస్ రూపకల్పనకు ఉన్న విస్తృత అవకాశాలను సమావేశంలో సమావేశంలో వివరించారు. వేగంగా పెరుగుతున్న పట్టణాల అవసరాలను దృష్టిలో >>2

## ఆదాయ సమీకరణకు ఛేజింగ్ సెల్ ఏర్పాటు

అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసిన సిఎం రేవంత్ 3



## చర్చకు వస్తా..

### డేట్, టైం ఫిక్స్ చేయండి

### మీ వైఫల్యాలు ఎండగడతా..

### సిఎంకు కెటిఆర్ సవాల్

**ప్రభాతవార్త ప్రధానప్రతినిధి, హైదరాబాద్, జూలై1:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రస్తుత పాలన, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకుతాను సిద్ధమని >>2



## మీకోసం వస్తున్నా..

### 4న మిడ్జిల్‌కు సిఎం రేవంత్

### ప్రజా ప్రతినిధిగా 20 యేళ్లు

### రాజకీయ జన్మనిచ్చిన నేలకు కృతజ్ఞతావందనం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై1:** తనకు రాజకీయంగా జన్మనిచ్చిన మిడ్జిల్ మండలం రుణం తీర్చుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంకల్పించారు. ప్రజాప్రతినిధిగా తన తొలి అడుగుకు అండగా నిలిచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలపాలని నిర్ణయించారు. జడ్పీటీసీ సభ్యుడి నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయి వరకు సాగిన 20 ఏళ్ల రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించిన నేలపై ఆయన జూలై 4న కృతజ్ఞత సభ నిర్వహించనున్నారు. మిడ్జిల్.. రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేక స్థానం కలిగిన ప్రాంతం. 2006 పరిషత్ ఎన్నికల్లో మిడ్జిల్ జడ్పీటీసీగా ఆయన తొలి విజయం సాధించారు. ఆ గెలుపే ఆయన ప్రజా ప్రతినిధి జీవితానికి పునాది వేసింది. ఆ తర్వాత ఎమ్మెల్సీగా, కొడంగల్ ఎమ్మెల్యేగా, మల్కాజ్‌గిరి ఎంపీగా, చివరకు తెలంగాణ ముఖ్యమంత్రిగా ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. ఈ ప్రయాణంలో తనకు తొలి >>2

# శ్రీశైలం జల విద్యుత్‌కు ఎల్ నినో దెబ్బ

### కరెంట్ ఉత్పత్తికి తీవ్ర అంతరాయం

### నీరు లేక ఇంకా ప్రారంభం కాని యూనిట్లు

### గత యేడాది జూన్‌లోనే ఉత్పత్తి ప్రారంభం




**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావం విద్యుత్ ఉత్పత్తిపై అప్పుడే కనిపించడం మొదలైంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఈసారి శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడనుంది. వర్షాకాలం మొదలై, రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించినా వానలు సరిగ్గా కురవకపోవడంతో జలాశయాలకు ఇన్‌ఫ్లోలు తగ్గిపోయాయి. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో అధికారులు వెల్లడించిన వివరాలు ప్రకారం ఏటా కృష్ణా బేసిన్‌లో జూన్, జూలైలో ప్రాజెక్టులకు వరదలు వస్తుంటాయి. గత ఏడాది భారీ వర్షాల కారణంగా నిలకడగా ఇన్‌ఫ్లోలు రావడంతో జలవిద్యుత్ ఉత్పత్తి భారీగా జరిగింది. ఆ ఏడాది మొత్తంగా శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా 6917 మిలియన్ యూనిట్లు మేర విద్యుత్ ఉత్పత్తి జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఈ 12 ఏళ్లకాలంలో అదే అత్యధికం. కానీ, ఈసారి ఎల్‌నినో దెబ్బకు జలవిద్యుత్ ఉత్పాదనపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కిందటి సంవత్సరం జూన్‌లోనే శ్రీశైలంలో విద్యుదుత్పత్తి ప్రారంభం కాగా, ఈసారి ఇంకా ప్రారంభించలేదు. రిజర్వాయర్లు నిండుగా ఉన్న సమయంలోనూ, ఎగువప్రాంతాల నుంచి నిలకడగా వరదవస్తేనే జలవిద్యుత్ ఉత్పత్తి భారీగా జరుగుతుంది. ఆ సమయంలో బయటి నుంచి కొనుగోళ్లు స్వల్పంగానే ఉంటాయి. జలాశయాల్లో నీటి లభ్యత లేని సమయంలో బయటి నుంచి కొనడం, ధర ఎక్కువైన థర్మల్ విద్యుత్‌ను కొనడం తప్ప మరో మార్గం కనిపించడం లేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. గోదావరి బేసిన్‌తో పోల్చితే కృష్ణా బేసిన్‌లో కురిసే ప్రతి చుక్కా జలవిద్యుత్ ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తుంది. ఎందుకంటే మహారాష్ట్రలో కోయినా, కర్ణాటకలో ఆల్మట్టి, నారాయణపూర్, ఆ తర్వాత తుంగభద్ర, జూరాల,శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, పాలేరు దాకా ప్రాజెక్టుల వద్ద జలవిద్యుత్ కేంద్రాలున్నాయి. గోదావరిలో శ్రీరాం సాగర్, నిజాంసాగర్, సింగూరు, పెద్దపల్లి మినీ హైడ్రోలు మాత్రమే ఉన్నాయి. రాష్ట్రంలో తొమ్మిది ప్రాజెక్టుల వద్ద 2441 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 11 జలవిద్యుత్ కేంద్రాలుండగా, వాటిలో2371.6 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే కేంద్రాలు కృష్ణా నదిపైనే ఉన్నాయి. గోదావరి ఉప నదులపై 70.2 మెగావాట్ల కేంద్రాలున్నాయి. జలవిద్యుత్ ఉత్పత్తికి స్థిరచార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ఇంధన చార్జీలు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఉత్పత్తి 6 వేల మిలియన్ యూనిట్లు దాటితే ఉద్యోగులు, నిర్వహణ ఖర్చుల వల్లే యూనిట్‌కు రూ.1.17 దాకా ఖర్చవుతుంది. జల, సౌర విద్యుత్‌లను థర్మల్‌తో కలిపితేనే ధర గిట్టుబాటు అయి డిస్కమ్‌లపై కొనుగోళ్ల భారం తగ్గనుంది. కానీ, ఈ దఫా వర్షాభావం వల్ల జలవిద్యుత్ ఉత్పాదన 23 వేల మిలియన్ యూనిట్ల లోపే ఉంటుందనే అంచనాలున్నాయి. కాబట్టి ఈసారి బహిరంగ విపణిలో కొనుగోళ్లు మరింత పెరిగే అవకాశాలున్నాయి. మరోపక్క ఎల్‌నినో వల్ల పశ్చిమ కనుమల్లో వానలు నిరాశజనకంగానే పడుతున్నాయి. ఆశించిన స్థాయిలో వరద నీరు రాకపోవడంతో కృష్ణా బేసిన్‌లోని 16 జలాశయాలు, గోదావరి బేసిన్‌లోని 20 జలాశయాల్లో ప్రస్తుతంఉన్న నిల్వలన్నీతాగునీటికే కేటాయించారు. >>2

## 17 జిల్లాల్లో లోటు వర్షపాతం

### 4 జిల్లాల్లో సాధారణం కంటే అధికం

### జూన్‌లో 15 మిల్లీ మీటర్లు నమోదు



**హైదరాబాద్, జూలై 1 ప్రభాతవార్త:** నైరుతి రుతుపవనాలు ప్రారంభమై నెల రోజులు గడిచినా, తెలంగాణలో సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ, ఇది స్వల్పంగా లోటుగా ఉంది. ఎల్ నినో, నైరుతి ఆలస్యం, రుతుపవనాల్లో కదలిక వేగంగా లేకపోవడమే >>2

## విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై1:** తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది కొరత, మౌలిక వసతుల



లేమి, హాస్టళ్లలో దయనీయ పరిస్థితులు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ప్రైవేట్ >>2



డెహ్రాడూన్ బస్టాండ్ వద్ద బుధవారం భారీ వర్షాలకు జలమయమైన రహదారులు

## ఉత్తరాదికి వరద ముంపు

### హిమాచల్, జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్, మహారాష్ట్రలో భారీ వర్షాలు

**న్యూఢిల్లీ,జూలై 1:** దేశంలోని పలు రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు విస్తరించడంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర, పశ్చిమ భారత రాష్ట్రాలకు భారత వాతావరణ శాఖ భారీ నుంచి అతిభారీ వర్షాలుంటాయి హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగి పడటం, రవాణా సేవలకు అంతరాయం వంటి పరిస్థితులు నెలకొన్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో జూలై ఒకటో తేదీతో నైరుతి రుతుపవనాలు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాయి. కుండపోత వర్షాలతో సాధారణ జనజీవనం >>2



బుధవారం బాబ్లీ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలిన దృశ్యం

## బాబ్లీ గేట్లు ఎత్తివేత

**హైదరాబాద్,జూలై 1,ప్రభాతవార్త:** మహారాష్ట్ర ధర్మాబాద్ జిల్లాలో గోదావరి నదిపై నిర్మించిన బాబ్లీ గేట్లను కేంద్ర జలసంఘం అధికారులు, మహారాష్ట్ర, తెలంగాణ నీటిపారుదలశాఖ అధికారుల సమక్షంలో బుధవారం >>2

## విజయ్ సర్కార్‌ను కూలిస్తే

### ఒక్కో ఎమ్మెల్యేకు 50 కోట్లు?



### తమిళనాడులో ముగ్గురి అరెస్టు.. దర్యాప్తు

**చెన్నై,జూలై 1:** తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర జరిగినట్లు రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం వెల్లడించింది. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కూడా పూర్తికాకముందే ఈ కుట్రను భగ్నం చేసినట్లు అధికారులు తెలిపారు. సమాచారం ప్రకారం టీవీకేకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలతో ఒకేసారి రాజీనామాలు చేయించి ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నం జరిగినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై టీవీకే ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ >>2



యుపిలోని మీర్జాపూర్‌లో పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో బుధవారం విద్యార్థులకు తిలకం దిద్ది స్వాగతిస్తున్న టీచర్లు

# మీకోసం వస్తున్నా..

>> రాజకీయ పట్టం కట్టిన మిడ్జిల్ ప్రజలను ఆయన మరిచిపోలేదు. తనను నడిపించిన మూలాలను గుర్తు చేసుకుంటూ సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు ఆత్మీయుల వద్ద అనుభవాలను పంచుకున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. తాను మొక్కిన గుడి.. తన ప్రాంతంలో చదువు నేర్పిన బడి.. తనను ప్రజాప్రతినిధిగా తొలిసారి గెలిపించిన ప్రజలు తన గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని ఆయన భావిస్తున్నారు. వారికి ఎంత చేసినా ఆ రుణం తీర్చుకోలేననే భావనతోనే ఈ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజా ప్రతినిధిగా రేవంత్‌రెడ్డి ప్రయాణం మొదలై జూలై 4 నాటికి 20 ఏళ్ల పూర్తి కానున్నాయి. ఈ సందర్భాన్ని సాధారణ రాజకీయ కార్యక్రమంగా కాకుండా కృతజ్ఞత సమర్పణగా నిర్వహించాలని ఆయన నిర్ణయించారు."మీ బిడ్డను.. మళ్లీ వస్తున్నా. మీ ఆశీర్వాదం, ఆదరణతోనే రాష్ట్రానికి సేవ చేసే అవకాశం వచ్చింది" అనే భావంతో మిడ్జిల్ ప్రజల ముందుకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో సీఎం ముందుగా ఊరుకొండ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ చేయనున్నారు. అనంతరం తన తొలి రాజకీయ ప్రయాణంలో వెంట నడిచిన అనుచరులు, ఆత్మీయులు, ముఖ్య నేతలు, ఆనాటి పెద్దలతో ఆత్మీయంగా మధ్యాహ్న భోజనం చేస్తారు. మిడ్జిల్ సమీపంలో ఆనాటి లీడర్ గోపాల్‌రెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. చివరగా మిడ్జిల్‌లో జరిగే బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. విద్యార్థి దశలో ప్రజా కార్యక్రమాల్లో చురుకుగా ఉన్న రేవంత్‌రెడ్డి, ప్రత్యక్ష రాజకీయాల్లో స్వతంత్రంగానే అడుగుపెట్టారు. మిడ్జిల్ జడ్పీటీసీగా గెలుపొందిన తర్వాత 2007లో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. ఆ తర్వాత టీడీపీలో చేరి కొడంగల్ నుంచి 2009, 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరిన ఆయన, మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిచి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. తర్వాత టీపీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపించి, 2023లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చారు. డిసెంబరు 7న తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ మొత్తం ప్రయాణానికి ఆది మిడ్జిల్‌నే. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి తన 20 ఏళ్ల ప్రజాప్రస్థానాన్ని ప్రారంభమైన నేలపై గుర్తుచేసుకోవాలని నిర్ణయించారు. రాజకీయంగా తనకు జన్మనిచ్చిన ప్రజలకు నమస్కరించేందుకు, తన వెన్నంటి నడిచిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ సభను వేదికగా చేసుకోనున్నారు. మిడ్జిల్ ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదమే తనను రాష్ట్ర సేవకు తీసుకొచ్చిందనే భావనతో సీఎం ఈ పర్యటనకు బయల్దేరుతున్నారు. తొలి గెలుపునిచ్చిన నేలపై నిలబడి కృతజ్ఞతలు చెప్పబోతున్న ఈ కార్యక్రమం, రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానంలో భావోద్వేగ ఘట్టంగా నిలవనుంది.

# చర్చకు వస్తా..

>> ఆయన ప్రకటించారు. ఈ చర్చకు సంబంధించిన తేదీ, సమయాన్ని ఖరారు చేయాలని ఆయన ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రెండు రోజుల క్రితం రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన గడువులో సగం కాలం పూర్తయినా, చెప్పుకోవడానికి ఒక్క విజయం కూడా లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో వరి సాగు 2014-15 నాటికి ఉన్న 26 లక్షల హెక్టార్ల నుంచి, పాలన ముగిసే సమయానికి 59 లక్షల హెక్టార్లకు పెరిగిందని గుర్తు చేశారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు.ప్రస్తుత ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి గత ప్రభుత్వంపై నిందలు వేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. తాము అధికారం నుంచి దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ. 3.5 లక్షల కోట్లు మాత్రమేనని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంత దారుణంగా ఉంటే ముఖ్యమంత్రి 72 సార్లు ఢిల్లీ పర్యటనలు ఎందుకు చేశారని ఆయన ప్రశ్నించారు.అసెంబ్లీ, ప్రెస్ క్లబ్ లేదా జూబ్లీహిల్స్ ప్యాలెస్.. వేదిక ఏదైనా చర్చకు తాను వస్తానని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ చర్చకు రేవంత్ రెడ్డి లేదా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వచ్చినా తనకు అభ్యంతరం లేదన్నారు. "ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా నిరూపించడంలో నేను విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాను" అని కేటీఆర్ సంచలన ప్రకటన చేశారు. రేవంత్ రెడ్డి చెప్తున్నట్లు తెలంగాణ దివాలా తీసిన రాష్ట్రం ఏమాత్రం కాదు. మా కె.సి.ఆర్ సారథ్యంలో తెలంగాణ కోటి ఎకరాల మాగాణ అయ్యింది. ఎంతసేపు అప్పుల పేరుతో రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నాడు. కానీ బి.జె.పి ఎం.పి రఘునందన్ రావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలంగాణ అప్పులు కేవలం రెండు లక్షల డెబ్బై వేల కోట్లు మాత్రమే అని స్పష్టంగా కేంద్ర ప్రభుత్వం చెప్పింది. ఆయన అయినప్పటికీ రేవంత్ రెడ్డి మాత్రం ఆరు లక్షలు, ఏడు లక్షలు, ఎనిమిది లక్షలు అంటూ రోజుకొక మాట అప్పుల గురించి మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. కేవలం అప్పులే కాదు, రాష్ట్ర ఆదాయంతో పాటు అప్పులకు కడుతున్న మిత్తి లెక్కల పైన కూడా తప్పుడు మాటలు మాట్లాడుతూ, తెలంగాణను ఏదో దివాలా తీసిన రాష్ట్రంగా చూపించే నీచమైన ప్రయత్నం చేస్తున్నాడన్నారు. ఒకవేళ రేవంత్ రెడ్డి అంటున్నట్టు తెలంగాణ దివాలా తీయాల్సి వస్తే, కచ్చితంగా అది ఆయన కుటుంబ సభ్యులు, సోదరులు తన మంత్రివర్గ సహచరులు చేస్తున్న అవినీతి, దోపిడి వల్లనే, లూటీ వల్లనే తెలంగాణ దివాలా తీస్తున్నది అన్నారు. రైతు బంధు ఇవ్వకుండా, సంపూర్ణ రుణ హామీ, రుణమాఫీ చేయకుండా, కౌలు రైతులకు, రైతు కూలీలకు ఇస్తామని చెప్పిన ఆర్థిక సహాయం చేయకుండా పూర్తిగా లక్షా 13 వేల కోట్ల రూపాయల రైతులకు ఎగగొట్టి, ఈరోజు సిగ్గులేకుండా రాష్ట్రంలోని రైతాంగం గురించి వారేదో సంతోషంలో ఉన్నారు అని చెప్పుకుంటూ, రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని వ్యాఖ్యానించారు.

# నేడు ఇ-కేబినెట్

>> పరిశీలించే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య స్థానికత ఉన్న ఉద్యోగుల పరస్పర అంతర్రాష్ట్ర బదిలీలపై కూడా మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో పాటు హైదరాబాద్ కోర్ అర్బన్ ప్రాంతంలో ప్రతిపాదిత ఎస్ఐజీ హౌసింగ్ ప్రాజెక్టుకు సంబంధించిన స్థలాలు, డిజైన్లు, విధివిధానాలకు కూడా ఆమోదం తెలిపే అవకాశముందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# బాబ్లీ గేట్లు ఎత్తివేత

>> ఉదయం 14 గేట్లను ఎత్తి కిందికి నీటిని వదిలారు. కేంద్ర జలసంఘం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.చరణ్, జెఇ అతుసాయి ప్రణీత,బి. శ్యాంప్రకాశ్ మహారాష్ట్రనీటివనరుల శాఖ ఇఇ సిఆర్ బన్సోడ్ సబ్ డివిజన్ ఇంజనీర్ సిడి పోత్దార్, డి గవహేవ్, తెలంగాణ నుంచి ఎఇఇలు కొత్తరవి, ఎన్శ్యాంకుమార్ విన్యాస్‌రెడ్డిలు గేట్లు ఎత్తివేత కార్యక్రమంలో పాల్గొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు అక్టోబరు 28 వరకు గేట్లు తెరిచిపెడుతారు. బాబ్లీ ప్రాజెక్టులో నీటి నిల్వ స్వల్పంగా ఉండడంతో తెలంగాణ ప్రాంతానికి కేవలం 0.20 టిఎంసిల వరద వస్తోంది. ఈ దశాబ్ద కాలంలో ఎగువ గోదావరి నుంచి ఇంత తక్కువ మొత్తంలో వరద రావడం ఇదే తొలిసారి అని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

# హైదరాబాద్ ట్రాఫిక్‌కు ఎఐ సిగ్నల్స్

>> ఉంచుకుని, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, ప్రభుత్వాల కార్యనిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడం, పౌరులకు అందించే సేవలను మరింత మెరుగుపరచడం, అలాగే డేటా ఆధారిత మౌలిక సదుపాయాల ప్రణాళికకు ఎలా దోహదపడతాయో ఇరు సంస్థలు వివరించాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఇటు సంస్థలకు పలు సూచనలు చేశారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఇంటిగ్రేట్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నల్స్ పనిచేసే విధానాన్ని తీసుకురావాలన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా ఎఐకి అనుసంధానించాలని సీఎం సూచించారు. సమావేశం అనంతరం ముఖ్యమంత్రి సమక్షంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంయుక్త భాగస్వామ్యంతో అవగాహన ఒప్పందం కుదిరింది. పరస్పరం సాంకేతిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడం, ఆవిష్కరణల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ ఒప్పందం కీలకంగా మారుతుంది.

## వారం - వర్జ్యం

02-07-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆరుద్ర కార్తె
విదియ ఉ.9.37
ఉత్తరాషాఢ ఉ.9.26
వర్జ్యం : మ.1.49-మ.3.34
దు.ఉ.10.00-ఉ.10.52, 2) మ.3.14-సా.4.00
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** పాతమిత్రులనుండి కీలక సమాచారం అందుకుంటారు. సంతాన పరంగా బాధ్యతగా వ్యవహరిస్తారు.

**వృషభం:** అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. పెట్టుబడులకు తగిన సమయం.

**మిథునం:** కలలప్రపంచంలో విహరించకకుండా వాస్తవికతను దృష్టిలో ఉంచుకొని ముందడుగువేసి లాభపడతారు.

**కర్కాటకం:** కార్యాలయంలో అర్థంలేని రాజకీయాలు మిమ్మల్ని విసుగుకలిగిస్తాయి. యాంకరింగ్ రంగంలోవారికి అనుకూలం.

**సింహం:** దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరట చెందుతారు. సంఘంలో కీర్తిప్రతిష్ఠలు నామమాత్రంగా పెరుగుతాయి.

**కన్య :** సంతానపరంగా విశేషశ్రద్ధను కనబరుస్తారు. ఈరోజు అనేక అనుకూల ఫలితాలను సాధిస్తారు.

**తుల :** రాజకీయరంగాలవారు గౌరవ సత్కారాలు పొందుతారు. మోకాళ్ళనొప్పులు బాధించవచ్చు. వాహన సౌలభ్యం.

**వృశ్చికం:** నూతనకార్యక్రమములను గురించి ఆలోచనలు, చర్చలు మాటల రూపములోనికి వస్తాయి.

**ధనుస్సు:** ఆరోగ్య, వాహనాల విషయంలో జాగ్రత్తలు అవసరం. దూరప్రాంతాలనుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి.

**మకరం:** మీరు చేస్తున్న పనులను గోప్యంగా ఉంచండి. హోటల్ వ్యాపారస్థులకు అనుకూలమైన కాలం.

**కుంభం:** మీ మాటలకు, మంచి తనమునకు గాను సమాజములో మీకు గౌరవప్రతిష్ఠలు పెంపొందుతాయి.

**మీనం:** దీర్ఘకాలిక సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇరాన్‌పై అవసరమైతే మూడోసారి దాడిచేస్తాం

## ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు

**టెల్‌అవీవ్,జూలై 1:** ఇరాన్‌పై మరోసారి సైనిక చర్యకు వెనుకాడబోమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు హెచ్చరించారు. తాను ప్రధానిగా ఉన్నంతకాలం ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేయనివ్వబోమని స్పష్టం చేశారు. అవసరమైతే మూడోసారి కూడా ఇరాన్‌పై దాడి చేస్తామని తెలిపారు. హీబ్రూ భాషా టెలివిజన్ ఛానల్ 14కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ తమ దేశంపై ఉన్న అస్తిత్వ ముప్పును తొలగించేందుకు ఇప్పటికే రెండుసార్లు ఇరాన్‌లోకి ప్రవేశించి సైనిక చర్యలు చేపట్టామని, అవసరం అయితే మూడోసారి కూడా అదే చేస్తామని హెచ్చరించారు. తాను ప్రధానిగా ఉన్నంతకాలం ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఇవ్వబోమని నెతన్యాహు స్పష్టం చేశారు. ఇరాన్‌తో పాటు హమాస్, హెజ్బొల్లాపై కొనసాగుతున్న సైనిక చర్యలు ఇంకా పూర్తికాలేదని, ఆపరేషన్లు కొనసాగుతాయని వెల్లడించారు. ఇజ్రాయెల్ గతంలో కంటే ఇప్పుడు మరింత బలంగా ఉందని, తమకు ఎదురైన ముప్పులను గణనీయంగా బలహీనపరిచామని నెతన్యాహు అన్నారు. ఇరాన్ మద్దతు ఉన్న శక్తులను పూర్తిగా నిర్వీర్యం చేయడంతో పాటు, కొత్త శాంతి ఒప్పందాలకు అవకాశాలను కూడా వినియోగించుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా, నెతన్యాహు దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ ఆధీనంలో ఉన్న ప్రాంతాలను సందర్శించారు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాలు ఇటీవల భద్రతా ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత ఆయన ఆ ప్రాంతాన్ని సందర్శించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇరాన్ మద్దతు ఉన్న హెజ్బొల్లా నుంచి ముప్పు పూర్తిగా తొలగిపోయే వరకు దక్షిణ లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ సైన్యం వెనక్కి వెళ్లదని నెతన్యాహు స్పష్టం చేశారు.

# జర్మనీలోని 3 విశ్వవిద్యాలయాలతో కాకతీయ యూనివర్సిటీ అవగాహన ఒప్పందాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై1:** ఉన్నత విద్యను అంతర్జాతీయీకరించే లక్ష్యంతో కాకతీయ విశ్వవిద్యాలయం కీలక ముందడుగు వేసిందని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. జర్మనీ పర్యటన సందర్భంగా అక్కడి ప్రముఖ మూడు విశ్వవిద్యాలయాలతో ఆయన అవగాహన ఒప్పందాలు(ఎంఓయు) కుదుర్చుకునే ప్రక్రియను ప్రారంభించారు. ఈ మేరకు బుధవారం(జూన్1)న ఆయా విశ్వవిద్యాలయాల అంతర్జాతీయ సంబంధాల విభాగాధిపతులకు లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా విదేశీ సంబంధాల డైరెక్టర్ కై హిల్లెబ్రెఖ్ట్, అంతర్జాతీయ సంబంధాల విభాగాధిపతి, డిప్యూటీ డైరెక్టర్ టాంజా ఫాల్కోవ్ స్కీలతో చర్చలు జరిపారు. ఈ సమావేశాలకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, రూసా 2.0 రాష్ట్ర ప్రాజెక్టు అధికారి డాక్టర్ సౌందర్య జోసెఫ్ చర్చల్లో పాల్గొన్నారు. ప్రతిపాదిత అవగాహన ఒప్పందాల ద్వారా కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం, సంయుక్త పరిశోధన అవకాశాలు, విద్యార్థి -అధ్యాపకుల పరస్పర మార్పిడి కార్యక్రమాలు, సమ్మర్, వింటర్ స్కూల్స్‌లో పాల్గొనే అవకాశాలు, అధ్యాపకుల అకాడమిక్ సహకారం వంటి అనేక అంతర్జాతీయ అవకాశాలు లభించనున్నాయి.

# ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు గుడ్ న్యూస్

## ఫస్ట్ తారీఖున జీతాలు జమ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై1:** ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాల చెల్లింపు విషయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలు, విశ్వవిద్యాలయాలు, ఇతర ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి ఈ నెల మొదటి తేదీనే జీతాలు విడుదలయ్యాయి.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ బుధవారం ఉద్యోగుల జీతాలను విడుదల చేసింది. జీతాల చెల్లింపులో ఆలస్యం వల్ల ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, హానరేరియం ప్రాతిపదికన పనిచేస్తున్న సిబ్బందికి కూడా ప్రతి నెలా జీతాలు ఆలస్యం లేకుండా అందించాలని ఇటీవలే అధికారులను ఆదేశించారు.సీఎం ఆదేశాల అమలులో భాగంగా ఆర్థిక శాఖ ఇటీవల అన్ని శాఖలు, విభాగాలకు సర్క్యులర్ జారీ చేసింది. జీతాల బిల్లుల సమర్పణ, పరిశీలన, ఆడిట్, ఆథరైజేషన్‌లో జాప్యం రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ప్రతి నెల 25వ తేదీలోగా జీతాలు, రెమ్యునరేషన్ బిల్లులను ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్, అకౌంట్స్ విభాగాలకు సమర్పించాలని ఆదేశించింది. నెల చివరి పని దినానికల్లా పరిశీలన, ఆడిట్, ఆథరైజేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని స్పష్టం చేసింది. ఈ అదేశాల అమలు.. జీతాల చెల్లింపుల వివరాలపై ముఖ్యమంత్రి బుధవారం ఆర్థిక శాఖ అధికారులను ఆరా తీశారు. ఈ నెల బిల్లులు అందిన అన్ని విభాగాల ఉద్యోగులకు బుధవారం జీతాలు జమ చేసినట్లు ఆర్థిక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు.




బుధవారం జమ్మూలో అమర్‌నాథ్ యాత్ర రిజిస్ట్రేషన్ కోసం క్యూలో ఉన్న ప్రయాణికులు

# విజయ్ సర్కార్‌ను కూల్చే కుట్ర

>> ప్రారంభించారు. ఈ క్రమంలో ఒక కన్సల్టెన్సీ సంస్థ ఉద్యోగిని చెన్నైలో అరెస్టు చేశారు. అతని విచారణలో డీఎంకే ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించిన అధికా రులు, కరూర్‌లో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కుట్ర వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. తంగరై టీవీకే ఎమ్మెల్యే ఎన్. ఎళయ్యరాజా చెన్నై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో సంచలన ఆరోపణలు చేశారు. ఐపీడీఎస్ అనే కన్సల్టెన్సీ సంస్థకు చెందిన వ్యక్తి తనకు రూ.35 కోట్ల ప్రలోభం చూపించి, తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ విషయాన్ని బయటకు చెబితే పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరించినట్లు కూడా ఆయన ఆరోపించారు.అరెస్టయిన వారిలో ఒకరు డీఎంకే ఎమ్మెల్యే సెంథిల్ బాలాజీ, ఆయన సోదరుడు అశోక్‌కు అత్యంత సన్నిహితుడని సమాచారం. డీఎంకేపై టీవీకే మంత్రి తీవ్ర ఆరోపణలుఈ ఘటనపై తమిళనాడు మంత్రి సీటీ నిర్మల్ కుమార్ డీఎంకేపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.సెంథిల్ బాలాజీకి సన్నిహితులు, అలాగే కరూర్ గ్యాంగ్‌కు చెందిన వ్యక్తులు ఈ కుట్రలో నేరుగా పాల్గొన్నారని ఆరోపించారు. కుట్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ పోలీసులు అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎంకే ఏఐఏడీఎంకే నేత ఎడప్పాడి పళనిస్వామితో కుమ్మక్కై విజయ్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తమ పార్టీ ఎమ్మెల్యేలకు రూ.10 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఆఫర్లు ఇస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.డీఎంకే అగ్రనేతలు ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్ ఆదేశాల మేరకు సెంథిల్ బాలాజీ పలువురు టీవీకే ఎమ్మెల్యేలను సంప్రదించారని కూడా మంత్రి ఆరోపించారు.డీఎంకే కౌంటర్‌టీవీకే ఆరోపణలను డీఎంకే ఖండించింది. విచారణ పూర్తికాకముందే దర్యాప్తు వివరాలను లీక్ చేసి ప్రజల్లో తప్పుడు అభిప్రాయం కల్పించేందుకు టీవీకే ప్రయత్నిస్తోందని డీఎంకే అధికార ప్రతినిధి ఏ. శరవణన్ విమర్శించారు.సెంథిల్ బాలాజీపై స్పష్టమైన ఆధారాలు ఉంటే వెంటనే అరెస్టు చేయాలని టీవీకే ప్రభుత్వానికి ఆయన సవాల్ విసిరారు.

**పాత విభేదాలే కారణమా..?**

విజయ్, సెంథిల్ బాలాజీ మధ్య గత కొంతకాలంగా తీవ్ర రాజకీయ విభేదాలు కొనసాగుతున్నాయి. విజయ్ ఎన్నికల ప్రచార సభలో జరిగిన తొక్కిసలాట ఘటన వెనుక సెంథిల్ బాలాజీ కుట్ర ఉందని విజయ్ గతంలో ఆరోపించారు. అయితే ఆ ఆరోపణలను సెంథిల్ బాలాజీ అప్పట్లో ఖండించారు.ప్రస్తుతం ఈ వ్యవహారం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# శ్రీశైలం జల విద్యుత్‌కు ఎల్ నినో దెబ్బ

>> కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలంలో నిల్వలు అడుగంటి పోవడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలపై కొంత ప్రభావం ఉండనుంది. రానున్న రోజుల్లో ఈ ప్రాజెక్టుకు వచ్చే ఇన్‌ఫ్లోలతో తాగునీటి ఇబ్బందులు తీరుతాయని ఆశిస్తున్నారు. జలాశయాలకు వరద నీరు రాకపోవడంతో, రైతులు భూగర్భజలాలపై ఆధారపడి అరుతడి పంటలు వేసుకునే అవకాశం ఉంటుంది. అదే జరిగితే వ్యవసాయ విద్యుత్తు వినియోగం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో 30 లక్షలకు పైగా వ్యవసాయ పంపుసెట్లు ఉన్నాయి. ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథ, మున్సిపల్ నీళ్ల వినియోగం 42 శాతంగా ఉండగా, అది ఈ దఫా 45 శాతానికి చేరుతుందని అంచనాలున్నాయి. దాంతో వ్యవసాయ వినియోగంపై నియంత్రణ కూడా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

# విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

>> విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, విద్యార్థుల భద్రత వంటి అనేక సమస్యలు పేరుకుపోయినా రాష్ట్ర ప్రభుత్వం వాటి పరిష్కారంపై నిరక్ష్య వైఖరిని అవలంబిస్తోందని వామపక్ష విద్యార్థి సంఘాలు (ఎస్ఎఫ్ఐ,ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, ఎఐడిఎస్ఓ, ఎఐఎఫ్‌డిఎస్,ఎఐఎస్‌బి,ఎఐపిఎస్‌యు) రాష్ట్ర కమిటీలు విమర్శించాయి.

తెలంగాణ రాష్ట్ర విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈనెల 10వ తేదీన కెజీ నుండి పిజి వరకు విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తు న్నామని ఈ బంద్ కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాప కులు, ప్రజలు, తల్లిదండ్రులు, మేధావులు సహకరించి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.బుధవారం ముఖ్దూం భవన్‌లో విలేకరుల సమావేశంలో ఎస్.రజనీకాంత్, టి.నాగరాజు (ఎస్ఎఫ్ఐ), కె.మణికంఠ రెడ్డి, పుట్టా లక్ష్మణ్ (ఎఐఎస్ఎఫ్), పొడపంగి నాగరాజు (పిడిఎస్‌యు), పల్లె మురళీ, గడ్డం నాగర్జున (ఎఐఎఫ్‌డిఎస్), నీతీష్ (ఎఐడిఎస్ఓ), మన్నె కుమార్ (ఎఐపిఎస్‌యు)లు మాట్లాడారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్య త. కానీ ప్రభుత్వం ఆ బాధ్యతను విస్మరించి విద్యారంగాన్ని నిరక్ష్యం చేస్తోంది.

విద్యను కాపాడుకోవడం, ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడం, విద్యార్థుల హక్కులను సాధించుకోవడం కోసం జూలై 10న జరిగే విద్యా సంస్థల బంద్‌ను రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల తెలంగాణ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేస్తోంది. అనంతరం బంద్ పోస్టర్లు ను ఆవిష్కరించారు.

# ఉత్తరాదికి వరద ముంపు

>> అస్తవ్యస్తమైంది. పలు రహదారులు మూసివేయగా, కాంగ్రా, మండి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. షిమ్లా, మనాలి, ధర్మశాల వంటి పర్యాటక ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. జమ్మూ కశ్మీర్‌లోనూ రుతుపవనాలు ప్రవేశించాయి. దోడా జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు సంభవించాయి. పలు రహదారులు దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జూలై ఐదో తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు, మెరుపులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

ఆకస్మిక వరదలతో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది.మహారాష్ట్రలో భారీ వర్షాలతో ముంబై, థానే, పాల్ఘర్ జిల్లాలు తీవ్ర ప్రభావానికి గురయ్యాయి. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. మల్షేజ్ ఘాట్‌లో స్వల్పంగా కొండచరియలు విరిగిపడ్డాయి. ముంబైలో నీటిమునక కారణంగా ట్రాఫిక్ నెమ్మదించగా, సబర్బన్ రైల్వే సేవలు కూడా ఆలస్యంగా నడుస్తున్నాయి.ఉత్తరాఖండ్‌లో జూన్ ముప్పై తేదీన రుతుపవనాలు ప్రవేశించాయి. డెహ్రాడూన్‌లో భారీ వర్షాల కారణంగా పలు ప్రాంతాలు నీటమునిగాయి.

కేదార్‌నాథ్ యాత్రకు సంబంధించిన హెలికాప్టర్ సేవలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. డెహ్రాడూన్, నైనిటాల్, హరిద్వార్, పౌరీ గఢ్వాల్ జిల్లాలకు ఆరెంజ్, రెడ్ అలర్ట్‌లు కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.ట్యాగ్:దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు.

# 17 జిల్లాల్లో లోటు వర్షపాతం

>> ఇందుకు కారణమని రాష్ట్ర వాతావరణ విభాగం తెలిపింది. ఇక జూన్ 1 నుంచి జూన్ 30 మధ్య హైదరాబాద్‌లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, మొత్తం 17 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉంది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘం వర్షపాత గణాంకాల ప్రకారం, జూన్ నెలలో రాష్ట్రం సగటు వర్షపాతం 130 మిల్లీ మీటర్లు కాగా, కేవలం 115 మిలీన మీటర్లు కురిసింది. అంటే 15 మిల్లీ మీటర్ల మేర లోటు వర్షపాతం నమోదైంది. అయితే, నిరుడు జూన్‌లో కూడా కేవలం 104 మిల్లీ మీటర్ల వర్షమే కురవడం గమనార్హం.

అలాగే 2024 జూన్‌లో 159 మిల్లీ మీటర్ల వర్షపాతం రికార్డయింది. ఇక జూలైలో సగటున 227 మి.మీ మిల్లీ మీటర్ల, ఆగస్టులో 215 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాలి. రాష్ట్రంలో జూన్‌లో హన్మకొండ జిల్లాలో అత్యల్పంగా కేవలం 40 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక్కడ జూన్ సగటు వర్షపాతం 142 మిల్లీ మీటర్లుగా ఉంది. లోటు వర్షపాతం నమోదైన జిల్లాల్లో వరంగల్, సిద్దిపేట, మేడ్చల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, గద్వాల, భువనగిరి, మంచిర్యాల, జనగాం, జగిత్యాల, సిరిసిల్ల, వనపర్తి, మెదక్, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలున్నాయి.

ఇదే సమయంలో రాష్ట్రంలోని నల్గొండ, రంగారెడ్డి, సూర్యాపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోనే సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఇక ఖమ్మం, ములుగు, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, వికారాబాద్, నారాయణపేట్, భద్రాద్రి, పెద్దపల్లి, నిర్మల్, ఆసిఫాబాద్, కామారెడ్డి జిల్లాల్లో సాధారణ వర్షపాతం కురిసింది. మొత్తంగా జూన్ నెలలో రాష్ట్రంలోని 12 జిల్లాల్లో సాధారణ, 4 జిల్లాల్లో సాధారణం కంటే అధికంగా, 17 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

# ఢిల్లీలో జపాన్ ప్రధాని

**న్యూఢిల్లీ, జూలై 1:** జపాన్ ప్రధానమంత్రి సనే తకైయిచి మూడు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం బుధవారం ఢిల్లీకి చేరుకున్నారు. విమానాశ్రయంలో కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటన జూలై 1 నుంచి 3 వరకు కొనసాగనుండగా అత్యంత కీలకంగా భారత్ జపాన్ 16వ వార్షిక శిఖరాగ్ర సమావేశం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు భారత్‌కు వచ్చిన తకైచి ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఈ సమావేశంలో వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ సహకారం, సెమీకండక్టర్లు, కృత్రిమ మేధస్సు, కీలక ఖనిజాలు, స్వేచ్ఛాయుత ఇండోపసిఫిక్ వ్యూహం తదితర అంశాలపై ఇరు దేశాలు చర్చించనున్నాయి.

అలాగే ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై కూడా అభిప్రాయాలు పంచుకోనున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. ప్రధానమంత్రి పదవి చేపట్టిన తర్వాత తకైచి భారత్‌కు రావడం ఇదే తొలి అధికారిక పర్యటన. ఈ పర్యటనతో భారత్ జపాన్ ప్రత్యేక వ్యూహాత్మక, గ్లోబల్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.

# అత్యంత కనిష్టానికి వర్షపాతం

## సాధారణం కంటే 40 శాతం లోటు

## దీర్ఘకాల సగటు 165.3 మిల్లీ మీటర్లకు 99.5 నమోదు

## 126 యేళ్ల చరిత్రలో మూడో అత్యంత అల్పం



**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఈ ఏడాది జూన్ నెలలో గత 126 ఏళ్ల చరిత్రలోనే మూడో అత్యంత దారుణమైన అల్ప వర్షపాతం నమోదైంది. ఈ ఏడాది జూన్ వర్షపాతం రికార్డు స్థాయిలో అత్యంత కనిష్టానికి పడిపోయి సగటున తీవ్రమైన లోటును నమోదు చేసింది. జూన్ చివరి నాటికి దేశవ్యాప్తంగా కేవలం 99.5 మిల్లీమీటర్ల నైరుతి రుతుపవనాల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణంగా కురవాల్సిన వర్షపాతం కంటే ఏకంగా 40 శాతం లోటు కావడం గమనార్హం. దీర్ఘకాల సగటు (ఎల్‌పిఎ) 165.3 మిల్లీమీటర్లకు గాను, కేవలం 99.5 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే కురిసి గణనీయంగా భారీ లోటుకు దారి తీసింది. భారత వాతావరణ శాఖ ప్రకారం 1901 నుంచి ఇప్పటి వరకు కేవలం నాలుగు సార్లు మాత్రమే జూన్ నెలలో దేశవ్యాప్తంగా 100 మిల్లీమీటర్ల కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఇందులో అత్యంత దారుణమైన ఏడాదిగా 2009 నిలిచింది. అప్పట్లో కేవలం 87.5 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. ఆ తర్వాత 1905లో 92.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఈ ఏడాది జూన్ నెల ఆ తర్వాతి స్థానాన్ని ఆక్రమించింది. గతంలో 2014లో 93 మిల్లీమీటర్లు, 1926లో 97.4 మిల్లీమీటర్ల మేర జూన్ వర్షపాతం నమోదు కాగా, మరికొన్ని అల్ప వర్షపాత సంవత్సరాలుగా 1902 (109 మిలీమీటర్లు), 1912 (106.8 మిలీమీటర్లు), 1923 (101.7 మిలీమీటర్లు) నిలిచాయి. సాధారణంగా వాతావరణ శాఖ లెక్కల ప్రకారం జూన్ నెల దీర్ఘకాలిక సగటు వర్షపాతం 165 మిల్లీమీటర్ల కంటే ఎక్కువగా ఉండాలి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు దేశంలోకి ఆలస్యంగా ప్రవేశించడమే కాకుండా ఆ తర్వాత సుమారు 11 రోజుల పాటు ఒకే చోట నిలిచి పోయాయి. వ్యవసాయ పరంగా అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోని చాలా భాగాలు.. గుజరాత్‌తో కూడిన మధ్య, ఉత్తర, పశ్చిమ భారతదేశంలోని అధిక ప్రాంతాలకు రుతుపవనాలు ఇంకా విస్తరించలేదు. అలాగే రుతుపవనాలు ప్రవేశించిన మహారాష్ట్ర, ఒడిశా, బీహార్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో కూడా వర్షపాతం సాధారణం కంటే చాలా తక్కువగా నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీకి జూన్ 27నే రుతుపవనాలు రావాల్సి ఉండగా, ఈ గడువు తప్పింది. జులై మొదటి వారంలోనే ఢిల్లీకి వర్షాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ సైంటిస్టులు చెబుతున్నారు. మరోవైపు పసిఫిక్ మహాసముద్రంలో బలమైన ఎల్‌నినో ఎఫెక్ట్ భయాల నేపథ్యంలో ఐఎండీ గత నెలలోనే తన దీర్ఘకాలిక రుతుపవనాల అంచనాను సవరించింది. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో సగటు వర్షపాతం 90 శాతానికి పడిపోవచ్చని పేర్కొంది. ఈ వర్షభావ పరిస్థితుల హెచ్చరికలు దేశంలోని రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. అయితే జూన్ నెలలో వర్షాలు ఆశాజనకంగా లేనప్పటికీ అప్పుడే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వర్షాల విస్తరణను కూడా పరిగణనలోకి తీసుకోవాలని వాతావరణ వాతావరణ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. వాతావరణ శాఖ మాజీ డైరెక్టర్ జనరల్ కేజే రమేష్ మాట్లాడుతూ రుతుపవనాలు విస్తరించిన రాష్ట్రాలలో ఇప్పటివరకు వర్షపాతం బాగానే ఉంది. అంతేకాకుండా గతేడాది కురిసిన భారీ వర్షాల కారణంగా భూగర్భ జలాలు, జలాశయాల పరిస్థితి ప్రస్తుతం అంత దారుణంగా ఏమీ లేదని స్పష్టం చేశారు.

# బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

## బాధితురాలికి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** బాలికపై లైంగిక దాడి ఘటనకు సంబంధించి పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఫోక్సో కేసులో అరెస్టయి చర్లపల్లి జైల్లో రిమాండులో వున్న బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. తనపై నమోదైన ఫోక్సో కేసు రాజకీయ కుట్రలో భాగమని, తాను అమాయకుడినని, ఎలాంటి తప్పు చేయ లేదని భగీరథ్ హైకోర్టుకు విన్నవించడం తెలిసిందే. అక్రమంగా నమోదైన కేసులో నెలన్నరకు పైగా తాను జైల్లో వున్నానని, పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తున్నానని, తనకు వెంటనే బెయిల్ మంజూరు చేయాలని అతను కోరడం విదితమే. భగీరథ్ మంగళవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా దీనిని బుధవారం విచారించిన హైకోర్టు ఈ కేసులో బాధితురాలి వాదనలు కూడా వినాల్సి వుందని, అప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని పేర్కొంది. దీనికి సంబంధించి బాధితురాలికి నోటీసులు జారీ చేసింది. అనంతరం దీనిపై తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. కాగా మే నెల 16వ తేదీన భగీరథ్‌ను పేట్ బషీరాబాద్ పోలీసులు ఫోక్సో కేసులో అరెస్టు చేయడం తెలిసిందే. అప్పటి నుంచి చర్లపల్లి జైల్లో వున్న ఇతనికి జూన్ నెల 20వ తేదీన ఇంజనీరింగ్ పరీక్షల కోసం ఐదు రోజుల మధ్యంతర బెయిల్ లభించగా ఈ గడువు జూన్‌నెల 26వ తేదీన ముగియడంతో మేడ్చల్ కోర్టులో భగీరథ్ లొంగిపోగా పోలీసులు తిరిగి జైలుకు తరలించారు. భగీరథ్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను మేడ్చల్ కోర్టు డిస్మిస్ చేయడంతో అతను హైకోర్టును ఆశ్రయించగా దీనిపై వాదనలు మొదలయ్యాయి.

# ఛార్టర్ట్ అకౌంటెంట్లకు శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై1:** దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులు వేస్తూ, పారదర్శకత, జవాబుదారీతనం, నైతిక విలువలను పరిరక్షిస్తూ నిరంతరం సేవలందిస్తున్న చార్టెర్డ్ అకౌంటెంట్లందరికీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఛార్టెర్డ్ అకౌంటెండ్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపార సంస్థలకు, పెట్టుబడిదారులకు విశ్వసనీయమైన సలహాదారులుగా, ప్రభుత్వ ఆర్థికవిధానాలను అమలు చేయడంలో తోడ్పడుతూ బాధ్యతాయుతమైన భాగస్వాములుగా ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ప్రశంసనీయమైన పాత్రను పోషిస్తున్నారని పేర్కొన్నారు. నిబద్ధత, క్రమశిక్షణ, నిజాయితీ దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠపరుస్తూ సుస్థిర అభివృద్ధికి బాటలు వేయడంలో చార్టెర్డ్ అకౌంటెంట్ల పాత్రఎంతో కీలకమైనదన్నారు.దేశప్రగతికి తమ మేధస్సు, నైపుణ్యం, అంకిత భావంతో సేవలందిస్తున్న చార్టెర్డ్ అకౌంటెంట్లు మరిన్ని విజయాలు సాధించి దేశఆర్థికవ్యవస్థను పటిష్టం చేయడంలో మరింత తోడ్పడాలని ఆకాంక్షించారు.



బుధవారం మహేష్‌గౌడ్‌కు ఆహ్వానపత్రం చేస్తున్న మహంకాళిదేవాలయ కమిటీ

# 20నుంచి 3 రోజుల పాటు ఢిల్లీలో బోనాలు

## మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆహ్వానించిన మహంకాళి దేవాలయ కమిటీ

**హైదరాబాద్, జూలై1,ప్రభాతవార్త:** తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలకు రావాలని టిపిసిసి అధ్యక్షులు,ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌ను లాల్‌దర్వాజా సింహవాహిని శ్రీమహంకాళి దేవాలయంకమిటీ చైర్మన్ జి.అరవింద్ కుమార్ గౌడ్ ఆహ్వానం పలికారు. బుధవారం మహేష్ కుమార్‌గౌడ్‌ను నార్సింగ్‌లోని వారి నివాసంలో అరవింద్ కుమార్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సన్మానించి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఢిల్లీలో జరిగే బోనాల ఉత్సవాలకు తప్పకుండా వస్తానని మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు. మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన వారిలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు కె.వెంకటేష్, ఎ.బద్రినాథ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# మొదలైన ఆపరేషన్ ముస్కాన్-12

## వీధి బాలలు, అదృశ్యమైన చిన్నారులు, బాల కార్మికులను గుర్తించేందుకు సిఐడి ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతీ ఏడాది జనవరి, జూలై నెలల్లో కొనసాగే ఆపరేషన్ ముస్కాన్ ఈ సంవత్సరం రెండవ దఫాగా బుధవారం మొదలయ్యింది. ఈనెలాఖరు వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమానికి ఆపరేషన్ ముస్కాన్-12గా నామకరణం చేశారు. వీధి బాలలు, అదృశ్యమైన చిన్నారులు, బాల కార్మికులను గుర్తించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, కమిషనరేట్ల పరిధుల్లో పోలీసులతో పా టు స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జిఓలు ఇందులో పాల్గొంటాయి. గత ఏడాది జూలై నెలలో జరిగిన ఆపరేషన్ ముస్కాన్ సందర్భంగా వీధి బాల లు, బాల కార్మికులు మొత్తం 7678మందిని పోలీసులు రక్షించారు. ఇందులో 7149 మంది బాలలు వుండగా 529 మంది బాలికలు వున్నారు. వీరిలో ఒడిషా, బిహార్, ఎంపి, రాజస్తాన్‌తో పాటు నేపాల్‌కు చెందిన 3783 మంది వున్నారు. వీరిలో 6718 మంది బాల కార్మికులు, 357 మంది వీధి బాలలు, 42 మంది యాచక బాలలు, ఇద్దరు వెట్టి చాకిరిలో వున్న వారు వున్నారు. వీరితో పాటు 559 మంది ఇతర చోట్ల పనిచేస్తున్న వారు వున్నారు. ఈ సందర్భంగా బాలలచేత పనిచేయిస్తున్నందుకు ఆయా ప్రాంతాలలో కంపెనీలు, ఇటుక బట్టీలు, సంస్థలపై 1713 కేసులు నమోదు చేసి 1718 మందిని అరెస్టు చేశారు. కాగా రక్షించబడ్డ బాలల్లో 6593 మందిని వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చగా అనాధలుగా వున్న 1049 మంది బాలలను ఆయా ప్రాంతాల హోంలకు తరలించారు. వీరికి ఎన్‌జిఓలతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారం తో విద్యా బుద్దులు నేర్పుతున్నారు.

ఆపరేషన్ ముస్కాన్ అమలు కోసం వీధుల్లో తిరిగే బాలలు, బిక్షాటన చేసే బాలలు, చెత్త ఏరుకునే వారిని గుర్తించేందుకుగానూ పోలీసులకు ఎన్‌జిఓలు, స్వచ్ఛంద సంస్థలు సహాయం చేస్తున్నాయి. దీనిపై ఆయా ప్రాంతాల ఎన్‌జిఓలు, స్వచ్ఛంద సం స్థలు తమ వద్ద వున్న అనాధ బాలలు, వీధిబాలలు, బాల కార్మికులకు సంబంధించిన సమాచారాన్ని పోలీ సులకు అందించాయి.కంపెనీల్లో ఇటుక బట్టీల్లో చాలా కాలంగా బాల కార్మి కులతో పనిచేయిస్తుండడంతెలిసిందే. దీనిపై నిషేధం వున్నా ఎక్కడా అమలవడంలేదు.ఆపరేషన్ ముస్కాన్ సందర్భంగా బాల కార్మికులు ఎక్కువగా పట్టుబడేది ఇక్కడే కావడం గమనార్హం. దీంతో రాష్ట్రంలో ఇటుక బట్టీల వివరాలను పోలీసులు ముందుగానే సేకరించి దాడులు మొదలు పెట్టారు. కాగా ఆపరేషన్ ముస్కాన్ 12ను సిఐడి చీఫ్ చారు సిన్హా స్వయంగా పర్యవేక్షించసాగారు.

# కత్తి వెంకటస్వామికి షోకాజు నోటీసు

**హైదరాబాద్,జూలై1,ప్రభాతవార్త:** ఎఐసిసి ఒబిసి కన్వీనర్, టిపిసిసి జనరల్ సెక్రటరీ కత్తి వెంకటస్వామికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎంపి మల్లు రవి షోకాజు నోటిసు బుధవారం జారీచేశారు. కాంగ్రెస్ పార్టీపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పలు సామాజిక వేదికలు,టి వి షోలలో పార్టీ అస్థిత్వంకు ,ముఖ్యమంత్రి పరువుకు భంగం కలిగించేలా కత్తివెంకటస్వామి మాట్లాడుతున్నారని మూడు రోజుల్లో గా వివరణ ఇవ్వాలని షోకాజు నోటిసులు జారీచేశారు. ఏదైనా సంకటపరిస్థితి ఉంటే వాటిని పార్టీ అం తర్గత వేదికలపై మాట్లాడుకోవాలని ఇలా బహిరంగంగా చర్చకు పెట్టడం తగదని ఆయన వైఖరికి విపరీతంగా ఉందని మూడు రోజుల్లో రాతపూర్వకంగా వ్యక్తిగతంగా వచ్చి వివరణ ఇచ్చుకోవాలనీ ఆదేశించారు.

# ఆదాయ సమీకరణకు ఛేజింగ్ సెల్ ఏర్పాటు

## అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసిన సిఎం రేవంత్‌రెడ్డి



బుధవారం అధికారులతో చర్చిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు, భట్టి, ఉత్తమ్, జూపల్లి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై1:** ఆదాయ సమీకరణపై అధికారులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలను సాధించడానికి ఆదాయ సమీకరణపై కచ్చితంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. లీకేజీలను అరికట్టి ఆదాయ సమీకరణకు సంబంధించి చేజింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షి ంచాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై బుధవారం ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షి ంచారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె రామకృష్ణా రావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆదాయ పెంపు విషయంలో ముఖ్యమంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలిచ్చారు. హెచ్‌ఎండీఏ, టీజీఐఐసీ ఆదాయ సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, మైనింగ్‌తో పాటు ఇతర శాఖలకు సంబంధించి లీకేజీలను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. ఆదాయ సమీకరణలో చేజింగ్ సెల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిరక్ష ్యం వీడాల్సిందేనని అధికా రులకు స్పష్టం చేశారు.

అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీగా సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా శాఖలవారిగా బడ్జెట్‌ను తయారు చేసుకోవాలని చెప్పారు. ప్రాజెక్టులకు సంబంధించి ప్రధానంగా భూసేకరణను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని అన్నారు.

ప్రభుత్వం ప్రతిపాదించే బడ్జెట్ ఊహాజనితం కాదన్న విషయం గుర్తుపెట్టుకోవాలని, వాస్తవికత ఆధారంగానే బడ్జెట్ రూపకల్పన జరగాలని స్పష్టం చేశారు. ఆయా శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఎఐ టెక్నాలజీని ఉపయోగించుకుని లబ్దిదారుల జాబితాను డిబి

# వివాహం పేరిట బాలిక కిడ్నాప్, లైంగిక దాడి

## నిందితుడికి 20 యేళ్ల కఠిన శిక్ష విధించిన కోర్టు



నిందితుడు మహమ్మద్ అఫ్రోజ్

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** బాలికను ప్రేమ పేరుతో నమ్మించి వివాహం చేసుకుంటానని మభ్యపెట్టి, ఆమెను కిడ్నాప్ చేసి, పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డ యువకుడికి రాజేంద్రనగర్ ఫోక్సో కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు మూడు వేల రూపాయల జరి మానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పింది. వివరాలు ఇలావున్నాయి. సైబరాబాద్ పరిధిలోని చందానగర్‌లో 2020 మార్చి నెలలో ఈ ఘటన వెలుగు చూసింది. కర్నాటకకు చెందిన మహమ్మద్ అఫ్రోజ్ (23) రామచంద్రపురం పరిధిలో గల లింగంపల్లిలో వుంటూ ఆటో డ్రైవర్‌గా స్థి రపడ్డాడు. తానుండే ప్రాంతంలో పరిచయం అయిన ఓ మైనర్ బాలికను ప్రేమ పేరిట ఇతను వంచించాడు. ఈ విషయం బాలిక కుటుంబీకుల కు తెలియడంతో అఫ్రోజ్‌ను మందలించారు. అయినా అతను తన పద్దతి మార్చుకోలేదు. దీని తరువాత 2020 మార్చి 15వ తేదీన మైనర్ బా లికను ఇంట్లో ఒంటరిగా వున్న సమయంలో ఆటోలో కిడ్నాప్ చేశాడు. అదే రోజు సాయంత్రం బాలిక తల్లి చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చే సింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు బాలికను వెంటనే రక్షించినా అఫ్రోజ్ మాత్రం 2020 జూలై 10వ తేదీన పట్టుబడగా వెంటనే అరెస్టు చేసి ఫోక్సో సెక్షన్ల కింద రిమాండుకు తరలించారు. ఈ కేసుపై ఆరేళ్లుగా రాజేంద్రనగర్‌లోని ఫోక్సో కోర్టులో వాదనలు జరుగుతున్నాయి . దీనిపై బుధవారం నాడు ఫోక్సో కోర్టు స్పెషల్ జడ్జి టి.శ్రీనివాస్ తీర్పును వెలువరిస్తూ మైనర్ బాలికను ప్రేమ పేరుతో కిడ్నాప్ చేయడంతో పాటు పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డ మహమ్మద్ అఫ్రోజ్‌కు 20ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు మూడు వేలరూపాయల జరిమానా విధించారు. ఈ కేసు లో బాధిత బాలికకు శిక్షపడ్డ అఫ్రోజ్ లక్ష రూపా యల నష్ట పరిహారం చెల్లించాలని స్పెషల్ జడ్జి తీర్పు చెప్పారు.దీని తరువాత నిందితుడు అఫ్రోజ్‌ను చందానగర్ పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# ఎస్‌బిఐలో ఘనంగా 71వ బ్యాంక్‌దినోత్సవం

## మూడు విద్యా సంస్థలకు వాహనాల విరాళం



**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 71వ బ్యాంక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వాసం, ఆర్థిక సమ్మిళితం, దేశ నిర్మాణంలో తన ఏడు దశాబ్దాల వారసత్వాన్ని ఈ సందర్భంగా పునరుద్ఘాటించింది. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన బ్యాంక్ దినోత్సవ కార్యక్రమంలో సామాజిక బాధ్యత కింద మూడు విద్యా సంస్థలకు వాహనాలను విరాళంగా ఇచ్చింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)కు మద్దతుగా స్థానిక విద్యా, సంక్షేమ సంస్థలకు మూడు యుటిలిటీ వాహనాలను విరాళంగా అందించింది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ లోని ఒక ప్రైవేటు విద్యా సంస్థకు ప్రత్యేక మినీవ్యాన్‌ను, మరో హైదరాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌కు భవిష్యత్ ఆరోగ్య సంరక్షణ నిపు ణులు, అధ్యాపకుల రోజువారీ ప్రయాణానికి 52సీట్ల బస్సును అందించింది. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా 11 మంది బ్యాంక్ మెడికల్ ఆఫీసర్లు, నిపుణులు మరియు ఆరోగ్య సంరక్షణ సలహాదారులను, చార్టర్డ్ అకౌంటెంట్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇరువురు ఆడిటర్లను హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ (సిజిఎం) నీలేష్ ద్వివేది సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీజీఎంసీడీఓ సురజిత్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

# పి.వి.నరసింహారావు జీవితాన్ని పరిశోధించాలి: డా. కె.కేశవరావు



డా. కె.కేశవరావును సత్కరిస్తున్న రమణాచారి, కిషన్‌రావు, ప్రభాకర్‌రావు, ఉదయవర్లు తదితర అతిథులు

**నాంపల్లి, జూలై 1 ప్రభాతవార్త:** భారతరత్న పి.వి. నరసింహారావు బహుముఖ ప్రజ్ఞాశాలి, బహు భాషా కోవిదుడు, రచయిత, న్యాయవాది, భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలను తీసుకువచ్చారని, గొప్పరాజకీయవేత్తగా దేశ రాజకీయాల్లో ఎన్నో అత్యంత అత్యున్నతస్థాయి పదవులతోసహా భారతదేశ ప్రధానమంత్రి పదవులను చేపట్టి దేశాన్ని అభ్యున్నత శిఖరాలు అధిరోహించే దిశలో పయనింపజేశారని అందరూ ప్రశంసించడం సర్వసాధారణమే కానీ ఆయన జీవితాన్ని తప్పక పరిశోధించి పరిశీలించాల్సిన ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అప్పుడే ఆయన్ను పూర్తిగా తెలుసుకున్న వారమవుతాయని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ రాజకీయవేత్త డా. కె.కేశవరావు అన్నారు. శ్రీకృష్ణ దేవ రాయ తెలుగు భాషానిలయం ఆధ్వర్యంలో డా. రావిచెట్టు రంగారావు సభామందిరంలో భాషానిలయం అధ్యక్షుడు డా. కె.వి. రమణాచారి సభా ధ్యక్షతన జరిగిన పి.వి.నరసింహారావు జయంతి సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.కేశవరావు డా. వి.కిషన్‌రావు, డా. పి.వి.ప్రభాకర్‌రావు, భాషానిలయం గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు తదితరులతో కలిసి పివి చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి భారతరత్న పి.వి.నరసింహారావు ఒక వాక్చిత్రం పుస్తకాన్ని ఆవిష్కరించి బహుముఖ ప్రజ్ఞాశాలి పి.వి.నరసింహారావు స్మారక ప్రసంగం చేసి ఆయనతో ఉన్న సాన్నిహిత్యాన్ని, అత్యున్నత లక్షణాలను సవివరపరిచారు. చివరిగా పివి జయంతిని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన పాఠశాలస్థాయి విద్యార్థుల వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులను ప్రదానం చేసి శుభాశీస్సులందజేశారు. ఈ సందర్భంగా అతిథులు డా. కె.వేశవరావును ఘనంగా సత్కరించారు.

# మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి అజారుద్దీన్

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** తెలంగాణ లోని మైనారిటీల సామాజిక, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ స్పష్టం చేశారు. మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (టీజీఎంఎఫ్‌సి) ప్రధాన కార్యాలయంలో ఛైర్మన్ మహమ్మద్ ఒబెదుల్లా కొత్వాల్ అధ్యక్షతన జరిగిన సంస్థ 29వ బోర్డు సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. తెలంగాణలో కొనసాగుతున్న, రాబోయే మైనారిటీ సంక్షేమ పథకాలకు టీజీఎంఎఫ్‌సీ 29వ బోర్డు సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ మైనారిటీల విద్య, స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయ పథకాలపై బోర్డు సుదీర్ఘంగా చర్చించిందని తెలిపారు.

# హరీశ్‌రావు, కెటిఆర్ వస్తే చర్చకు నేడు రడీ

## సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్,జూలై 1,ప్రభాతవార్త:** హరీష్‌రావు కెటిఆర్ గురువారం ఉదయం 11 గంటలకు సంక్షేమ గురుకులాల్లో అవినీతిపై చర్చకు వస్తారంటే తాను కూడా రావడానికి సిద్ధంగా ఉన్నానని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కమాం తెలిపారు. సంక్షేమ గురుకులాల్లో అవినీతి జరిగిందంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్న బిఆర్‌ఎస్ నేతలు నా సవాల్ కు స్పందించి ముందుకు రావాలని కోరారు..ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ముందుగా మీ నాయకులు హరీశ్‌రావు, కెటిఆర్‌లను తీసుకురండి అని సూచించారు. మేమూ ముగ్గురం మంత్రులం వస్తామనీ తెలిపారు.వారిద్దరూ కాకుండా ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఒక్కరే వస్తే మీస్థాయికి మా కాంగ్రెస్ అధికార ప్రతినిధులే సరిపోతుందని తెలిపారు. మీకు అన్ని ఆధారాలతో చర్చకు వాళ్ళు సిద్ధంగా ఉంటారనీ తెలిపారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై సిఎస్ సంజయ్ జాజు సమీక్ష



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై 1:** రాష్ట్రంలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు తీరును పర్యవేక్షి ంచిన నోడల్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో గుర్తించిన సమస్యలు, సవాళ్లను సిఎస్‌కు వివరించారు. అలాగే జిల్లాలలో అమలు చేసిన వినూత్న విధానాలతో సానుకూల ఫలితాలు వచ్చాయని, వాటిని ఇతర జిల్లాల్లో కూడా అమలు చేయవచ్చని సూచించారు. జిల్లా కలెక్టర్లతో చర్చించి సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నోడల్ అధికారులను ఆదేశించారు. ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ 99 రోజుల కార్యక్రమంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలను అందించారు. కార్యక్రమంలోని వివిధ అంశాల కింద ఇప్పటివరకు సాధించిన పురోగతిని ఆయన వివరించారు. ఈ సమీక్షాసమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, నోడల్ అధికా రులు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్న అల్లం, ఉల్లి

## వారం రోజుల్లోనే భారీగా పెరుగుదల

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** తెలంగాణలో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, మసాలా దినుసుల ధరలు సామాన్య ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ముఖ్యంగా వంటల్లో ప్రతిరోజూ ఉపయోగించే అల్లం, ఉల్లిగడ్డల ధరలు వారం రోజుల్లోనే భారీగా పెరిగాయి. మార్కెట్ ఒడిదుడుకులు, అంతరాష్ట్ర సరఫరాలో తలెత్తిన అంతరాయాల కారణంగా వీటి ధరలు అమాంతం పెరిగాయి. గత వారం రోజుల్లోనే కిలో అల్లం ధరపై దాదాపు రూ.70 వరకు అదనపు భారం పడింది. కిందటి వారం మార్కెట్లో కిలో అల్లం ధర రూ.150 పలకగా బుధవారం నాటికి అది ఏకంగా రూ.220కి చేరుకుంది. ఉల్లిపాయలు కూడా అదే బాటలో వినియోగదారుల కళ్లల్లో నీళ్లు తెప్పిస్తున్నాయి. వారం క్రితం హోల్‌సేల్ మార్కెట్లలో ఒక టన్ను ఉల్లి ధర రూ.2,400 ఉండగా, ప్రస్తుతం అది రూ.3,400కు పైగా పలుకుతోంది.


**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు**

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)

తేది: 01.07.2026

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి అబేంద్కర్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షులు/జనరల్ సెక్రెటరీ అయిన శ్రీ చేపూరి రాజు గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) శ్రీ చేపూరి రాజు (2) శ్రీ తలరి రత్నయ్య గారు (3) శ్రీ చేపూరి శంకరయ్య గారు ప్రధాన కార్యవర్గ సభ్యులు; మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము ఇం.నం. 7-276/1, ప్లాంట్ నం: 36, 2వ అంతస్తు, శక్తి నగర్, జిల్లెలగూడ, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500097. సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, DTCP భవనము, A.C గార్డ్స్, హైదరాబాద్-500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు అబేంద్కర్ నేషనల్ కాంగ్రెస్‌ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

శ్రీ చేపూరి రాజు రాష్ట్ర అధ్యక్షులు,
అబేంద్కర్ నేషనల్ కాంగ్రెస్.

**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**

సమాచార ప్రకటన

రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా, "ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్" 01 ఏప్రిల్ 2024 నుండి "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌తో" విలీనం చేయబడింది. SARFAESI చట్టం, 2002 ప్రకారం వేలం ప్రక్రియ ద్వారా AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంక్) అమ్మబోతున్న తాకట్టు ఆస్తి క్రింది పట్టికలో పేర్కొన్నది) నుండి, క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు తమ చరాస్తులను తరలించాలని తెలియజేయడమైనది. లేని పక్షంలో, ఆ చరాస్తులు వారి సొంత ఖర్చుతో ఏదైనా అద్దె ప్రదేశానికి తరలించబడతాయి మరియు 15 రోజులలోపు వాటిని తరలించని పక్షంలో, తరలింపు సమయంలో జరిగే ఏదైనా నష్టానికి కూడా వారే బాధ్యత వహించవలసి ఉంటుంది. ఇతర సందేహాల కోసం సంప్రదించండి: శ్రీ దేవలపల్లి రమేష్ 9704404734 లేదా సమీప శాఖ వద్ద.

రుణ ఖాతా నం./రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారుపేరు

(Loan A/C No.) L23660000362747 & L23660002405033, వీరంపల్లి ఎల్లయ్య (సహ-రుణగ్రహీత) వీరంపల్లి కృష్ణవేణి (సహ-రుణగ్రహీత)

తనఖా పెట్టిన ఆస్తి వివరణ: మహబూబ్‌నగర్ జిల్లా (తెలంగాణ), కోయిల్‌కొండ మండలం, లింగుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లింగుపల్లి గ్రామ శివారు అంగుపల్లి గ్రామ కంఠం పరిధిలో ఉన్న స్థిరాస్తి. ఇది 200-00 చదరపు గజాల విస్తీర్ణంలో ఉంది, 1288.00 చదరపు అడుగుల విస్తీర్ణంతో RCC పైకప్పు కలిగిన ఇంటి నిర్మాణం ఇంటి నం. 5-42 కలిగి ఉంది.

(Loan A/C No.) L22660001144062, ఎం.డి గౌస్ పాష (రుణగ్రహీత), బేగం (సహ-రుణగ్రహీత)

తనఖా పెట్టిన ఆస్తి వివరణ: మహబూబ్‌నగర్ జిల్లా, కోయిల్‌కొండ మండలం, కోయిల్‌కొండ గ్రామం, కోయిల్‌కొండ గ్రామ కంఠం వద్ద ఉన్న స్థిరాస్తి ఇంటి నం. 7-69A1, విస్తీర్ణం 100.00 చదరపు గజాలు; 616 చదరపు అడుగుల RCC పైకప్పు కలిగిన భవనం. దీని సరిహద్దులు.

(Loan A/C No.) L22660001213003, పోతేదార్ సతీష్ కుమార్ (రుణగ్రహీత) విజయ లక్ష్మి పోతేదార్ (సహ-రుణగ్రహీత)

తనఖా పెట్టిన ఆస్తి వివరణ: మహబూబ్‌నగర్ జిల్లా (టి.ఎస్.), మహమ్మదాబాద్ మండలం, నాచెర్ల గ్రామం మరియు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న, 68.00 చదరపు గజాల విస్తీర్ణం మరియు RCC పైకప్పు కలిగిన ఆస్తి ఇంటి నం. 7-7/19.

తేది: 01/07/2026 సం/-అధీకృత అధికారి
ప్రదేశం : మహబూబ్‌నగర్, తెలంగాణ AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్


వార్త

మనం ఎంత నిజాయితీ పరులం అయి ఉంటే, ప్రభుత్వం పరిపాలన అంత చక్కగా సాగుతుంది.

- జఫర్సన్

# 'పెళ్లి' పుస్తకానికి చెదలు!

భారతీయ వైవాహిక వ్యవస్థ కట్టుబాట్లకు ప్రపంచ వ్యాప్తంగా జనం నీరాజనాలర్పిస్తున్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలంటే పాశ్చాత్య దేశాలూ మెచ్చుకోలుగా ప్రస్తావిస్తాయి. ఇదే తరుణంలో వైవాహిక భాగస్వాముల మధ్య వికారాలు కూడా నవ్వులపాలవుతున్నాయి. ఎన్నో వేల సంవత్సరాలుగా ఈ కట్టుబాట్లకు అగ్రస్థానమిస్తున్నాం. రెండు వేర్వేరు కుటుంబాల నుంచి వచ్చిన ఒక ఆడ మగా పాణిగ్రహణం పూర్తయ్యాక ఒకరినొకరు అర్థం చేసుకుని తరించడమే అందులోని అంతరార్థం. పవిత్ర ధర్మంలా ఆచరించి నూరేళ్లు పండించుకోవడమే కీలకం. వరకట్నాలు, కన్యాశుల్కాల వంటి ఆచారాలకు కాలదోషం పట్టి ఇప్పుడు భార్యాభర్తల అనురాగ మైత్రి మాత్రమే జీవితానుబంధంగా పెనవేసుకుపోతుందని చాటి చెప్పగల రోజుల్లో జీవిస్తున్నాము. ప్రాశ్చాత్య దేశాలలో కలిసికట్టుగా ఉండలేని కాంట్రాక్టు ఉన్నా లేకున్నావద్దనుకుంటే తప్పుకాదు. వారి మధ్య ఏవిధమైన ఆత్మీయ బంధాలు ఉండవు. అక్కడేమీ ఎలాంటి అభ్యంతరాలుండవు. అనుమానాలుండవు. విపరీత వికృత వికారాలు తక్కువే. అలా సాగిపోయే వ్యవస్థనూ తప్పుపట్టలేం. కానీ భారతీయ సంస్కృతికి పట్టుకొమ్మగా ఎంతో బలిష్టమైన నియమ నిబంధనలు ఉన్నాయంటూ ఎన్నో వందల ఏళ్లుగా చెప్పుకునే వైవాహిక వ్యవస్థ కొన్ని వెర్రితలలు వేస్తోంది. సాఫ్ట్‌వేర్ చదువులొచ్చాక యువతలో కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలు ఏర్పడడం కొందరు వివాహం ఆలస్యం చేసుకోవడం, కొందరు వయసు మళ్లుతున్నా వివాహం వైపు దృష్టి మరల్చుకోకపోవడం వంటి ఆలోచనల్లో పడ్డారు. ఇదే సమయంలో ప్రపంచం యావత్తూ ఇదేదో కొత్తగా ఉందనుకుంటున్న డేటింగ్ సంస్కృతి, సహజీవనం వంటి కొత్త పోకడలతో పోటీపడుతున్న పరిస్థితినీ గమనిస్తున్నాము. వివాహం, ప్రేమ, అప్యాయతలు, అనురాగాలకు, అనుబంధాలకు ఆటపట్టుగా ఉంటుంది. ఇప్పుడు జరుగుతున్న కొన్ని ఘటనలు చూస్తే కట్టుబాట్లకు విలువల్లేకుండా మారిపోయాయి. యువత ప్రవర్తనలో వికృత ప్రవర్తన బయటపడుతుంది. సమాజం చెడిపోయిందనేంత పెద్ద మాట వాడనక్కర్లేదు కానీ అదే దిశగా పయనిస్తుందేమోనన్న భయం వేయకమానదు. ఏది ఏమైనా వ్యవస్థ కుళ్లిపోవడం మొదలౌతోందని అనుకున్నప్పుడే మందు ఎలావేయాలో ఆలోచించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. యువత వికృత చేష్టలకు పాత తరాల వారయితే కంగారు పడుతున్నారు. వివాహ వ్యవస్థలో భాగస్వాములకు ఒకరి మీద ఒకరికి నమ్మకం ముఖ్యం. అదే సన్నగిల్లి ఒకరి చావును మరొకరు కళ్లారా చూడాలనుకున్న కొన్ని ఉదంతాలను గూర్చి చర్చించుకోవాలి. ఉత్తరాఖండ్‌లోని ముస్సోరిలో జరిగిన విశాఖ పట్నంకు చెందిన రాధా గాయత్రి హత్యకేసు, పూణెలో కేతన్ అగర్వాల్ హత్య కేసులను విశ్లేషించుకుంటే అన వసర కారణాలు, అనుమానాలతో తనను నమ్మి వచ్చిన భాగస్వాములను పరలోకానికి పంపి తమ జీవితాలను ఎలా జైళ్లపాలు చేసుకున్నారో అర్థమవుతుంది. ఇవే ఇప్పు డు వివాహ వ్యవస్థను కుదిపేసాయి. వ్యవస్థకు చెదలు పడుతున్నట్లు చెప్పుకోవచ్చు. పెళ్లంటే ఇష్టం లేకపోతే తల్లి దండ్రులకు, చెబితే వాళ్లే సాహసించరు కానీ వాళ్లకు చెప్పి ఒప్పించడం కన్నా కాబోయే వరుడిని చంపడమే తేలికగా భావించి కటకటాలపాలైన పూణె యువతి సియాగోయెల్ వ్యవహారం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పూణెలోని లోహగఢ్ కోటలో ఔత్సాహక పారిశ్రామికవేత్త కేతన్ అగర్వాల్‌తో సియా వివాహం కుదుర్చుకుంది. తనకు అంత క్రితమే పరిచయమున్న ప్రియుడు చేతన్ చౌదరి సాయంతో నమ్మించి లోయలోకి తోసేసింది. కేతన్‌తో పెళ్లి వద్దనుకున్నప్పుడు అప్పటికే కోటి రూపాయలు ఎందుకు తీసుకున్నట్లు? డబ్బు ఇవ్వక్కర్లేకుండా ప్రియుడితో కాలక్షేపం చేసేందుకు ఈ దురాగతానికిపాల్పడి ఉండొచ్చునన్న అనుమానం రాకపోదు. పెళ్లి వద్దని చెప్పేస్తే కేతన్ మరో మంచి సంబంధం చేసుకుంటాడుగా. ఆమె ఆలోచన దుష్కృత్యం వైపు ఎందుకు మళ్లింది. వివాహ బంధాన్ని తేలిక తీసుకున్నట్లు అనుకోవాలి. అంటే తాంబూలాలు మార్చుకుని కూడా తప్పుడు త్రోవతొక్కింది. అతని ప్రాణాల్ని తీసే హక్కు ఆమెకెవరు ఇచ్చారు? ఆ మధ్య మేఘాలయాలో హనీమూన్ హత్యకేసు ఇదే స్థాయిలో సంచలనం సృష్టిం చింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారి రాజా రఘువంశీని సాక్షాత్తు అతని భార్య సోనమ్ తన ప్రియుడి రాజ్‌కుశ్వాహతో కలిసి అత్యంత కిరాతకంగా హత్యచేసింది. మే 23న హనీమూన్ ట్రిప్‌ 'ఫొటోషూట్' కని తీసుకెళ్లి అక్కడ హత్యకు ప్లాన్ చేసింది. ఇక్కడ కిరాయి హంతకులకు రూ.20 లక్షల సుపారీ ఖర్చు. భర్తతో సంసారం చేయలేనని నిర్ణయించుకున్నప్పుడు హుందాగా చెప్పి విడాకులు తీసుకోవచ్చు. ఈకాలంలో అదేదీ తప్పేకాదు. మరి ఇప్పుడే మయ్యింది. ఒకళ్ల ప్రాణం తీయడం అంత సులువా, తీరా జైలు గతిని తప్పించుకోవడం సాధ్యమేనా? ఎందుకు ఆలో చించరు? ముస్సోరిలో విశాఖపట్నంకు చెందిన రాధా గాయత్రి దుర్మరణం మరీ ఘోరం. అనుమానపు భర్తతో హనీమూన్ కెళ్లడమే ఆమె చేసిన తప్పు. అంతిమ నిర్ణయం తీసుకునే లోపు ఓ శాడిస్టు భర్త చేతన్‌కుమార్ మారతాడని చివరి అవకాశం ఇవ్వడమే ఆమె అపరాధమని ఇప్పుడు అందరూ అనుకుంటున్న మాట. పైగా తప్పుకోడానికి ఎన్నో డ్రామాలు ఆడుతున్నాడు. చదువు నేర్పిన సంస్కారమిదా? అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. ఇవన్నీ వివాహ బంధాన్ని వికృత క్రీడగా భావించి దురాగతానికి అంకురార్పణ చేసిన వారు శిక్షార్హులు. దేశ కాలమాన పరిస్థితులు యువతలో వైపరీత్య ఆలోచనలు పెచ్చు పెరుగుతున్నాయని ముందే గ్రహించి సంబంధాల కూర్పులో తల్లిదండ్రులు మరింత జాగ్రత్త వహించాల్సిందే.



ఎంత గొప్ప చదువు అయినా, ప్రావీణ్యత అలవాటు అవ్వాలంటే అది చెప్పే వారిపై ఆధారపడి ఉంటుంది.

మహాత్మా గాంధీ



చదరంగంలో మాదిరిగానే జీవితంలో కూడా ముందుచూపు ఎంతో అవసరం.

వి.జాన్సన్

# ప్రజావాక్కు



### అగ్నిప్రమాదాల నుంచి గుణపాఠం నేర్చుకోవాలి

లక్నోలో వాణిజ్యభవనంలో నిర్వహిస్తున్నకోచింగ్ సెంటర్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం దేశాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న ఈ ఘటన భవన భద్రత, అగ్నిమాపక ఏర్పాట్లు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే సామర్థ్యంలో ఉన్న లోపాలను బహిర్గతం చేసింది. గతఏడాదిలో ఢిల్లీలోని మాలవీయనగర్ అతిథి గృహం, తుగ్లకాబాద్ నివాస భవనం, బెంగళూరులోని కుంబారపేట గిడ్డంగి వంటి చోట్ల జరిగిన అగ్నిప్రమాదాలు కూడా భద్రతా నిబంధనల నిర్లక్ష్యానికి ఉదాహరణలుగా నిలిచాయి. అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేయడం మాత్రమే సరిపోదు. వాటిని ఎలా ఉపయోగించాలి? అత్యవసర పరిస్థితుల్లో భవనం నుంచి ఎలాబయటపడాలి?అనే విషయాలపైవిద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన ఉండాలి. ప్రతి కోచింగ్ సెంటర్, పాఠశాల, కళాశాల, వాణిజ్య భవనంలో నిరంతరం ఫైర్ డ్రిల్స్, ఎవాక్యుయేషన్ శిక్షణ, భద్రతా సూచనలను తప్పనిసరి చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### మద్యం దుకాణాలను ఎత్తివేయాలి

తమిళనాడుప్రభుత్వం ప్రార్థనాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్ల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను తొలగించేందుకు తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమైనది. ఇటువంటి చర్యలు విద్యార్థులకు, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడంలో దోహదపడతాయి. ఆధ్యాత్మిక కేంద్రాల పవిత్రతను, విద్యాలయాల గౌరవాన్ని కాపాడే ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించి అమలు చేస్తే సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటు అందుతుంది. సమాజంలో సానుకూల ఆలోచనలు, మంచి విలువలు, ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని ప్రోత్సహించేందుకు కూడా ఇది దోహదపడుతుంది.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### పాఠశాలలో తనిఖీలు చేపట్టాలి

ప్రభుత్వ పాఠశాలలో బడి పిల్లలకు నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, సరైన పౌష్టికాహారం అందినప్పుడే వారు నిరంతరం అభివృద్ధి చెందగలరు. కావున అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రత్యేక తనిఖీలు చేపట్టి పిల్లలకు సరైన నాణ్యమైన విద్య, అందేలా చర్యలు తీసుకోవాలి. దీనిపై అధికారులు దృష్టి పెట్టాలి.

-మోతె శివకుమార్, నల్గొండ జిల్లా

### భక్తుల మనోభావాలతో చెలగాటం!

అయోధ్య రామమందిరంలో భక్తులు సమర్పించిన కోట్లాది రూపాయల విలువైన కానుకలు మాయమైన వార్తలు ఆందోళనకరంగా ఉన్నాయి. ఈ మందిరంలో ఉండాల్సిన అయిదు నుంచి ఏడున్నర కోట్ల మేర భక్తులు సమర్పించిన డబ్బు మాయమైనట్లు వివిధ పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. భారీ దోపిడీకారణంగా పూజ్యమైన 'అయోధ్య' ఇప్పుడు 'అయోజ్యు' నగరంగా మారింది. ఉత్తరప్రదేశ్‌లో మత అల్లర్లు, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం వంటి ఘటనల్లో నిందితుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారు. చాలా మంది దీనిని 'త్వరిత న్యాయం' అని ప్రశంసించినారు. ఇదే న్యాయం రామమందిర విరాళాల కానుకలు మాయమైన కేసులో నిందితులకు వర్తించదా?. కోట్లాదిమంది భక్తుల మత విశ్వాసాలను దెబ్బ తీసిన ఈ కేసును దేశద్రోహ నేరంగా పరిగణించి, 'త్వరిత న్యాయం' అందించాలి. అలాచేయకపోతే, స్వయంగా శ్రీరాముడినే న్యాయ నిర్ణేతగా ఉండనివ్వండి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### డబుల్ బెడ్‌రూమ్స్ ఇవ్వాలి

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డబుల్ బెడ్ రూమ్లను వెంటనే ఇవ్వవలెను. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లు ఇప్పుడు ఉన్న ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించాల్సినవి కేటాయిస్తే తమకేమీ నష్టంవాటిల్తుందో అర్థం కావటం లేదు. ప్రజలను ఒక రకమైన ఆందోళనకు గురి చేస్తున్నారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూంలో నిర్మించి ఇంత వరకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. గ్యారెంటీ వారంటీ అనుకుంటూ ఓట్లు దండుకోవటం తప్ప ప్రజలకు మేలు చేకూర్చే, బాగోగులు చూసే పథకాలను ప్రణాళిక తీసువచ్చి ప్రజలకు లబ్ధిదారులకు న్యాయం చేయాలి.

- ఎస్. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### గ్రామాలలో జంతుబలిని నిషేధించాలి

గ్రామాలలో ఇండ్ల వీధులలో జంతు బలిని నిషేధించాలి. వర్షాకాలంలో జంతువులను వధించడం వలన జంతువు కళేబరాలు, వ్యర్థపదార్థాలను, రక్తం, మాంసం, ఎముకలు, కసరు, వంటి పదార్థాలు మురుగు వాసనతో అంటూ రోగాలు వస్తున్నాయి. జంతువులు బలిచేసే వారు ఆర్థికంగా లాభం పడుతున్నారు. కానీ చుట్టూ ప్రక్కల ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారు. కనుక తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య, హెల్త్ డిపార్ట్మెంట్, స్థానిక గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో జంతు బలిని నిషేధం చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# 'నాణ్యమైన విద్య' అందరికీ అందాలి

ప్రభుత్వ పాఠశాలలను కేవలం పేదల పాఠశాలలుగా కాకుండా ప్రతి వర్గం పిల్లలు చదవాలనుకునే స్థాయికి తీసుకురావాలి. ఆధునికభవనాలు, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, నాణ్యమైన ఉపాధ్యాయులు, ఇంగ్లీష్‌తో పాటుమాతృభాషలో బోధన, క్రీడలు, కళలు, సాంకేతిక విద్య అన్నీ అందుబాటులో ఉండాలి. కామన్ స్కూలింగ్ విధానం, సమాన విద్యా అవకాశాలు, పారదర్శక పెట్టుబడులు, ప్రభుత్వ బాధ్యతాయుత మైన అమలు ద్వారా మాత్రమే ఈ అసమానతలను తగ్గిం చగలం. విద్య అనేది ధనికులకు మాత్రమే లభించే ప్రత్యేక హక్కు కాదు. ప్రతి చిన్నారి హక్కు. పుట్టుక కాదు, ప్రతిభ భవిష్యత్తును నిర్ణయించే దేశాన్ని నిర్మించాలంటే విద్యలో సమానత్వం అత్యవసరం. నాణ్యమైన విద్య కొందరికే కాదు, అందరికీ అందాలి. 'క్వాలిటీ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ - నాట్ ఫర్ ది ప్రివిలేజ్డ్' అనే సూత్రం నినాదంగా కాకుండా ప్రభుత్వ విధానంగా మారిన రోజే భారతదేశం నిజమైన అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది.

వనకల్ల వీరప్ప

ఒకే వయసు, ఒకే తెలివితేటలు, ఒకే తరహా కలలు, అయినా ఇద్దరు పిల్లల జీవితాలు పూర్తిగా భిన్నంగా మారుతున్నాయి. కారణం వారి ప్రతిభ కాదు, వారు చదివే పాఠశాల. నేటి భారతదేశంలో పిల్లల భవిష్యత్తును వారి కృషి కంటే ముందే వారి కుటుంబ ఆర్థిక స్థితి, వారు చేరే స్కూల్ నిర్ణయిస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఇది కేవలం విద్యా రంగంలోని సమస్య మాత్రమే కాదు, సమాజంలో కొత్త తరహా అసమానతలకు బలమైన పునాది. ఒకప్పుడు పదో తరగతి లేదా ఇంటర్ తర్వాత పోటీ మొదలయ్యేది. ఇప్పుడు ఎల్‌కేజీ అడ్మిషన్‌తోనే పోటీ ప్రారంభమవుతోంది. ఇంటర్నేషనల్ స్కూల్స్, ఐబీ, కేంబ్రిడ్జ్, డిజిటల్ క్లాస్ రూమ్స్, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, విదేశీ భాషలు వంటి అవకాశాలు సంపన్న కుటుంబాల పిల్లలకు అందుబాటులో ఉంటున్నాయి. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు ఇప్పటికీ ప్రాథమిక మౌలిక వసతుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది. అత్యంత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే మధ్యతరగతి కుటుంబాలు కూడా ఈ పోటీలో వెనుకబడకూడదనే ఆందోళనతో భారీ ఫీజులు చెల్లిస్తూ అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నాయి. విద్య అనేది ఒకప్పుడు కుటుంబ భవిష్యత్తుపై పెట్టుబడిగా భావించేవారు. ఇప్పుడు అది రుణాల భారంగా మారుతోంది. చిన్నారి అడ్మిషన్ నుంచి ఇంటర్మీడియట్ వరకు లక్షల రూపాయల ఖర్చు సాధారణమైపోయింది. విద్య కోసం బ్యాంకు రుణాలు, వ్యక్తిగత అప్పులు తీసుకోవడం అనేక కుటుంబాలకు తప్పనిసరి అవుతోంది. ఈ పరిస్థితి ఒక్క రోజులో ఏర్పడలేదు. 1990ల తర్వాత జనాభా పెరిగింది. విద్యపై ప్రజల్లో అవగాహన పెరిగింది. అయితే ప్రభుత్వ పాఠశాలలు అదే స్థాయిలో అభివృద్ధి చెందలేదు. అవసరమైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన, ఇంగ్లీష్ మీడియం, ఆధునిక సాంకేతికత వంటి అంశాల్లో ఆలస్యం జరిగింది. ఈ ఖాళీని ప్రైవేటు విద్యా సంస్థలు భర్తీచేశాయి. కానీ విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చడంతో అసమానతలు మరింత పెరిగాయి. ఈ మార్పుకు సంబంధించిన గణాంకాలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ముఖ్యంగా ప్రాథమిక తరగతుల్లో ఈ తగ్గుదల మరింత స్పష్టంగా కనిపిస్తోంది. విద్యావంతులైన తల్లిదండ్రులు, మంచి ఆర్థికస్థితి కలిగిన కుటుంబాలు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానంగా పేద కుటుంబాలు, తొలితరం విద్యార్థులు, సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలే చేరుతున్నారు. ఇక్కడే అసలు అసమానత మొదలవుతుంది. ప్రైవేటు పాఠశాలల్లో చదివే పిల్లలకు ఇంట్లో చదువు చెప్పే తల్లిదండ్రులు, ట్యూషన్లు, డిజిటల్ వనరులు, ప్రశాంత వాతావరణం లభిస్తాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో చాలా మంది పేదరికం, పోషకాహార లోపం, కుటుంబ సమస్య



లు, మొదటి తరం విద్యార్థులుగా ఉండటం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటారు. ఈ రెండు వర్గాల ఫలితాలను ఒకే కొలమానంతో పోల్చడం అన్యాయం. 'నీళ్లు ఉన్న చోట ఎవరైనా పంట పండించగలరు. ఎడారిలో పంట పండించడం నిజమైన సవాలు' అనే సామెత ఇక్కడ పూర్తిగా వర్తిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను మాత్రమే విమర్శించడం సరైన పరిష్కారం కాదు. వ్యవస్థ మొత్తం ఎదుర్కొంటున్న నిర్మాణాత్మక సమస్యలను గుర్తించాలి. మౌలిక వసతులు, తగిన ఉపాధ్యాయ నియామకాలు, నిరంతర శిక్షణ, డిజిటల్ సదుపాయాలు, బాధ్యతాయుతమైన పరిపాలన వంటి అంశాల్లో పెట్టుబడులు పెరగాల్సిన అవసరం ఉంది. ఇది కేవలం విద్యా సమస్య మాత్రమే కాదు, సామాజిక న్యాయం, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశం కూడా. ఒకప్పుడు రైతు కొడుకు డాక్టర్ అయ్యేవాడు. కూలీ బిడ్డ ఐఏఎస్ అధికారి అయ్యేవాడు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థి ప్రతిభతో జీవితాన్ని మార్చుకునే అవకాశం ఉండేది. ఇప్పుడు పుట్టిన కుటుంబం, చదివే స్కూల్, తల్లిదండ్రుల ఆర్థిక స్థితి భవిష్యత్తును ముందుగానే నిర్ణయిస్తున్నాయి. ప్రతిభ కంటే అవకాశాలు ఎక్కువ ప్రాధాన్యం పొందుతున్నాయి. ఈ ధోరణి కొనసాగితే సామాజికచలనం తగ్గిపోతుంది. పేద కుటుంబానికి చెందిన పిల్లలు అదే వర్గంలో ఉండిపోతారు. ధనిక కుటుంబాల పిల్లలు మరింత ముందుకు వెళ్తారు. ఇలా సమాజం రెండు వర్గాలుగా విడిపోయే ప్రమాదం ఉంది. ఇది ప్రజాస్వామ్యానికికూడా మంచిది కాదు. సమాన అవకాశాలు లేని సమాజంలో అసంతృప్తి పెరుగుతుంది. సామాజిక ఐక్యత బలహీనపడుతుంది. అంతర్జాతీయంగా చూస్తే విద్యలో సమాన అవకాశాలకు ప్రాధాన్యం ఇచ్చినదేశాలు వేగంగా అభివృద్ధిచెందాయి. ముఖ్యంగా చైనా విద్యారంగంలో భారీప్రభుత్వ పెట్టుబడులు పెట్టి గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న అంతరాలను గణనీయంగా తగ్గించింది. నాణ్యమైన ప్రభుత్వ విద్య ద్వారా అన్ని వర్గాల విద్యార్థులను ఆర్థికవ్యవస్థలో భాగస్వాములను చేసింది. ఫలితంగా మానవ వనరులు పెరిగాయి. ఉత్పాదకత పెరిగింది. ఆర్థిక వృద్ధికి బలమైనపునాది ఏర్పడింది. భారతదేశం కూడా ప్రపంచంలో అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశం. కానీ ఈ యువశక్తిని నాణ్యమైన విద్యతో తీర్చిదిద్దలేకపోతే అది డెమోగ్రాఫిక్ డివిడెండ్ గా కాకుండా డెమోగ్రాఫిక్ భారంగా మారే ప్రమాదం ఉంది. ప్రతిభ ఉన్న లక్షలాది మంది విద్యార్థులు అవకాశాల కొరత వల్ల వెనుకబడితే దేశ ఆర్థికాభివృద్ధి కూడా మందగిస్తుంది. అందుకే ఇప్పుడు అవసరమైనది తాత్కాలిక సంస్కరణలు కాదు. నిర్మాణాత్మక మార్పులు. ప్రభుత్వ పాఠశాలలను కేవలం పేదల పాఠశాలలుగా కాకుండా ప్రతి వర్గం పిల్లలు చదవాలనుకునే స్థాయికి తీసుకురావాలి. ఆధునికభవనాలు, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, నాణ్యమైన ఉపాధ్యాయులు, ఇంగ్లీష్‌తో పాటుమాతృభాషలో బోధన, క్రీడలు, కళలు, సాంకేతిక విద్య అన్నీ అందుబాటులో ఉండాలి. కామన్ స్కూలింగ్ విధానం, సమాన విద్యా అవకాశాలు, పారదర్శక పెట్టుబడులు, ప్రభుత్వ బాధ్యతాయుతమైన అమలు ద్వారా మాత్రమే ఈ అసమానతలను తగ్గించగలం. విద్య అనేది ధనికులకు మాత్రమే లభించే ప్రత్యేక హక్కు కాదు. ప్రతి చిన్నారి హక్కు. పుట్టుక కాదు, ప్రతిభ భవిష్యత్తును నిర్ణయించే దేశాన్ని నిర్మించాలంటే విద్యలో సమానత్వం అత్యవసరం. నాణ్యమైన విద్య కొందరికే కాదు, అందరికీ అందాలి. 'క్వాలిటీ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ - నాట్ ఫర్ ది ప్రివిలేజ్డ్' అనే సూత్రం నినాదంగా కాకుండా ప్రభుత్వ విధానంగా మారిన రోజే భారతదేశం నిజమైన అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుంది. ●

# నకిలీ నోట్లకు పూర్తిస్థాయిలో కళ్లెం వేసేదెప్పుడు!

బుగ్గన మధుసూదనరెడ్డి

కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా వుంది కేంద్ర ప్రభుత్వ వ్యవహారం! కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లను రద్దు చేసి దాదాపు ఆరేళ్లు అవుతున్నా ఇంకను నకిలీ నోట్లకు పూర్తి స్థాయిలో కళ్లెం వేయాలనుకున్న వారిలక్ష్యం నెరవేరిన దాఖలాల్లేవు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ముఖ్యంగా సమాంతర ఆర్థిక వ్యవస్థను అరికట్టి, నగదు రహిత లావాదేవీలను పెంచడానికి దేశంలో నకిలీ నోట్లను కనిపించకుండా చేయడానికి నోట్ల రద్దు నిర్ణయం తీసుకున్నామని అప్పట్లో గొప్పగా, అట్టహాసంగా కేంద్రప్రభుత్వం ప్రకటించినప్పటికి ఎందుకనో ఆచరణలో వారు తీసుకున్న నిర్ణయాలు సమర్థవంతంగా అమలు చేయలేకపోయారు అనే చేదువాస్తవం మన కళ్ళముందు కనపడుతూనేవుంది. ఒక వైపు సాక్షాత్తు రిజర్వుబ్యాంకు వారే గత ఏడాది 102 శాతం మేర నకిలీ నోట్లు పెరిగాయి అని ప్రకటించడంతో నకిలీ నోట్లను అరికట్టడంలో కేంద్రం అనుసరించినఎత్తుగడ అంతగా సఫలీకృతం కాలేదు అనే పచ్చి నిజం మనందరికీ బోధపడుతూనే వుంది. దీన్ని బట్టి చూస్తే ఎన్ని చట్టాలు తెచ్చిన కట్టలు కట్టలుగా, గుట్టలు, గుట్టలుగా నకిలీ నోట్లు పుట్టుకొస్తూ మన ఆర్థిక వ్యవస్థకు సవాలు విసురుతుండటం ఎంతైనా ఆందోళనకరమైన విషయం. పైగా మనమంతా ఏమాత్రం జీర్ణించుకోలేని అంశం కూడా. ఇకపోతే పాత వెయ్యి, ఐదువందల నోట్లను రద్దు చేసి వాటికి బదులుగా కొత్త రెండువేలు, ఐదు వందల రూపాయల నోట్లను ప్రవేశపెట్టి ఇక ఈనోట్లకు నకిలీలు సృష్టించడం దాదాపు అసాధ్యం అని ప్రకటించిన కేంద్రప్రభుత్వానికి ఇప్పుడు దేశవ్యాప్తంగా విచ్చలవిడిగా చలామణి అవుతున్న నకిలీ నోట్ల బెడదను అరికట్టడం ఒక శక్తికి మించినపనిగా, తల బొప్పి కడుతున్న వైనంగా పరిణమించడం ఎంతైనా ఆలోచించాల్సిన పరిణామం. దీన్నిబట్టి చూస్తే కేంద్రప్రభుత్వం నకిలీ నోట్లకు చెక్ పెట్టడానికి అనుసరించిన వ్యూహాలు, ప్రతి వ్యూహాలు బెడిసికొట్టి కొండను తవ్వి ఎలుకను పట్టిన చందగా అవతరించడం కేంద్రప్రభుత్వం పరిపాలన లోపాలను ఎత్తి చూపుతున్నది. ఒక విధంగా చెప్పాలంటే ఈ నకిలీ నోట్ల కరెన్సీ సమస్య అంతా తేలికగా వదిలించుకునే వ్యవహారం కాదు అని మనకు ఇదివరకే తెలిసిన సత్యం. ఎందుకంటే నకిలీ కరెన్సీ తయారీలో కొద్దిమంది స్థానికుల పాత్ర ఉండటంతో పాటు చాలా వరకు విదేశీ గూడచార సంస్థలు, మాఫియా ముఠాలు, ఉగ్రవాద మూకల పాత్ర సైతం ఇందులో ఉండటంతో పాటు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న అగ్రరాజ్యాలకు సైతం ఈనకిలీ కరెన్సీ బెడద తప్పడం లేదు. అంటే నకిలీ కరెన్సీ వ్యవహారం ప్రపంచ దేశాలను ఎంతగా బెంబేలు ఎత్తిస్తుందో మనమంతా ఇట్టే ఊహించవచ్చు. ఏది ఏమైనా నకిలీ కరెన్సీ ప్రపంచవ్యాప్త సమస్యగా పరిణమించిన నేపథ్యంలో నకిలీ కరెన్సీ బెడదను అరికట్టడానికి, దాని పీడ విరగడ అవ్వడానికి ప్రతి దేశం తమ వంతు ప్రయత్నంగా తాము అధికారికంగా ముద్రించే కరెన్సీలో ఎప్పటికప్పుడు సెక్యూరిటీ ఫీచర్స్ ఏర్పాటు చేసుకుంటున్నప్పటికీ నకిలీ నిపుణులు వాటికి దీటుగా నకిలీకరెన్సీని చాప కింద నీరులా విస్తరింపచేస్తుండటం, చలామణిలోకి తెస్తూనే ఉండటం అత్యంత బాధాకరమైన, శోచనీయమైన విషయం. ఏమైనా ప్రపంచ వ్యాప్తంగా కరెన్సీ బెడద ఎక్కువగా వున్న అన్ని దేశాలు ముకుమ్మడిగా తమ ఆలోచనలకు, వివేకానికి పదునుపెట్టి ఈ నకిలీ కరెన్సీ ఆటకట్టించడానికి యుద్ధ ప్రాతిపదికన ఒక మాస్టర్ ప్లాన్‌ను అనుసరించి ఈనకిలీ కరెన్సీని చలామణిలోకి తెస్తున్న అక్రమార్కుల ఆగడాలకు చరమగీతం పాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. ఈ సందర్భంగా 'చట్టాలు అంటే వారి చుట్టం కాదు, వారి పాలిట యమపాశం అని చట్టాలతో ఆటలాడుకోవాలని చూస్తే వారు ఏదో ఒక రోజు చట్టం చేతికి చిక్కి జైలు ఊచలు లెక్కబెట్టాల్సిందే, యావజీవ కారాగారశిక్ష అనుభవించాల్సిందే' అనే నగ్న సత్యాన్ని, ఎవరు కాదనలేని వాస్తవాన్ని నకిలీ కరెన్సీ చలామణిదారులు వీలయినంత త్వరగా ఆకలింపు చేసుకొని, గుర్తుపెట్టుకొని, ఒళ్లు దగ్గర పెట్టుకొని ఇలాంటి దుస్సాహసాలకు పునుకోకుండా ఉండటం వారి ఇంటికి, వంటికి మంచిది. లేకపోతే చట్టం చేతిలో వారు ఏదో ఒక చెడ్డరోజు అత్యంత చావు దెబ్బ తినడం తథ్యం! ఒక విధంగా 'దొరికితే దొంగ, దొరక్కపోతే దొర' అనే సామెత ఈ నకిలీ కరెన్సీ చలామణిదారులకు నూటికి నూరు పాళ్లు వర్తిస్తుంది! ●

# దేశభక్తితో జాతీయవాదాన్ని పోల్చడమా?

డా. ఎ. భాగ్యరాజ్

దేశాన్ని ప్రేమించడం అనే భావన ప్రతి పౌరుడిలో ఉండాల్సిన గొప్ప విలువ, అయితే దేశభక్తి (పేట్రియాటిజం) జాతీయవాదం (నేషనలిజం) ఒకటే కావు. ఈ రెండింటిని ఉద్దేశపూర్వకంగా కలిపివేయడం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ప్రజాస్వామ్య సంక్షోభాలను ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా భారతదేశంలో కూడా గత కొన్నేళ్లుగా 'ప్రభుత్వాన్ని విమర్శిస్తే దేశద్రోహి', ప్రశ్నిస్తే 'దేశ వ్యతిరేకి' అనే రాజకీయ సంస్కృతి పెరిగిందనే విమర్శలు పెరిగాయి. ఇక్కడ దేశభక్తి ఎక్కడ ప్రారంభమౌతుంది, ఎక్కడ ముగుస్తుంది? జాతీయవాదం ఎక్కడ ప్రారంభమవుతుంది, ఎక్కడ ముగుస్తుంది? అనే ప్రశ్నలు చాలా ముఖ్యమైనవి. దేశభక్తి అంటే దేశాన్ని ప్రేమించడం, ప్రజల సంక్షేమాన్ని కోరుకోవడం, రాజ్యాంగ విలువలను గౌరవించడం. దేశభక్తి కలిగిన వ్యక్తి ఎల్లప్పుడూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాడు, తప్పులను విమర్శిస్తాడు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతాడు, సక్రమంగా పన్నులు చెల్లిస్తాడు, పర్యావరణాన్ని పరిరక్షిస్తాడు, పౌర హక్కులను గౌరవిస్తాడు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జవహర్లాల్ నెహ్రూ వంటివారు దేశాన్ని ప్రేమించారు. కానీ ప్రభుత్వాలను, విధానాలను ప్రశ్నించారు, విమర్శలను స్వీకరించారు. జాతీయవాదం అనేది దేశం లేదా జాతి అత్యున్నతమని భావించేది రాజకీయ సిద్ధాంతం. ప్రభుత్వమే దేశమని, పార్టీనే దేశమని, నాయకుడే దేశమని చెప్పి విమర్శను దేశద్రోహంగా చిత్రీకరిస్తారు. జార్జ్ ఆర్వెల్ మాటల్లో దేశభక్తి ప్రేమ ఆధారంగా ఉంటుంది, జాతీయవాదం అధికారం ఆధారంగా ఉంటుంది. పాశ్చాత్య దేశాల అనుభవాలు మనకు సుపరిచితమే. ఉదాహరణకు హిట్లర్ జర్మనీని ప్రపంచంలో అత్యున్నత జాతిగా ప్రకటించాడు. ఫలితంగా ప్రజాస్వామ్యం పతనం, మీడియా నియంత్రణకు లోనైంది. మైనారిటీలపై దాడులు పెరిగాయి, రెండవ ప్రపంచ యుద్ధంలో లక్షలాది ప్రాణనష్టమును మిగిల్చింది. అత్యుత్సాహ జాతీయవాదం ఎంత ప్రమాదకరమో తెలియజేసింది. అలాగే ఇటలీలో ముస్సోలిని దేశభక్తిని జాతీయవాదంగా మార్చి ఫాసిస్టు పాలన నిర్మించాడు. ప్రజాస్వామ్యం బలహీనపడింది. ఇక ప్రస్తుతం అమెరికాలో ట్రంప్ 'అమెరికా ఫస్ట్' నినాదం కొంతమందికి దేశభక్తిగా కనిపించినా, విమర్శకుల దృష్టిలో అది అధిక జాతీయవాద రాజకీయాలకు దారి తీసింది. ఇక మన దేశంలో స్వాతంత్ర్య పోరాటంలో జాతీయవాదం బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా ఒక విముక్తి ఉద్యమం జరిగింది. కానీ నేడు జాతీయవాదం రూపం మారింది. ఇక్కడ ప్రస్తుతం నిరుద్యోగంపై ప్రశ్నిస్తే దేశద్రోహులౌతాము, పేపర్లు లీకయితే, పర్యావరణ నాశనంపై మాట్లాడితే దేశ వ్యతిరేకులౌతాము, ఎన్నికల వ్యవస్థపై సందేహాలు వ్యక్తం చేస్తే దేశానికి శత్రువులమవుతాము. ప్రజాస్వామ్యంలో ఇవన్నీ సహజమైన ప్రశ్నలు. ప్రస్తుత జాతీయవాద రాజకీయాలు విమర్శకుల అభిప్రాయం ప్రకారం రాజకీయాల్లో జాతీయవాదం ప్రధాన ఎన్నికల వ్యూహంగా మారింది. ఉదాహరణకు సైన్య విజయాల రాజకీయీకరణ ఆరోపణలు, మతపరమైన గుర్తింపుతో దేశభక్తిని అనుసంధానం



చేయడం, విభేదించే స్వరాలను 'అర్బన్ నక్సల్', 'దేశద్రోహి'గా ముద్రించడం అనే విమర్శలు పెరిగాయి. మీడియాద్వారా భావోద్వేగ జాతీయవాద ప్రచారాన్ని ఉధృతం చేయడం పెరిగింది. అందువల్ల ఈ అంశాన్ని వివిధ కోణాల నుండి పరిశీలించడం అవసరం. డాక్టర్ అంబేద్కర్ అభిప్రాయం ప్రకారం దేశానికంటే రాజ్యాంగ విలువలు (సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, న్యాయం) ముఖ్యమైనవని, దేశాన్ని ప్రేమించడం అంటే ఈవిలువలను కాపాడటమని, జెండాకు సెల్యూట్ చేయడం మాత్రమే దేశభక్తి కాదని, ఆకలితో ఉన్న పౌరుడికి ఆహారం అందించడం, విద్యను అందించడం, అడవులను రక్షించడం, అవినీతిని ప్రశ్నించడం కూడా దేశభక్తే అవుతుందని చెప్పారు. దేశభక్తి అంటే జరిగే అన్యాయాలను, తప్పులను చూసిగుండెల్లో మంటలు రేగాలి, ప్రశ్నించాలి, పోరాడాలి. కానీ దేశం నిజంగా ఎంత అభివృద్ధి చెందిందో, ప్రజలు ఎంత సంతోషంగా ఉన్నారో, ఎంత స్వేచ్ఛగా జీవిస్తున్నారో కొలవడానికి ప్రపంచవ్యాప్తంగా అనేక సూచీలు ఉన్నాయి. ఉదాహరణకువివిధ రకాల సూచీలను చుస్తే ఆకలి సూచీలో (గ్లోబల్ హంగర్ ఇండెక్స్) నివేదికలో 123 దేశాలకుగాను భారత్ 102వ స్థానంలో (పిల్లల పోషకాహార లోపం, రక్తహీనత, శిశుమరణాలు వంటి సమస్యలు కొనసాగుతున్నాయి). 'రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్' విడుదల చేసిన 2026 సంవత్సరానికిగాను ప్రపంచ పత్రికా స్వేచ్ఛా సూచికలో 180 దేశాలలో భారత్ 157వ స్థానంలోను, 2026గాను ప్రపంచ సంతోష సూచికలో 147దేశాలలో భారత్ 116వ స్థానంలోను, అవినీతి అవగాహన సూచికలో 182 దేశాలలో భారత్ 91వ స్థానంలోను, వాతావరణ మార్పుల పనితీరు సూచిక 2026లో పరిశీలించిన 67 దేశాలలో భారత్ మొత్తంమీద 23వ స్థానంలోనునిలిచింది, ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం వారి మానవ అభివృద్ధి సూచికలో 193దేశాలలో భారత్ 130వస్థానంలోను, తాజాగా'మహిళలు, శాంతి, భద్రత సూచికలో ప్రపంచవ్యాప్తంగా 181 దేశాలలో భారత్ 131వ స్థానంలో, రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వశాఖ ఇటీవలి గణాంకాల ప్రకారం గత మూడేళ్ల కాలంలో జాతీయ రహదారులపై మొత్తం 21వంతెనలు (15 పూర్త యినవి 6 నిర్మాణంలో ఉన్నవి) కూలిపోయాయి. విస్తృత కోణంలో చూస్తే గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా వందలాది వంతెనలు రహదారి మౌలిక సదుపాయాలు కూలిపోయి నట్లు సోషల్ మీడియా విశ్లేషణలు, నిర్మాణ సంబంధిత సమాచారం అంచనా వేస్తున్నాయి. వీడెమ్ ఇన్స్టిట్యూట్ లిబరల్ డెమోక్రసీ ఇండెక్స్ ప్రకారం సూచీ ప్రకారం భారతదేశం 'ఎలక్టోరల్ ఆటోక్రసీ' (ఎన్నికల నిరం కుశత్వం) దేశంగా వర్గీకరించబడింది. ఎకనామిస్ట్ ఇంటెలి జెన్స్ యూనిట్ (ఈ.ఐ.యూ) డెమోక్రసీ ఇండెక్స్ ప్రకారం భారతదేశాన్ని 'పాక్షిక లోపాలు గల ప్రజాస్వామ్య' దేశంగా వర్గీకరించారు. నిజమైన దేశభక్తి ఈ సూచీలను చూసి దేశాన్ని మెరుగుపరచుకోవాలని కోరుతుంది. అతి జాతీయవాదం మాత్రం ఈసూచీలను పట్టించుకోకుండా 'విశ్వగురువు' అనే ప్రచారానికే పరిమితం అయ్యే ప్రమాదం ఉంది. డోనాల్డ్ ట్రంప్ మన దేశ ప్రతిష్టను, అంతర్గత వ్యవహారాలను, ఎగుమతులపై పన్ను పెంపు, పెట్రోల్ రష్యాదగ్గర కొనగూడదు అని ఇలా చాలాకాలుగా వ్యవహరించినా మనవిశ్వగురువు ఏమి జరగనట్టు వ్యవహరిస్తున్నారు. దేశభక్తి ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తుంది, అతి జాతీయవాదం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచే ప్రమాదం కలిగి ఉంటుంది. ప్రభుత్వాన్ని ప్రేమించడం దేశభక్తి కాదు, దేశాన్ని ప్రేమించడం దేశభక్తి. నాయకుడిని ప్రశ్నించడం దేశద్రోహంకాదు, ప్రజాస్వామ్య బాధ్యత. దేశభక్తి 'నా దేశం గొప్పది' అని చెప్పడం మాత్రమే కాదు. 'నా దేశం మరింత న్యాయంగా, సమానంగా, ప్రజాస్వామ్యంగా మారాలి' అని కోరుకోవడమే నిజమైన దేశభక్తి. ●

# శత్రుత్వాన్ని సాగనంపండి




**న్యూఢిల్లీ/ ఇస్లామాబాద్, జులై 1:** భారత్ - పాకిస్థాన్‌ల మధ్య పహల్గాం ఉగ్రదాడితో మొదలైన అగ్ని జ్వాలలు ఇంకా రగులుతూనే ఉన్నాయి. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టడంతోపాటు సింధు జలాల ఒప్పందాన్ని సైతం భారత్ నిలిపివేసింది. ఆపరేషన్ సిందూర్ జరిగి సంవత్సరం పూర్తయింది. అగ్ని జ్వాలలు ఇంకా రగులుతూనే ఉన్నాయి. అయితే ఇప్పటికైనా ఇరు దేశాల మధ్య శాంతి నెలకొల్పే ప్రయత్నం చేయాలని ప్రముఖులు కోరుకుంటున్నారు.

ఈ మేరకు భారత్ - పాకిస్థాన్‌కు చెందిన 117 మంది ప్రముఖులు ప్రధాని మోడీ, షెహబాజ్ షరీఫ్‌లకు బహిరంగ లేఖ రాశారు. ఇరు దేశాల మధ్య పూర్తి స్థాయిలో దౌత్య సంబంధాలు పునరుద్ధరించాలని కోరారు. ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలతో కోట్లాది మంది యువత అవకాశాలు, అభివృద్ధి, భవిష్యత్ దెబ్బతింటోందని వారు లేఖలో పేర్కొన్నారు. ఇప్పటికైనా శత్రుత్వానికి ముగింపు పలికి ఇరు దేశాల మధ్య శాంతి నెలకొల్పే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ లేఖను సెంటర్ ఫర్ పీస్ అండ్ ప్రోగ్రెస్ విడుదల చేసింది. దీనిపై భారత్‌కు చెందిన 61 మంది, పాకిస్థాన్‌కు చెందిన 56 మంది ప్రముఖులు సంతకాలుచేశారు. ఏ రాజకీయ పార్టీకి తాము మద్దతు తెలపడం లేదని, దాదాపు 200 కోట్లమంది ప్రజల సంక్షేమం, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కోరుతున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. భారత్ తరఫున సంతకాలు చేసిన ప్రముఖుల్లో నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ, కశ్మీర్ మత, రాజకీయ నాయకుడు మిర్వైజ్ ఉమర్ ఫరూఖ్, ఆర్జేడీ రాజ్యసభ సభ్యుడు మనోజ్ ఝా, ఎజెయుపి నాయకుడు, టిఎంసి మాజీ మంత్రి హుమాయున్ కబీర్ ఉన్నారు. పాకిస్థాన్ తరఫున పాక్ మాజీ విదేశాంగ మంత్రి ఖుర్షీద్ మహ్మూద్ కసూరీ, మాజీ దౌత్యవేత్త అష్రఫ్ జహంగీర్ ఖాజీ, పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ సభ్యుడు ఇస్ఫన్యార్ భండారా, అణు భౌతిక శాస్త్రవేత్త, రచయిత పర్వేజ్ హుడ్‌భాయ్ తదితరులు ఉన్నారు. అంతేగాక ఆ లేఖలో పలు సూచనలు కూడా చేశారు. ఇరు దేశాల మధ్య పూర్తి స్థాయి దౌత్య సంబంధాలు పునరుద్ధరించాలి. న్యూఢిల్లీ, ఇస్లామాబాద్‌లో హైకమిషనర్లను తిరిగి నియమించాలి. సాధారణ వీసా సేవలు పునఃప్రారంభించాలి. వాణిజ్య విమానాల కోసం గగనతలాన్ని తిరిగి తెరవాలి. అట్టారి -వాఘా సరిహద్దును వాణిజ్యం, ప్రయాణాల కోసం మళ్లీ ప్రారంభించాలి. శ్రీనగర్- ముజఫరాబాద్ బస్సు సర్వీసును తిరిగి ప్రారంభించాలని ఇరు దేశాల ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.



## సప్తపదిలేకుండా హిందూ వివాహమే కాదు

### గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

**అహ్మదాబాద్,జూలై 1:** హిందూ వివాహ వ్యవస్థ విశిష్టతను చాటిచెబుతూ గుజరాత్ హైకోర్టు ఒక చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. హిందూ సంప్రదాయాల ప్రకారం సప్తపది (ఏడడుగులు) వంటి శాస్త్రోక్తమైన క్రతువులు నిర్వహించకుండా, కేవలం మ్యారేజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ పొందినంత మాత్రాన ఆ పెళ్లి చట్టబద్ధంగా చెల్లుబాటు కాదని హైకోర్టు స్పష్టం చేసింది. హిందూ వివాహం అనేది కేవలం పాటలు, డ్యాన్స్‌లు, విందు వినోదాల కోసం జరుపుకునే వేడుక కాదని, వధూవరులు పవిత్రమైన అగ్ని సాక్షిగా ఏడు అడుగులు వేయడమే వివాహానికి ఆధ్యాత్మిక, సామాజిక, చట్టపరమైన హోదాను కల్పిస్తుందని జస్టిస్ ఇలేష్ వోరా, జస్టిస్ ఆర్.టి. వాచ్ఛానిలబెంచ్ తేల్చిచెప్పింది. యూకేలో నివసిస్తున్న కౌశల్ సోనార్ అనే వ్యక్తి అప్పీల్‌పై విచారణ జరుపుతూ కోర్టు ఈ తీర్పునిచ్చింది. అహ్మదాబాద్‌కు చెందిన ఒక మహిళ తన సంతకాలను మోసపూరితంగా సేకరించి మ్యారేజ్ సర్టిఫికేట్ పొందిందని, తమ మధ్య ఎలాంటి సంప్రదాయ వివాహ క్రతువులు జరగలేదని కౌశల్ కోర్టును ఆశ్రయించాడు. గతంలో ఫ్యామిలీ కోర్టు ఈ పిటిషన్‌ను తిరస్కరించగా, ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణలో సదరు మహిళ కూడా తమ మధ్య ఎలాంటి పెళ్లి ఆచారాలు జరగలేదని అంగీకరించింది. దీంతో, హిందూ వివాహ చట్టం ప్రకారం సప్తపది లేని వివాహం అసలు పెళ్లే కాదని స్పష్టం చేస్తూ, గతంలో ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ ఆ పెళ్లి చెల్లదంటూ హైకోర్టు తీర్పునిచ్చింది.



## ట్రైలర్‌ను ఢీకొన్న బస్సు

### 8 మంది సజీవదహనం, 22మందికి తీవ్రగాయాలు

### రాజస్థాన్‌లో విషాదం

**జైపూర్, జులై 1:** రాజస్థాన్‌లోని దౌసా జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఢిల్లీ- ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై ఒక ప్రయాణికుల బస్సు ట్రైలర్‌ను ఢీకొట్టి మంటలు చెలరేగడంతో కనీసం ఎనిమిది మంది మృతి చెందగా, 20 మందికి పైగా గాయపడ్డారు. ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్ నుండి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు దాదాపు 37 మంది ప్రయాణికులతో ప్రయాణిస్తున్నబస్సులో తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ట్రైలర్‌ను ఢీకొట్టడానికి ముందే బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. ఈ ధాటికి భారీ మంటలు చెలరేగి, కొద్ది నిమిషాలకే వాహనాన్ని చుట్టుముట్టాయి, దీంతో పలువురు ప్రయాణికులు బస్సు లోపల చిక్కుకుపోయారు. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం, ఆ సమయంలో చాలా మంది ప్రయాణికులు నిద్రపోతున్నారు, బస్సు వెనుక భాగంలో మొదట మంటలు చెలరేగడంతో భయాందోళనలు, గందరగోళం నెలకొన్నాయి. ప్రమాద తీవ్రతకు పై బెర్త్‌లలోని ప్రయాణికులు కిందపడిపోవడంతో వారికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. సమాచారం అందిన వెంటనే పోలీసులు, అత్యవసర బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని జిల్లా ఆసుపత్రికి తరలించగా, అక్కడ ఎనిమిదిమంది ప్రయాణికులు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. మరో 20మంది చికిత్స పొందుతుండగా, తీవ్రంగా గాయపడిన ఒక ప్రయాణికుడిని మెరుగైన చికిత్స కోసం జైపూర్‌కు తరలించారు.

## మంత్రివర్గప్రక్షాళనపై సిఎం విజయ్ ఫోకస్

### వివాదాలలో చిక్కిన ఇద్దరు మంత్రులకు ఉద్వాసనే



**చెన్నై,జులై 1:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వంలో భారీ ప్రక్షాళన జరగబోతోంది. ప్రభుత్వ ప్రతిష్ఠను కాపాడుకోవడంతో పాటు పాలనా వేగాన్ని పెంచేందుకు వీలుగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు సీఎం విజయ్ ముహూర్తం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. తమిళనాడు నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రితో కలిపి గరిష్ఠంగా 35 మందికి మాత్రమే మంత్రివర్గంలో చోటు ఉంటుంది. ప్రస్తుతం కేబినెట్‌లో అన్ని స్థానాలూ భర్తీ అయి ఉండటంతో కొత్తవారికి అవకాశం ఇవ్వాలంటే కొందరిపై వేటు వేయడం తప్పనిసరిగా మారింది. ముఖ్యంగా అన్నాడిఎంకె నుంచి టివికెలో చేరిన సీనియర్ నేతలకు సముచిత స్థానం కల్పించడం కోసమే సిఎం విజయ్ ఈ కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఇద్దరు వివాదాస్పద మంత్రులను కేబినెట్ నుంచి తప్పించడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుత సమాచారం ప్రకారం తాంబరం ఎమ్మెల్యేగా గెలిచిన మంత్రి శరత్ కుమార్, సామాజిక సంక్షేమశాఖ మంత్రి జగదీశ్వరిలకు మంత్రిపదవులు ఊడటం దాదాపు ఖాయమైంది. ఐపిఎల్ మ్యాచ్ సందర్భంగా మంత్రి శరత్ కుమార్ వివాదాస్పద రీతిలో కనిపించిన ఒక వీడియో సోషల్ మీడియాలో హల్చల్ చేసింది. ఇది ప్రతిపక్షాలకు పెద్ద ఆయుధంగా మారడంతో పాటు ప్రభుత్వంపై విమర్శలకు దారితీసింది. ప్రముఖ రౌడీషీటర్ రాకెట్ రాజాతో మంత్రి జగదీశ్వరి దిగిన కొన్ని పాత ఫోటోలు ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యాయి. దీనికి తోడు తోటి మంత్రి కీర్తనతో ఆమెకు ఉన్న తీవ్ర విభేదాలు పార్టీకి, ప్రభుత్వానికి తీవ్ర అప్రతిష్ఠ తెచ్చిపెట్టాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరినీ సాగనంపడమే శ్రేయస్కరమని సిఎం విజయ్ భావిస్తున్నట్లు సమాచారం. తప్పించబోయే ఇద్దరి స్థానాల్లో అన్నాడిఎంకె నుంచి వచ్చిన సి.విజయభాస్కర్ వంటి సీనియర్లను రాబోయే ఉప ఎన్నికల్లోగెలిపించి మంత్రివర్గంలోకి తీసుకునే యోచనలో ముఖ్యమంత్రి ఉన్నారు. మిత్రపక్షాల నుంచి కూడా ఒత్తిడి పెరుగుతోంది. టివికె మిత్రపక్షమైన విసికె నేత వన్నియరసు శాఖను మార్చాలని, తమకు మరింత ప్రాధాన్యత ఉన్న కీలక శాఖను కేటాయించాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఐయూఎంఎల్ మంత్రి షాజహాన్ పోర్ట్‌ఫోలియోపై కూడా ఒక ఖచ్చితమైన నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ మంత్రివర్గ ప్రక్షాళన తక్షణమే జరిగే అవకాశం లేదు. రాష్ట్రంలో మరికొన్ని నెలల్లో వివిధ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఉప ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెల్లడైన తర్వాతే, సమీకరణాలను బట్టి సీఎం విజయ్ తన కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై అధికారిక నిర్ణయాన్ని ప్రకటిస్తారని టీవీకే సీనియర్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

## చోరీ సొమ్మును బాత్‌రూమ్‌లో దాచేవాళ్లం

### అయోధ్య విరాళాల చోరీ కేసులో నిందితుల వెల్లడి

**అయోధ్య,జూలై 1:** అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీ కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అరెస్టైన ఎనిమిది మంది నిందితుల్లో ఒకరైన అవినాశ్ శుక్లాను పోలీసులు విచారించారు. చోరీ చేసిన నగదును ముందుగా మరుగుదొడ్లలో దాచేవాళ్లమని, తర్వాత అవకాశం చూసుకుని బయటకు తరలించేవాళ్లమని చెప్పినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. విరాళాల లెక్కింపు ప్రక్రియలో ఆలయ ట్రస్టీ అనిల్ మిశ్రా కీలక పాత్ర పోషించేవారని కూడా అవినాశ్ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ ఇంకా వెలువడలేదు. దర్యాప్తు ప్రకారం విరాళాల లెక్కింపు గది తాళాల్లో ఒకటి రామశంకర్ అలియాస్ టిన్నూ యాదవ్ వద్ద ఉండేది. మరో తాళం బ్యాంకు సిబ్బంది వద్ద ఉండేదని నిందితుడు తెలిపాడు. పలువురు కలిసి పక్కా ప్రణాళికతో చోరీకి పాల్పడేవారని, ఒకరు నగదు తీస్తుండగా మిగిలినవారు అతడికి అడ్డుగా నిలిచేవారని వెల్లడించాడు. ఆలయ ప్రాంగణంలో ఎక్కడెక్కడ సిసి కెమెరాలు ఉన్నాయో తమకు ముందే తెలుసని, వాటికి కనిపించకుండా కదిలేవాళ్లమని కూడా నిందితుడు చెప్పినట్లు సమాచారం. సిసిటివి పర్యవేక్షణ ఉన్నప్పటికీ తమ కదలికలను ఎవరూ నిశితంగా గమనించలేదని పేర్కొన్నట్లు తెలుస్తోంది. చోరీ చేసిన సొమ్ముతో భూములు, ఇల్లు కొనుగోలు చేసినట్లు కూడా నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు చెబుతున్నారు. దీంతో నిందితుల ఆస్తులు, బ్యాంకు లావాదేవీలపై దర్యాప్తు అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. అంతకుముందే జూన్ 5న అవినాశ్ శుక్లా ఇంటి నుంచి రూ.58 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు బయటపడింది. మిగిలిన మొత్తాన్ని జూన్ 5 నుంచి 8 మధ్య బ్యాంకు ఖాతాల ద్వారా తిరిగి చెల్లించినట్లు సమాచారం. దీంతో ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే నిధుల రికవరీ ప్రక్రియ ప్రారంభమైనట్లు దర్యాప్తులో తేలింది.

**కుంభ్‌మేళానుంచే అయోధ్య విరాళాలచోరీ**

2025 మహా కుంభమేళా సమయంలో భక్తుల రద్దీ, విరాళాలు ప్రవాహాన్ని ఆసరాగా చేసుకుని భారీగా నిధులు పక్కదారి పట్టించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కుంభకోణంలో బావ, బావమరిది అయిన అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా కీలక సూత్రధారులుగా ఉన్నారని, నిధులను దారి మళ్లించడంలో వీరే ప్రధాన పాత్ర పోషించారని పోలీసులు ధృవీకరించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి సుమారు రూ.79.85 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో జరిగే నగదు లెక్కింపు ప్రక్రియలోని లొసుగులని ఆసరాగా చేసుకుని నిందితులు చేతివాటం ప్రదర్శించారు. సిసిటివి కెమెరాల కంటపడకుండా దుప్పట్లలో నగదును దాచి తరలించినట్లు విచారణలో వెల్లడైంది. నిందితులపై నేరపూరిత కుట్ర, నమ్మకద్రోహం వంటి పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రధాన నిందితులైన అనుకల్ప్, లవకుశ్ దొంగిలించిన సొమ్ముతో ఫామ్‌హౌస్, రూ.65 లక్షల విలువైన ఇల్లు మరియు పలు ప్లాట్లను కొనుగోలు చేసినట్లు నిర్ధారణ అయింది. స్కార్పియో వంటి విలాసవంతమైన కారును కొనుగోలు చేసేందుకు కూడా సిద్ధమయ్యారు. వారి జీవనశైలిలో అకస్మాత్తుగా వచ్చిన మార్పులే పోలీసుల అనుమానాలకు కారణమయ్యాయి.



## మగవాళ్లను చంపడం ఎలా..?

### మెట్రోరైల్‌లో మహిళ చదివిన పుస్తకంపై హాట్ చర్చలు

**న్యూఢిల్లీ,జూలై 1:** మెట్రో రైళ్లలో ప్రయాణించేటప్పుడు కొందరు ఫోన్లు చూస్తుంటే, మరి కొందరు పుస్తకాలు చదువుతూ కనిపిస్తుంటారు. అలాగే ఓ యువతి మెట్రోలో ఓ పుస్తకం చదువుతోంది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక రేంజ్‌లో హల్‌చల్ చేస్తోంది. ఆమె చేతిలో ఉన్న పుస్తకం పేరు మగాళ్లను చంపడం ఎలాఅని ఉండటమే ఇందుకు కారణం. ఆ టైటిల్ చూడగానే తోటి ప్రయాణికులతోపాటు నెటిజన్లు సైతం ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఎవరో తీసిన ఈ వీడియో కాస్తా ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ కావడంతో, ఇప్పటివరకు దీనికి ఏకంగా 19 మిలియన్లవ్యూస్, 4లక్షలకు పైగా లైకులు వచ్చాయి. ఈ వీడియో చూసిన నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. కొందరు దీన్ని కేవలం ఒక కామెడీగా తీసుకుంటే, మరి కొందరు మాత్రం ఇటీవలి కాలంలో సంచలనంసృష్టించిన సియాకేసుతో ముడిపెడుతూ తీవ్రమైన చర్చకు తెరలేపారు. ఆ మహిళ నిజంగానే ఆపుస్తకం లోపలఉన్న కంటెంట్‌ను చదువుతుందా లేక కేవలం కవర్ పేజీ మాత్రమే అలా ఉందా అనేది వీడియోలో స్పష్టంగా లేదు. కేవలం పుస్తకం టైటిల్‌ను బట్టే ఆమె ఆలోచనలను తప్పుపట్టలేమని, పాఠకుల దృష్టిని ఆకర్షించడానికి ఇలాంటి వివాదాస్పద టైటిళ్లు పెట్టడం సహజమేనని కొందరు అభిప్రాయపడుతున్నారు.

## పదవీవిరమణకు ఒక్కరోజు ముందు టీచర్ నియామక ఉత్తర్వు

### జార్ఖండ్‌లో ప్రభుత్వ జాప్యానికి కొలువును కోల్పోయిన టీచర్

**రాంచి,జూలై 1:** ప్రభుత్వ నియామక ప్రక్రియలో దొర్లే జాప్యానికి ఝార్ఖండ్‌లో ఉదంతమే నిదర్శనం. దశాబ్దాలుగా పారా టీచర్‌గా సేవలందించిన ఒక వ్యక్తికి, తన పదవీ విరమణకు కేవలం ఒక్కరోజు ముందు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా శాశ్వత నియామక పత్రంఅందింది. ఆ హోదాలో విధుల్లో చేరకుండానే ఆయన ఉద్యోగ విరమణ చేయాల్సిరావడం గమనార్హం. ప్మూరా జిల్లాకు చెందిన నంద్ లాల్ రవాణీ (60) 2006 నుంచి పారా టీచర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2016లో ఆయన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్ర ప్రభుత్వం 2023లో పారా టీచర్ల క్రమబద్ధీకరణ కోసం చేపట్టిన నియామక ప్రక్రియకు ఆయన దరఖాస్తు చేసుకోగా, అప్పటికి ఆయన వయసు 57 యేళ్లు. మూడేళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం, 2026 జూన్ 29న ఆయనకు శాశ్వత అసిస్టెంట్ టీచర్‌గా నియామక ఉత్తర్వులు అందాయి. సరిగ్గా మరుసటి రోజే (జూన్ 30న) ఆయన 60 యేళ్ల పూర్తి కావడంతో పదవీ విరమణ పొందారు. జూన్ 29న రాంచీలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మొత్తం 1,042 మంది నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేశారు. రవాణీ సైతం ఇదే వేదికపై ముఖ్యమంత్రి నుంచి పత్రం అందుకున్నారు. ఇదే తరహాలో పాలము జిల్లాకు చెందిన నియుమ్ అన్సారీ అనే మరో ఉపాధ్యాయుడికి, ఆయన మే 31న పదవీ విరమణ చేసిన తర్వాత నియామక పత్రం అందడం గమనార్హం. ఈ ఉదంతంపై నంద్‌లాల్ రవాణీ స్పందిస్తూ, 2006 నుంచి విద్యాబోధన చేస్తున్నాను. శాశ్వత ఉద్యోగం కోసం ఎన్నో యేళ్లుగా ఎదురుచూశాను. సోమవారం నాడు నియామక పత్రం అందినా, మరుసటి రోజే పదవీ విరమణ చేయాల్సి రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పారా టీచర్ల విషయంలో ప్రభుత్వం వయోపరిమితి సడలించినప్పటికీ, నియామక ప్రక్రియలో చోటుచేసుకున్న విపరీతమైన జాప్యం వల్లే ఈ అసాధారణ పరిస్థితి తలెత్తిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## సంగీత దర్శకుడు ఇళయరాజాకు కోర్టు షాక్



**న్యూఢిల్లీ,జూలై 1:** సంగీత దర్శకుడు ఇళయరాజాకు న్యాయస్థానంలో భారీ షాక్ తగిలింది. ప్రముఖ మ్యూజిక్ లేబుల్ సరిగమ ఇండియా లిమిటెడ్ సంస్థతో నడుస్తున్న కాపీరైట్ వివాదంలో ఢిల్లీ హైకోర్టు బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో ఇళయరాజాకు వ్యతిరేకంగా ఇచ్చిన మధ్యంతర స్టే (ఇంజంక్షన్ ఆర్డర్)ను ఎత్తివేయడానికి కోర్టు నిరాకరించింది. ఫలితంగా, ఆ 134 సినిమాల్లోని పాటలపై ఇళయరాజాకు ప్రస్తుతానికి ఎలాంటి హక్కులు ఉండవని స్పష్టమైంది. ఈ వివాదం మొత్తం 134 సినిమాలలోని సౌండ్ రికార్డింగ్‌లు, లిరిక్స్, మ్యూజికల్ వర్క్స్‌కు సంబంధించింది. ఇందులో ఇళయరాజా క్లాసిక్స్ అయిన అన్నకిలి, 16 వయతినిలే, కవిక్కుయిల్, భారతి, పల్లవి అను పల్లవి, ముల్లుమ్ మలరుమ్, రాజా పార్వై, నెట్రికన్, కల్యాణరామన్ వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాలు ఉన్నాయి. ఈ సినిమాల మ్యూజిక్ రైట్స్, ఓనర్‌షిప్ తమదేనంటూ సరిగమ సంస్థ కోర్టును ఆశ్రయించింది. తమకు తెలియకుండా ఇళయరాజా ఈ పాటలను వేరే ప్లాట్‌ఫారమ్‌లకు లైసెన్స్ ఇస్తున్నారని, యాజమాన్య హక్కులు క్లెయిమ్ చేస్తున్నారని ఆరోపించింది.

దీనిపై విచారణ జరిపిన జస్టిస్ తుషార్ రావు నేతృత్వంలోని సింగిల్ బెంచ్ గత ఫిబ్రవరి 13న ఇళయరాజాపై ఎక్స్‌పార్టీ మధ్యంతర స్టే విధించింది. ఈ ఆర్డర్ ప్రకారం సరిగమ కాపీరైట్ కలిగి ఉన్న పాటలను వాడటం, వేరొకరికి లైసెన్స్ ఇవ్వడం లేదా ఓనర్‌షిప్ క్లెయిమ్ చేయడం వంటివి ఇళయరాజా చేయకూడదు. ఈ స్టేను రద్దు చేయాలంటూ ఇళయరాజా దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తాజాగా తిరస్కరించింది.

## మరో 2 కొత్త హైవేలు

### రూ.14,115 కోట్లతో నిర్మాణం

### కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, జులై 1:** దేశంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం దిశగా కేంద్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన నిర్వహించిన కేంద్ర ఆర్థిక వ్యవహారం మంత్రిత్వ కమిటీ జరిగిన కేబినెట్ భేటీలో రహదారులకు విస్తరణకు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు దేశ వ్యాప్తంగా పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.6,970 కోట్లతో ఢిల్లీలో 6 లేన్‌లతో 'ద్వారకా సొరంగాన్ని నిర్మించాలని ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే (ఎన్‌హెచ్248బిబి)ను వసంత్ కుంజ్‌లోని నెల్సన్ మండేలా మార్గ్‌తో అనుసంధానించే 8.1 కిలో మీటర్ల మేర ఆరు లేన్ల రోడ్డు సొరంగ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టును జాతీయ రహదారుల (ఒరిజినల్) ఎన్‌హెచ్(ఓ) పథకంలో భాగంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఏఎం) కింద అభివృద్ధి చేయనున్నారు.

అలాగే ఉత్తర్‌ప్రదేశ్‌లో కాన్పూర్ నుంచి కబ్రాయ్ వరకు 4 లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ హైవే నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. దీనిని గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మించనున్నారు. ఇందుకూ గానూ రూ.7,145 కోట్లతో కేటాయింపునకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే దేశంలో రవాణా వ్యవస్థ మరింత బోలోపేతం అవుతుందని, ఇది దేశ ప్రగతికి కూడా దోహదపడుతుందని మంత్రి వర్గం పేర్కొంది.

## సంక్షిప్త వార్తలు

### పాక్-అఫ్ఘాన్ సరిహద్దుల్లో తాలిబన్ల డ్రోన్ దాడులు



**కాబూల్,జూలై 1:** పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌ల మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. పాకిస్థాన్ భూభాగంపై ఆఫ్ఘనిస్థాన్ తాలిబన్ దళాలు డ్రోన్లతో దాడులు చేశాయి. పాకిస్థాన్ లోని బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులలోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. ఇవి ఇస్లామిక్ స్టేట్ ఖొరాసన్ (ఐసిస్‌కే) ఉగ్రవాద సంస్థ స్థావరాలని, వాటిని ధ్వంసం చేసేందుకే దాడులు చేశామని తాలిబన్ ప్రభుత్వం ప్రకటించింది. పాకిస్థాన్‌పై దాడులను తాలిబన్లు సమర్థించుకు న్నారు. ఆఫ్ఘనిస్థాన్‌లో పౌరులపై దాడులు, విద్రోహ చర్యలకు ఈ స్థావరాల నుంచి ప్రణాళికలు రచిస్తున్నారని ఆరోపించారు.


### ఎంపి మహువా మొయిత్రాపై కోడిగుడ్లతో దాడి

**కోల్‌కత్తా,జూలై 1:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి ఆ రాష్ట్రంలో రాజకీయ దాడులు జరుగుతూనే ఉన్నాయి. ప్రతిపక్ష టిఎంసి ముఖ్య నాయకులే లక్ష్యంగా ఈ దాడులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్ ముఖ్య నాయకుడు అభిషేక్ బెనర్జీ పైనా, కొందరు మాజీ మంత్రులపైన భౌతిక దాడులు జరిగాయి. తాజాగా మహిళా ఎంపీపై మహువాపై దాడికి పాల్పడ్డారు. టిఎంపి ఎంపీ మహువా మొయిత్రా పశ్చిమ బెంగాల్‌లో పార్టీ కార్యకర్తలతో సమావేశంలో ఉండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

### గ్యాంగ్‌రేప్ నిందితుల హోటళ్లు కూల్చివేత

**జైపూర్,జూలై 1:** రాజస్థాన్‌లో 13 యేళ్లబాలికపై సామూహిక అత్యాచారంచేసిన నిందితులకు సంబంధించిన నాలుగు హోటళ్లను అధికారులు కూల్చేశారు. రాజస్థాన్‌లోని, శ్రీగంగానగర్‌కు చెందిన పదమూడేళ్ల బాలిక జూన్ 18న కిడ్నాప్‌నకు గురైంది. బాలికను స్తానిక రిక్షా కార్మికుడు ఎత్తుకెళ్లి ఒక హోటల్ నిర్వాహకుడికి ఇచ్చేశాడు. ఆ హోటల్ ఓనర్ బాలికపై హోటల్‌లో అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఇతర హోటళ్లకు కూడా బాలికను తీసుకెళ్లాడు. నాలుగు హోటళ్లలో చిన్నారిపై అత్యాచారం, లైంగికదాడి జరిగింది. దాదాపు ఐదు రోజులపాటు బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. వివిధ హోటళ్లలో మొత్తం 30 మంది వరకు ఈ దారుణానికి ఒడిగట్టారు.

### బోరుబావిలో పడిన చిన్నారి మృతి



**అంబాలా, జూలై 1:** హర్యానాలోని అంబాలా జిల్లాలో విషాదం చోటుచేసుకున్నది. బోరుబావిలో పడిన నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. సుమారు 21 గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్ జరిగింది. ఆ చిన్నారిని బయటకు తీసినా ఆ బాలుడు మృతిచెందినట్లు గుర్తిం చారు. సుమారు 220 అడుగుల లోతులో ఆ పిల్లోడు బోరుబావిలో చిక్కుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున 3.40 నిమిషాలకు నిర్‌వాయిర్ సింగ్‌ను బోర్‌వెల్ నుంచి బయటకు తీశారు. మంగళ వారం ఉదయం నుంచి రెస్క్యూ ఆపరేషన్ జరిగింది.

### 'సింధుజలాలపై ఏకపక్ష నిర్ణయాలు భవిష్యత్తుకు ముప్పు'



**ఇస్లామాబాద్,జూలై 1:** సింధు నదీ జలాల ఒప్పందం విషయంలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని పాకిస్థాన్ భారత్‌ను హెచ్చరించింది. ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి ఈ ఒప్పందం అత్యంత కీలకమని, దీనిని ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. ఇస్లామాబాద్‌లో నిర్వహించిన ఒక సదస్సులో పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) అధ్యక్షుడు బిలావల్ భుట్టో జర్దారీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. సింధు జలాల ఒప్పందం సక్రమంగా అమలు కాకపోతే, అంతర్జాతీయ వ్యవస్థల మనుగడే ప్రశ్నార్థకమవుతుందని వారు అభిప్రాయపడ్డారు.

# ఓటుబ్యాంకు రాజకీయం చేస్తున్న బిజెపి



**నేను ఎక్కడికైనా వస్తా.. నీవు వస్తావా కెటిఆర్: కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**హైదరాబాద్,జూలై 1,ప్రభాతవార్త:** ఓటు బ్యాంకు రాజకీయం కోసం రాముడిని రాజకీయాలకు వాడుకొంటూ బిజెపి దోచుకుంటున్నదని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అయోధ్య రామ మందిరం దొంగతనం జరిగిందని. భక్తులు హుండీలో వేసిన డబ్బులు బిజెపి నేతలు దోచుకున్నారని ఆయన ఆరోపించారు. రామాలయ ట్రస్ట్ దోపిడీ విషయంలో మోడీ మాట్లాడడు,అమిత్‌షా నోరు విప్పరు, యుపి సిఎం బిజెపి నేతలు ఎవరూ ఏం మాట్లాడటం లేదని, ఇన్నేళ్లు రాముడి పేరును రాజకీయం కోసం వాడుకున్నారని దుయ్య బట్టారు. మహాత్మాగాంధీ కూడా రఘుపతి రాఘవ రాజారాం అన్నారు, నెహ్రూ హయాంలో రాముడి పాలన కొనసాగిందని ఆయన చెప్పారు. తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఇది చిన్న విషయం అంటున్నారని ఆవేదన చెందారు. రాముని సొమ్మును బిజెపి రాజకీయాల కోసం ఖర్చు చేసినందుకు భారత జాతికి ప్రధాని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ లో బిఆర్ఎస్ కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉంటుందని రాబోయే ఏ ఎన్నికలోనైనా బిజెపి పోటీలో ఉండదు అని మోడికి కూడా తెలుసు అని జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రిని సవాల్ చేసిన కెటిఆర్ ఖాళీగా ఉన్నాడని కానీ ఆయన ఖాళీగా లేడుకదా నేను సవాల్ స్వీకరించి వస్తా ఎక్కడికి పోదామో రా అని అన్నారు. రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక ఉచిత బస్సు మొదలైందని గుర్తుచేశారు.ప్రతిపక్ష పార్టీ కెటిఆర్ కి ఏం పని లేదని రేవంత్ బిజీ ఉన్నాడని ఆయన వివరించారు. కెసిఆర్ చేసిన అప్పులు కట్టే పని తోపాటు పథకాలు పైసలు జమ చేసే పనిలో ముఖ్యమంత్రి ఉన్నాడని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు,ఉచిత విద్యుత్ ఇవ్వలేదా.? కెటిఆర్ అని ఆయన ప్రశ్నించారు. మీ నాన్న చేసిన అప్పులకే మిత్తి కడుతున్నాడని కెటిఆర్ సవాల్ విషయంలో జగ్గారెడ్డి స్పందిస్తూ ఆవేదన చెందారు. అప్పులకు మిత్తీలకట్టుడు, పథకాలకు పైసలు జమచేసుడు వంటి రేవంత్‌రెడ్డి కష్టాలు ఎందుకు కెటిఆర్ చెప్పడు అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకులుగా రేవంత్‌ను పొగడలేవు మీరు తిడతారు అని అన్నారు.

# ‘మిషన్ కె10’తో ఆటంకరహిత ధాన్యం సేకరణ

## ఐదు లక్ష్యాలతో ముందుకు: పౌరసరఫరాలశాఖ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర




**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** ధాన్యం సేకరణ ఆటంకరహితంగా సాగిపోయేందుకు రాబోయే 2026-27ఖరీఫ్, తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల 'మిషన్ కె10' విధానం అమలు చేయబోతున్నామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. 'మిషన్ కె10' నిర్దిష్ట సమయ కార్యాచరణ ప్రణాళికను బుధవారం పౌర సరఫరాల భవన్‌లో పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర లాంఛనంగా ప్రారంభించి అనంతరం ఎన్‌సిఏ, సివిల్‌సప్లయ్ కార్పొరేషన్, సివిల్‌సప్లయ్ డిపార్ట్మెంట్ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. భారత ఆహార సంస్థ జనరల్ మేనేజర్ జి.ఎస్. రాజు ఉన్నత స్థాయి వ్యూహాత్మక సమన్వయ సమావేశంలో పాల్గొని నూతన విధానంపై అవగాహన ఏర్పరుచుకున్నారు. ఖరీఫ్ పంట చేతికి వచ్చేలోపు రవాణా, ఆర్థికపరమైన అడ్డంకులను వెంటనే పరిష్కరించడమే కార్యాచరణ ఈ సమావేశం జరిగింది. స్టీఫెన్ రవీంద్ర ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ఆహార సంస్థ వీలైనంత ఎక్కువగా బియ్యం నిల్వకు స్థలం ఏర్పాటు చేకొంటే ప్రభుత్వం దగ్గర పేరుకుపోయిన ధాన్యం నిల్వలను త్వరగా తరలించడానికి మార్గం సుగమం అవుతుందని వివరించారు. దీర్ఘకాలికంగా చెల్లించకుండా ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని దీనితో నిర్వహణ మూలధన కొరత సివిల్ సప్లయ్ శాఖకు కానీ కార్పొరేషన్‌కు ఉండదని ఎఫ్‌సిఐ దృష్టికి తీసుకొచ్చారు.మిషన్ కె10 ధాన్యం నిల్వచేసేందుకు,రవాణా చేసేవారి మధ్య సమన్వయం పెంపొందించేందుకు ఏర్పాటు చేశామని ఇది వందరోజులు నిర్వహించబడు తోందని రాబోయే ఖరీఫ్ నుంచి విజయవంతంగా అమలు చేస్తామని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఐదు లక్ష్యాలతో ఇది పనిచేస్తోందని బియ్యం ఎఫ్‌సిఐకి అప్పగించి కొత్త దిగుబడి రాకముందే గోదాములను సిద్ధం చేస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని యుద్ధప్రాతి పదికన మిల్లింగ్ చేసి భారత ఆహార సంస్థ (ఎఫ్ సి ఐ) కి అప్పగించడంపై ఇది ప్రధానంగా దృష్టి సారించి కొత్త స్టాక్ నిల్వకు స్థలభా వంటేకంటే చేయనున్నామని అన్నారు. రెండో ప్రాధాన్యతగా గోదా ముల అద్దెల భారం లేకుండా ధాన్యం ఒక క్రమపద్ధతిలో విక్రయించడం త్వరగా ధాన్యాన్ని నగదుగా మార్చి కొనుగోలు ప్రక్రియలో నగదు ప్రవాహం వేగంగా జరిగేలా చూడటానికి అవసరమైన చర్యలు పౌర దర్శకులా చేపట్టాలని ఆయన సూచించారు. మూడవ లక్ష్యంగా వనరుల సమీకరణతో ఆర్థిక బలోపేతం కావడానికి కేంద్ర ప్రభుత్వం నుండి రావలసిన రాయితీలు, కేంద్రం ఇవ్వకుండా నిలిపివేసిన నిధులు, యాధృచిక వ్యయాలు వెంటనే రాబట్టుకోవాలని నిర్ణయించామని దానికి తగినవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల యాంత్రీకరణ చేసి కూలీల పై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా పని వేగాన్ని పెంచడానికి ఆటోమెటిక్ పరికరాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉందని చెప్పారు. భారీ స్థాయిలో ధాన్యం వచ్చే కొనుగోలు కేంద్రాలను ఆధునీకరించడం దీని లక్ష్యమనీ అన్నారు.ఐదవ ప్రాధాన్యతన అంశంగా రవాణా రంగాలను విస్తరించడం, అవసరమైన వాహనాలను పెంచడం వంటి చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల మధ్య రవాణా అడ్డంకులను తొలగించడానికి వాహనాల అందుబాటును ఎప్పటికప్పుడు పసిగట్టే వ్యవస్థను (విఎల్‌టిపిఎస్) వినియోగంలోకి తీసుకురావడం ద్వారా రవాణా వ్యవస్థ రూపురేఖలను పూర్తిగా మార్చివేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మిషన్ కె10 కార్యాచరణ ప్రణాళికను ప్రారంభించిన సందర్భంగా ఒక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు, ఇందులో జిల్లా నిర్వాహకులు, జిల్లా పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీరాముడి బాటలో రేవంత్ పాలన రావణుడి బాటలో బిజెపి నాయకులు

## నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, జూలై 1,ప్రభాతవార్త :**శ్రీరాముని బాటలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పాలన కొనసాగితే, రావణుడి బాటలో బిజెపి నాయకులదోరణి ఉందని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి ఒక ప్రక టనలో విమర్శించారు. మూడు రోజులుగా బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ రాష్ట్ర పర్యటన అట్టర్‌ఫ్లాప్ షోగా ముగిసిందనీ కాంగ్రెస్ ముక్త్ తెలంగాణ అని నితిన్ నబీన్ ప్రకటించినా అది బిజెపివల్ల కాదనీ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ లో బజెపి అధికారంలోకి వస్తుందని పగటి కలలు కంటుందనీ ,తెలం గాణలో బిజెపికి అవకాశం లేదనీ అన్నారు. ఇక్కడ బిజెపి మత రాజకీయాలు చెల్లవు.రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అందరి సంక్షేమానికి అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నారనీ తెలిపారు. రామరాజ్యం తలపించే రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభు త్వాన్ని ఓడించే సత్తా బిజెపికి లేదనీ అన్నారు.ఇచ్చిన మాట ప్రకారం పాలన సాగిస్తు ప్రజల మన్ననలు పొందుతున్న రేవంత్ రెడ్డి పాలనను బిజెపి విమర్శించడం వారి మూర్ఖత్వ మనీ చెప్పారు.40ఏళ్లుగా అయోధ్య రామ మందిరం పేరు చెప్పుకుని రాజకీయాలు చేసిన బిజెపి అక్కడే దేవుని సొమ్మును దిగమింగిందనీ, పాప భీతి లేకుండా దేవుడి సొమ్ము మింగిన బిజెపి ఇక ముక్త భారత్ అవుతుందనీ జోస్యం చెప్పారు .తెలంగాణ లో అధికారంలోకి రావడం కాదు దేశంలోనే బిజెపి అడ్రెస్ లేకుండా పోతుందనీ శాపనార్థాలు పెట్టారు. అవినీతి, నియంత పాలన అక్రమాలతో బిజెపి దేశంలో ఒక రావణసుర సాగిస్తోందనీ చెప్పారు. బిజెపికి ఇవ్వే చివరి ఎన్నికలలనీ పేర్కొన్నారు. రాబోయే కాలం దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనీ ఆశా భావం వ్యక్తం చేశారు.రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడం ఖాయమనీ మల్లు రవి తెలిపారు.

# తెలంగాణలో బిజెపి మతరాజకీయాలకు చోటు లేదు



## ఇక్కడ కాంగ్రెస్‌పార్టీ మినహా మరోపార్టీకి అవకాశంలేదు

## ప్రతిపక్షనేత కెసిఆర్ ఫామ్‌హౌజ్‌కు పరిమితం. బావ, బామ్మర్దులు మాపై విష ప్రచారం

## టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, జూలై 1,ప్రభాతవార్త:** తెలంగాణలో బిజెపి మతరాజకీయాలకు చోటులేదని అధికారం కోసం మత చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తే సాధ్యం కాదనీ టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటన అట్టర్ ఫ్లాపైందనీ ఆపార్టీకి తెలంగాణలో అవకాశం లేదనీ, ప్రజలకు కూడా మతతత్వ రాజకీయాలు అవసరం లేదనీ అన్నారు. నితిన్ నబీన్ మూడు రోజుల పర్యటనలో ఏం చేశారు? ఆయనకు తెలంగాణ సామాజిక భౌగోళిక పరిస్థితుల మీద,కుల సమీకరణల మీద ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మీద అవగాహన ఉందా? అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఇప్పుడు ప్రజలు బిజెపి ముక్త్ భారత్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సోనియా గాంధీ వల్ల తెలంగాణ స్వప్నం సాకారమైందనీ అన్నారు. తెలంగాణ కోసం వేలమంది ప్రాణ త్యాగం చేశారని చరిత్రను గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీకి మినహాయించి తెలంగాణలో ఏ పార్టీకి చోటు లేదనీ ధీమా వ్యక్తం చేశారు.నిన్ననే సీఎం రేవంత్ రైతు భరోసా విడుదల చేశారనీ అన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో కాంగ్రెస్ పార్టీ శాశ్వతంగా ఉంటుందని చెప్పారు. వికసిత్ భారత్‌లో తెలంగాణ లేదా? అని బిజెపి నాయకులను ఆయన ప్రశ్నించారు. బిజెపి రెండు కోట్ల ఉద్యోగాలు పేరిట నిరుద్యోగులను మోసం చేయలేదా? అని అడిగారు. సంపన్న వర్గం కోసం బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంపని చేస్తోందనీ అన్నారు. అయోధ్య దోపిడి గురించి నబీన్ ఎందుకు మాటాడలేదనీ నిలదీశారు. కాళేశ్వరం గురించి బిజెపి నేతలు ఎందుకు మాట్లాడలేదు అదొక స్కాం అని సిబిఐ ఇచ్చాం ఎందుకు స్పందన లేదు? అని మహేష్ అన్నారు. తెలంగాణలో మత వైషమ్యాలకు తావులేదనీ బీహార్‌లో ఓటు దొంగిలించారనీ ఆయన ఆరోపించారు. బిజెపి నేతలు ఓట్ల దొంగలు, మీనాక్షి సీటు చోరీ చేశారని విమర్శించారు. సర్ పేరుతో ఓట్లజాబితా సవరణ చేయకుండా ఓట్లను తొలగిస్తున్నారనీ అన్నారు. మత సామరస్యానికి ప్రతీక తెలంగాణ ఉందని సిబిఐ, ఇడి ఎలక్షన్ కమిషన్ ను గుప్పిట్లో పెట్టుకొని బిజెపి రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందని అన్నారు. రాజ్యాంగ సంస్థలను బిజెపి తన అనుబంధ సంస్థలా వాడుకుంటున్నదని అన్నారు. విభజన హామీలు నెరవేస్తా మంటూ తెలంగాణకు ఒక సందేశం ఇస్తారని ఆశిస్తే విష బీజం వేశారనీ విమర్శించారు.రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టుల గురించి నితిన్ నభిన్ ఎందుకు మాట్లాడలేదనీ ఆయన ప్రశ్నించారు.జాతీయ అధ్యక్షుడు వస్తె పట్టుమని రెండు వేల మందిని కూడా పోగు చేసుకోలేని పార్టీ బిజెపి పార్టీ అని ఎద్దేవా చేశారు. పేద ప్రజలకు మోడీ ప్రభుత్వం ఇచ్చింది ఏమి లేదనీ గుర్తుచేశారు. 90 శాతం ప్రతిపక్ష నాయకుల మీద ఇడి దాడులు చేయించారు సీబీఐ, ఇడి లను అడ్డుపెట్టుకుని కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారు తెలంగాణలో బిజెపి నాయకులు టెంపరరీ గోల్స్ మాత్రమే రీచ్ అవుతారనీ, బిజెపి ముసుగులో ఇతర పార్టీలు రెచ్చగొట్టిన కాంగ్రెస్ పార్టీకి డోకా లేదనీ ఆయన ధీమా వ్యక్తంచేశారు.

కెసిఆర్ కు ప్రతిపక్ష హోదా ఇస్తే ఫామ్ హౌస్ కు పరిమితమైనారనీ, బావ, బామ్మర్దలు మాపై విష ప్రచారం చేస్తున్నారనీ మహేష్ ఆవేదన చెందారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు మా పార్టీ వైపు ఉన్నారు మా ప్రభుత్వం వచ్చాక 70 వేల ఉద్యోగాలు ఇచ్చామనీ చెప్పారు.

# ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఎంట్రీలకు ఆహ్వానం

## దరఖాస్తులకు చివరి తేదీ ఆగస్టు 15

## తెలంగాణలోని 74 పాఠశాలల్లో సినిమాల ప్రదర్శన

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** భారతదేశపు అతిపెద్ద బాలల చలనచిత్రోత్సవం కోసం 10వ ఎడిషన్ స్కూల్ సినిమా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (ఎస్‌సిఐఎఫ్ఎఫ్)- 2026 ఎంట్రీలను ఆహ్వానిస్తోంది. ఈ ఫిల్మ్ ఫెస్టివల్ నవంబర్ 14 నుండి 30 వరకు దేశవ్యాప్తంగా జరగనుంది. ఇది దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు పిల్లల చిత్రాలను తీసుకువస్తుంది. జనవరి 1, 2024 తర్వాత పూర్తయిన లైవ్ యాక్షన్, యానిమేషన్ డాక్యుమెంటరీ చిత్రాల కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిత్ర నిర్మాతల నుండి చివరి తేదీ ఆగస్టు 15 వరకు ఎంట్రీలను ఆహ్వానిస్తున్నారు. ఫీచర్ చిత్రాలు లైవ్ యాక్షన్, యానిమేషన్ లేదా డాక్యుమెంటరీ ఈ ఫెస్టివల్‌కు అర్హత కలిగి ఉంటాయి. సంభాషణలున్న అన్ని చిత్రాలకు తప్పనిసరిగా ఆంగ్ల సబ్‌టైటిల్స్ ఉండాలి. ఎస్‌సిఐఎఫ్ఎఫ్-2026 అన్ని విభాగాలలో అత్యుత్తమ చిత్రాలను అవార్డులతో గుర్తిస్తుంది. పిల్లలకు సుపరిచితమైన, సౌకర్యవంతమైన వాతావరణంలోకి పండుగ అనుభవాన్ని తీసుకురావాలనే ఎస్‌సిఐఎఫ్ఎఫ్ యొక్క ప్రత్యేక నమూనాలో భాగంగా, ఎంపిక చేసిన చిత్రాలను పాఠశాలల్లో ప్రదర్శిస్తారు. ఈ ఉత్సవం తెలంగాణతో సహా, దేశవ్యాప్తంగా పాఠశాలల్లో 5 నుండి 16 సంవత్సరాల వయస్సు గల విద్యావంతులైన ప్రేక్షకులకు తమ చిత్రాలను ప్రదర్శించే అవకాశాన్ని చలనచిత్ర నిర్మాతలకు అందిస్తుంది. తెలంగాణలో, ప్రస్తుతం 16 నగరాల్లోని 74 పాఠశాలల్లో స్కూల్ సినిమాలు ప్రదర్శించబడతాయి. దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలల ఆధ్వర్యంలో, జీవిత నైపుణ్యాలు, సామాజికభావోద్వేగ అభ్యసనం, సాంస్కృతిక అవగాహన కోసం సినిమాను ఒక సాధనంగా ఉపయోగించడంలో స్కూల్ సినిమా 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఎస్‌సిఐఎఫ్ఎఫ్ యొక్క 10వ ఎడిషన్ వస్తోంది. పిల్లలను సాంప్రదాయ ఫెస్టివల్ వేదికలకు తీసుకురావడానికి బదులుగా, ఎస్‌సిఐఎఫ్ఎఫ్ సినిమాలను నేరుగా తరగతి గదుల్లోకి తీసుకు వెళుతుంది, తద్వారా ఐదు నుండి 16 సంవత్సరాల వయస్సు గల యువ ప్రేక్షకుల కోసం పాఠశాలలను ప్రదర్శన స్థలాలుగా మారుస్తుందని ఎస్‌సిఐఎఫ్ఎఫ్ వెల్లడించింది.

# డిస్కంలో హైడ్రాలిక్ బకెట్ ల్యాడర్‌కు శ్రీకారం

## విద్యుత్ అంతరాయాల నివారణకు చర్యలు

## ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** వర్షాకాలంలో వినియోగదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు, వాటి అంతరాయాలను వేగంగా పరిష్కరించేందుకు ఉత్తరతెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్) కీలక చర్యలు చేపడుతోందని సంస్థ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ డివిజన్ పరిధిలోని నక్కలగుట్ట సెక్షన్, బాలసముద్రం పరిధిలోని ఈఫిల్ టవర్ సర్కిల్ లో బుధవారం హైడ్రాలిక్ బకెట్ ల్యాడర్ వాహనాన్ని వరుణ్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభానికి ముందు చేపట్టే ప్రీ మాన్సూన్ నిర్వహణ పనులు విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత మెరుగు పరచడానికి అత్యంత కీలకమన్నారు. ముఖ్యంగా చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లను తాకడం వల్ల వర్షాలు, ఈదురుగాలుల సమయంలో విద్యుత్ సరఫరా అంతరాయాలు అధికంగా సంభవిస్తాయని తెలిపారు. బకెట్ ల్యాడర్ వినియోగంతో చెట్ల కొమ్మలను సురక్షితంగా,వేగంగా కత్తిరించే అవకాశం ఉండటంతో విద్యుత్ అంతరాయాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. అలాగే విద్యుత్ సిబ్బంది ఎత్తైన ప్రదేశాల్లో అత్యంత భద్రతతో పనిచేయడానికి ఈ బకెట్ ల్యాడర్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. అంతేకాకుండా ప్రమాదాల నివారణలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించారు. ప్రస్తుతం ప్రారంభించిన హైడ్రాలిక్ బకెట్‌ల్యాడర్‌కు తోడు, మరోమూడు రోజుల్లో తమ సంస్థ పరిధిలోని వరంగల్‌లో మరో బకెట్ ల్యాడర్‌నుకూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.సంస్థ పరిధిలోని అన్ని 18సర్కిళ్లకు హైడ్రాలిక్ బకెట్‌ల్యాడర్ వాహ నాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలియచేశారు.

# ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగ జెఎసి ఆందోళన

## లక్ష మందితో సచివాలయం ముట్టడి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్(చిక్కడపల్లి),జులై 1ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం నీళ్లు, నిధులు, నియామకాలు అనే ఆశయాలతో ఏర్పడిందని, అయితే గత దశాబ్ద కాలంలో ఉద్యోగ నియామకాల్లో జాప్యం, పేపర్ లీకేజీలు వంటి ఘటనల వల్ల లక్షలాది నిరుద్యోగ యువత తీవ్రంగా నష్టపోయిందని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం అశోక్ నగర్ నగర కేంద్ర గ్రంథాలయం వద్ద నిరుద్యోగ జేఏసీ నాయకులు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆర్.కృష్ణయ్య ప్రసంగించారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఒకే ఏడాదిలో 2లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఇచ్చిన హామీతో పాటు యూత్ డిక్లరేషన్ ద్వారా అనేక వాగ్దానాలు చేసిందని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని, చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ, అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలకు వచ్చి యువతతో మాట్లాడాలని జేఏసీ నేతలు డిమాండ్ చేసారు.

ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు శంకర్ నాయక్, నరేష్, ఇంద్ర, రవి నాయక్, కుమార్, రవి యాదవ్, సవాయ్ సింగ్, దామోదర్ రెడ్డి, మధుసూదన్ గౌడ్, శ్రీకాంత్, ఉష, దివ్య, కల్పన, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం తొలి రోజు


# రూ.7వేల కోట్ల రుణం సేకరించిన సర్కార్

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు బంధు తదితర పథకాల కోసం స్వంత పన్ను ఆదాయంతో పాటు, రుణాల సమీకరణపై ఆధారపడింది. ఇందులో భాగంగా ఈ ఏడాది రెండో త్రైమాసికంలోని తొలి రోజే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అభివృద్ధి రుణాల వేలం ద్వారా రూ.7,000 కోట్ల మేర రుణాన్ని సేకరించింది. ఇందుకు గాను రిజర్వు బ్యాంకు బహిరంగ మార్కెట్‌లో నిర్వహించిన ఈ వేలంలో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను తనఖా పెట్టి ఈ రుణాన్ని తీసుకున్నట్లు రాష్ట్ర ఆర్థికశాఖ అధికారవర్గాలు వెల్లడించాయి. ఈ మొత్తం రుణంలో 7.53 వార్షిక వడ్డీకి, 13ఏండ్ల కాలపరిమితితో రూ.1,000 కోట్లు, 7.64వార్షిక వడ్డీకి, 18 ఏండ్ల కాలపరిమితితో మరో రూ.2,000కోట్లు, 7.65 వార్షిక వడ్డీ ప్రాతిపదికన 23ఏండ్ల కాలపరిమితితో ఇంకో రూ.2,000కోట్లు, 7.65 వార్షిక వడ్డీకి 29 ఏండ్ల కాలపరిమితితో మరో రూ.2,000 కోట్లు తీసుకున్నట్టు రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. ఇక ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి జూన్ నెలాఖరుతో ముగిసిన తొలి త్రైమాసికానికి రాష్ట్ర ఆర్థిక శాఖ ఇప్పటికే రూ.18,900 కోట్లు రుణ సమీకరణ చేసింది.

తాజా రుణ సేకరణ కార్యక్రమంతో, 2026-27 మొదటి రెండు త్రైమాసికాలలో తెలంగాణ మొత్తం బహి రంగ మార్కెట్ రుణాలు రూ.39,900 కోట్లకు చేరుకోనున్నాయి. ఇక జూలై నుండి సెప్టెంబరు వరకూ కలిగిన ఈ రెండవ త్రైమాసికంలో రూ.21,000 కోట్ల విలువైన ఓపెన్ మార్కెట్ రుణాలను సమీకరించేందుకు ఇటీవల రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇండెంట్ పెట్టింది. ఈ రుణాల క్యాలెండర్ ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వం జూలై 1న నాలుగు విడతల్లో రూ.7 వేల కోట్లు, ఆ తర్వాత అదే నెల 15న రెండు విడతల్లో రూ.3,500 కోట్లు, 29న మరో రూ.వెయ్యి కోట్లు సమీకరించనుంది.

అలాగే ఆగస్టులో 12న రెండు విడతల్లో రూ.2,500 కోట్లు, 27న మూడు విడతల్లో ఇంకో 2వేల కోట్లు సమీక రించాలని యోచిస్తోంది. రెండో క్వార్టర్ చివరి నెల సెప్టెంబరు 9న రెండు విడతల్లో రూ.2,500 కోట్లు, 23న మూడు విడతల్లో మరో రూ.2,500 కోట్లు సమీకరించాలని ప్రతిపాదించింది.

# సిఎం వ్యవహారశైలి నచ్చలేదు



## నల్గొండ సభకు ఉద్దేశపూర్వకంగానే వెళ్లలేదన్న రాజగోపాల్ రెడ్డి

## యాదగిరిగుట్ట బోర్డు ఎంపికలో తనను సంప్రదించలేదని ఆవేదన

## సమన్వయం లేకుంటే కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టం తప్పదని హెచ్చరిక

**యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీలో నిర్ణయాలు తీసుకునే విధానం, ప్రభుత్వ వ్యవహారశైలిపై మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారశైలి తనకు ఏమాత్రం నచ్చలేదని, అందుకే ఇటీవల నల్గొండలో నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగ సభకు తాను ఉద్దేశపూర్వకంగానే హాజరు కాలేదని ఆయన స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాల్లో ప్రజాప్రతినిధులను పూర్తిగా పక్కన పెడుతున్నారని, ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టం తప్పదని హెచ్చరించారు.

ఒక ప్రైవేట్ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై తన అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేశారు. పార్టీని బలోపేతం చేయడంలో, అధికారంలోకి తీసుకురావడంలో ఎన్నో సంవత్సరాలుగా కష్టపడ్డ నాయకులకు ప్రస్తుతం తగిన గుర్తింపు దక్కడం లేదని అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకాన్ని ప్రస్తావిస్తూ, యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేగా ఉన్న తనకు కూడా కనీస సమాచారం ఇవ్వలేదని రాజగోపాల్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, జిల్లా నాయకత్వంతో చర్చించకుండా కీలక నిర్ణయాలు తీసుకోవడం వల్ల కార్యకర్తల్లో కూడా అసంతృప్తి పెరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అన్ని పరిణామాలను తెలంగాణ పీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, ఏఐసీసీ కార్యదర్శి మీనా నటరాజన్‌కు కూడా పూర్తి వివరాలు తెలియజేస్తానని రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా తన అభిప్రాయాలను అధిష్ఠానానికి తెలియజేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. రాజగోపాల్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పరిస్థితులపై మరోసారి చర్చకు దారితీశాయి. ముఖ్యంగా యాదగిరిగుట్ట దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకాల అంశాన్ని బహిరంగంగా ప్రస్తా వించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఎలా స్పందిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# సింగరేణి అధికారుల దీక్షకు హరీష్ రావు సంఘీభావం

## అసెంబ్లీలో పోరాడుతాం, ఉపముఖ్యమంత్రి స్పందించకపోవడం దారుణం



శ్రీరాంపూర్‌లో అధికారుల రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలుపుతున్న హరీష్ రావు

**నస్పూర్, జూలై 1, ప్రభాతవార్త:** సీఎంఓఏఐ కేంద్ర కమిటీ పిలుపు మేరకు పే అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ బకాయిల చెల్లింపు తదితర న్యాయమైన డిమాండ్ల సాధనకై సింగరేణి అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి మూడవ రోజుకుచేరాయి. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని అధికారుల దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సందర్శించి తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సం దర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ సింగరేణి అధికారులు గత మూడు రోజులుగా శాంతియుతంగా దీక్షలు చేస్తున్న ప్పటికీ, సింగరేణి సంస్థ పరిధిలోని ఉపము ఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పందిం చకపోవడం అత్యంత దారుణమన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో అధికారులకు ఇలాంటి దుస్థితి రాలేదని గుర్తుచేశారు. సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించిన ఆయన, సంస్థ ఉనికిని కాపా డుకోవడానికి అధికారులు, ఉద్యోగులు కలిసి కట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. అధికారుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో గళమె త్తుతామని హామీ ఇచ్చారు. శ్రీరాంపూర్ ఏరియాలో బుధ వారం జరిగిన దీక్షల్లో ఐకే1ఏ మేనేజర్ కోటయ్య, ఆర్ అండ్ డీ మేనేజర్ అమర్నాథ్, సీనియర్ పీఓలు సంతన్, ఓంకారిబాబు, అరుణ్, రామాచారి, డీవై ఎస్ఈ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వంనుండి డిమాండ్లపై స్పష్టమైన హామీవచ్చే వరకు వెనక్కి తగ్గేదే లేదని అధికారులు స్పష్టం చేశారు. జూలై 13 వరకు కొనసాగే ఈ రిలేనిరాహార దీక్షలను జయప్రదం చేయాలని, ప్రతి ఒక్క అధికారి ఇందులో భాగస్వాములు కావాలని సీఎంఓఏఐ ప్రతినిధులు కోరారు.

# డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై1:** డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులందరికీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. తమ నైపుణ్యం ద్వారా ప్రతి రోజూ వేల ప్రాణాలను డాక్టర్లు కాపాడుతున్నారని మంత్రి పేర్కొన్నారు.సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని, వారి సేవలు ఆరోగ్య వ్యవస్థకు ఎంతో కీలకమని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్యులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య సౌకర్యాలు, తగిన మానవ వనరులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 440 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు, సుమారు 800 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. డాక్టర్లతో పాటు ఇతర పోస్టులను కూడా పెద్ద సంఖ్యలో భర్తీ చేశామని చెప్పారు. సుమారు 15వేల పోస్టులు భర్తీ చేశామని తెలిపారు.ఉద్యోగాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న డెంటిస్టుల ఆకాంక్షను నెరవేర్చుతూ 48 డెంటల్ సర్జన్ పోస్టులను భర్తీ చేశామని మంత్రి గుర్తు చేశారు.ఈ రెండున్నర సంవత్సరాల్లో సుమారు 1,300 మంది డాక్టర్లకు పదోన్నతులు కల్పించినట్లు పేర్కొన్నారు, జూనియర్ డాక్టర్ల స్టైఫండ్, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాలను 15 శాతం మేర పెంచామని మంత్రిగుర్తు చేశారు.అద్దె భవనాలు, పాత భవనాల్లో కొనసాగుతున్న మెడికల్ కాలేజీలు, హాస్పిటళ్లకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆధునిక భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు.

# సిఎంతో చర్చించే స్థాయి కెటిఆర్‌కు లేదు

## దమ్ముంటే ప్రతిపక్షనేతను అసెంబ్లీకి తీసుకురా: ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్

**హైదరాబాద్,జూలై 1,ప్రభాతవార్త:**ప్రజల సమస్యలపై చర్చించే దమ్ముంటే ప్రతిపక్షనేతను అసెంబ్లీకి తీసుకొనిరా రేవంత్‌తోచర్చించే స్థాయి కెటిఆర్‌కు లేదని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ అన్నారు. బుధవారం సిఎల్పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రజా పాలన పని తీరు చూసి కెటిఆర్ ఓర్చుకోలేకపోతున్నారనీ ఆవేదన చెందారు.మాట ప్రకారం అన్నదా తలకు రైతుభరోసా నిధులు జమ చేస్తే జీర్ణించుకోలేకపోతున్నారని దయ్యబట్టారు. ప్రభుత్వాధినేతగా ముఖ్యమంత్రి ప్రధాన ప్రతిపక్ష నేతకు సవాల్ విసిరారు.ప్రతిపక్ష నేత ఏమో సవాల్‌పై సైలెంట్‌గా ఫామ్ హౌస్‌లో పడుకున్నారనీ ఎద్దేవా చేశారు.ప్రజా సమస్యలపై చర్చ కోసం ప్రతిపక్షనేత లేఖ రాస్తే అసెంబ్లీ వేదికగా చర్చకు సిద్ధమని ముఖ్యమంత్రి చెప్పారు.కానీ కెటిఆర్ మాత్రం బయట చర్చకోసం సవాల్ చేయడం హాస్యాస్పదమనీ ఐనా ముఖ్యమంత్రితో చర్చకు వచ్చే స్థాయి కెటిఆర్‌కు లేదని కొట్టివేశారు.



## తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం: కల్వకుంట్ల కవిత

**సికింద్రాబాద్, జూలై 1 ప్రభాతవార్త:** చిలకలగూడ గాంధీ విగ్రహం తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు పార్టీ కార్యకర్తలు సీతాఫల్‌మండి చౌరస్తా వద్ద నుంచి చిలకలగూడ వరకు ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు పూర్తి స్థాయిలో ఉచిత విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పేదలు, మధ్యతరగతి ప్రజలకు వైద్యం భారంగా మారిన నేపథ్యంలో ప్రతి కుటుంబానికి పూర్తిస్థాయి ఉచిత వైద్య సేవలను అందించే విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇచ్చేవరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక స్థానం గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చర్చకు సిద్ధం..మీ బిఆర్ఎస్ ఆఫీస్‌కు వస్తా

### నేను చెప్పిన లెక్కలు తప్పని తేలితే స్పీకర్‌కు రాజీనామా లేఖ ఇస్తా: కెటిఆర్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్

**హైదరాబాద్,జూలై 1ప్రభాతవార్త:** ఔటర్ రింగ్‌రోడ్ లీజు డబ్బులతో రైతుబంధు పథకం డబ్బులు ఇచ్చిన ఘనత బిఆర్ఎస్‌ది, బడ్జెట్ మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పులకుప్పగా మార్చారు చేసేవన్ని చేసి ఇప్పుడు కెటిఆర్ చిలక పలుకులు పలుకుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. బుధవారం సిఎల్పీలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, డా. రాజేష్ రెడ్డిలతో కలసి మాట్లాడుతూ కెటిఆర్ ప్రజలను మభ్య పెట్టడం ఇకనైనా మానుకోవాలనీ బిఆర్ఎస్ హయాంలో రూ.8 లక్షల కోట్లకు పైగా అప్పులు చేశారనీ నేను చెప్పిన లెక్కలు అబద్ధాన్ని తేలితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా మీ బిఆర్ఎస్ పార్టీ ఆఫీస్ కు వస్తా నేను చెప్పిన లెక్కలు తప్పని నిరూపిస్తే స్పీకర్ కు రాజీనామా లేఖ ఇస్తా చర్చకు సిద్ధమా అని కెటిఆర్‌కు సవాల్ విసిరారు. బిఆర్ఎస్ గొప్ప పాలన చేసి ఉండి ఉంటే ప్రజలు మిమ్మల్ని ఎందుకు గద్దె దింపారు?అని ప్రశ్నించారు. గతంలో వారి ఆస్తులు ఎట్లా ఉండే ఇప్పుడు వారి ఆస్తులు ఎట్లా ఉన్నాయో అందరికీ తెలుసనీ అన్నారు. కెటిఆర్, హరీష్ రావుకు చిన్న మెదడు, పెద్ద మెదడు చిట్లడంతో పాటు రాష్ట్ర ఖజానాకు చిల్లు పెట్టారని విమర్శించారు. తెలంగాణ సొమ్ముతో జల్సాలు చేశారనీ దుయ్యబట్టారు. మీరు చేసిన తప్పులకు మిమ్మల్ని గద్దె దించిన ప్రజలని తప్పు పడతారా? అని ప్రశ్నించారు.



## మేడిగడ్డ నీటిని తరలించకపోవడం దుర్మార్గం: మాజీ మంత్రి హరీశ్‌రావు

### కేసులకు భయపడేది లేదు: ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:** కరీంనగర్ బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో భాగంగా నేతలు ప్రభుత్వంపై విమర్శనా సంధించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ పంక్షన్ హాల్ వేదికగా జరిగిన ఈ సమావేశానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.మాజీ మంత్రి గంగుల కమలాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో క్షేత్రస్థాయి కార్యకర్తలకు హరీష్ రావు దిశానిర్దేశం చేశారు. కరీంనగర్‌తో పార్టీకి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా హరీశ్‌రావు గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో కరీంనగర్ కీలక పాత్ర పోషించిందన్నారు. కేసీఆర్ ఎంపీకి రెండుసార్లు రాజీనామా చేసి గెలుపొందిన గడ్డ ఇది అన్నారు. అటువంటి చోట కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆయన ధ్వజమె త్తారు. మేడిగడ్డ నుండి నీటిని తరలించే అవకాశం ఉన్నా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం బురద రాజకీయాల కోసం నీటిని నిలిపివేసిందనీ ఆరోపించారు. కేసీఆర్ దూరదృష్టితో కాళేశ్వరాన్ని నిర్మించి నీళ్ల ఇచ్చార న్నారు.ఇప్పుడు ఆ నీటి కష్టాలను మళ్ళీ చూస్తున్నామని తెలిపారు..రైతులకు ఏమీ చేయని కాంగ్రెస్, కేసీఆర్‌పై నోరు పారేసుకోవడం సరికాదన్నారు. బిఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలనీ రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై హరీశ్‌రావు కీలక సూచనలు చేశారు. ప్రతి 20 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ ప్రక్రియలో బిఎల్ఏలు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు.ఓట్లు గల్లంతు కాకుండా క్షేత్రస్థాయిలో నిఘా వేయాలని ఆదేశించారు. పశ్చిమ బెంగాల్ ఉదంతాలను ఉదహరిస్తూ, నిరక్ష్యం వహిస్తే అర్హులు ఓటు హక్కునే కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.అనంతరం మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ కార్యకర్తలకుఅండగా ఉంటామన్నారు..తనని నాలుగుసార్లు గెలిపించిన కార్యకర్తలకు శిరస్సు వంచి నమస్కరిస్తు, కృతజ్ఞతలు తెలియజేసారు.

# కవిత పార్టీ పేరుపై అభ్యంతరాల వెల్లువ

### కేంద్ర ఎన్నికల సంఘానికి 700 ఫిర్యాదులు


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై1:** కల్వకుంట్ల కవిత స్థాపించిన నూతన రాజకీయ పార్టీ పేరుపై సందిగ్ధత కొనసాగుతోంది. ఆమె ప్రతిపాదించిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పేరుపై కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) దాదాపు 600 నుంచి 700 వరకు అభ్యంతరాలు అందాయి. ఈ అభ్యంతరాలను ప్రధానంగా భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు వ్యక్తం చేసినట్లు సమాచారం. గతంలో తెలంగాణ రాష్ట్ర సమితిగా ఉన్న తమ పార్టీ పేరును ఇది పోలి ఉండటం వల్ల ప్రజల్లో గందరగోళం తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు అభ్యంతరాలపై కవిత పార్టీ ప్రతినిధులు ఈసీకి వివరణ ఇచ్చారని, మిగిలిన వాటికి కూడా సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం. 2026 ఏప్రిల్ నెలాఖరులో కవిత తన నూతన పార్టీని ప్రకటించిన సమయంలో, ఈ పేరుపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. అనంతరం, ఈసీఐ అభ్యంతరాల స్వీకరణకు 30 రోజుల గడువు ఇచ్చింది.

జూన్ నెలలో బీఆర్ఎస్ పార్టీ అధికారికంగా అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు, సోలాపూర్‌కు చెందిన మరో సంస్థ కూడా ఇదే తరహా పేరు కోసం దరఖాస్తు చేసుకోవడంతో ఈ ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారింది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం అందిన అన్ని అభ్యంతరాలను, వాటికి లభించిన వివరణలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. రాజకీయ పార్టీల పేర్లు, గుర్తుల నిబంధనలకు అనుగుణంగా, ఓటర్లలో ఎలాంటి అయోమయం లేకుండా చూసేందుకు సమీక్ష నిర్వహించిన తర్వాతే ఈసీ తన తుది నిర్ణయాన్ని ప్రకటించనుంది.

# రెండో రోజు రైతులకు రూ.1,590 కోట్లు జమ

### యాప్ ద్వారా యూరియా అక్రమాలు వెలుగులోకి: వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** రైతు భరోసా పథకం కింద రెండో రోజు రూ.1,590,02 కోట్లు సంబంధిత లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. రెండో రోజు బుధవారం నాడు ఈ మొత్తాన్ని రాష్ట్రంలోని 3 ఎకరాల వరకు భూమి కలిగిన 10.68 లక్షల మంది రైతులకు పంపిణీ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఇప్పటివరకు రాష్ట్రంలోని 54.96 లక్షల మంది రైతులకు చెందిన 67.87 లక్షల ఎకరాలకు రైతుభరోసా చెల్లింపు ఈ రెండు రోజుల్లోనూ మొత్తం రూ.4072.04 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. జకాగా ఫెర్టిలైజర్స్ యాప్ ద్వారా సిద్దిపేట యూరియా బస్తాల అక్రమాలు వెలుగులోకి వచ్చాయని వెల్లడించారు. సిద్దిపేట్‌లో 6 వేల యూరియా బస్తాలు మాయమైన కేసులో డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, అరెస్ట్ చేసినట్లు వివరించారు. అంతేకాకుండా వ్యవసాయశాఖ అధికారిని కూడా సస్పెండ్



చేశామన్నారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం యూరియా యాప్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. యూరియా యాప్ వల్లే అక్రమాలను గుర్తించడం సాధ్యమైందని స్పష్టం చేశారు. ఎరువులు ప్రధానంగా యూరియా అక్రమాలను ప్రభుత్వం ఏమాత్రం సహించని హెచ్చరించారు.అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణలో ప్రభుత్వం రాజీపడదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 3.64 లక్షల టన్నుల యూరియా అందుబాటులో ఉందని వెల్లడించారు. రాష్ట్రానికి రావాల్సిన 6 లక్షల టన్నుల యూరియాలో 5.62 లక్షల టన్నుల యూరియాను రాష్ట్రానికి తెప్పించగలిగామని చెప్పారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రంపై నిరంతరం ఒత్తిడి తెచ్చి, అవసరమైన యూరియాను సకాలంలో తీసుకురాగలిగామని పేర్కొన్నారు. అయితే యూరియా యాప్‌పై కొందరు విమర్శలు చేస్తున్నప్పటికీ, రైతులు రోజురోజుకూ అధిక సంఖ్యలో దీపి ద్వారా యూరియాను కొనుగోలు చేయడం ఈ యాప్ పై వారికి ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. ఇప్పటివరకు యాప్ ద్వారా రైతులు 46.03 లక్షల బస్తాలను కొనుగోలు చేశారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 79.29 లక్షల బస్తాల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎరువుల సరఫరా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం, క్రమశిక్షణను కచ్చితంగా అమలు చేస్తున్నామని తెలిపారు.

# రోగికి ఒకేసారి ఐదు అవయవాలు మార్పిడి

### ఉస్మానియా ఆసుపత్రి వైద్యుల ఘనత, 36 గంటల్లో సంక్లిష్టమైన ఆపరేషన్ విజయవంతం, దేశంలోనే తొలిసారిగా సరికొత్త అధ్యాయానికి నాంది

**హైదరాబాద్, జూలై 1,ప్రభాతవార్త:** ఉస్మానియా ఆస్పత్రిలో ఎన్నో అరుదైన శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. టెక్నాలజీని ఉపయోగించుకుని.. అత్యంత కఠినమైన, సంక్లిష్ఠమైన ఆపరేషన్లను కూడా ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు. గతంలో సక్సెస్ చేశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా మరో అరుదైన ఆపరేషన్ నిర్వహించి సరికొత్త చరిత్ర సృష్టించారు. దేశంలోనే ఇప్పటివరకు ఎవరూ చేయని విధంగా ఒకేసారి ఒక రోగికి 5 అవయవాలను మార్పిడి చేసి సరికొత్త మైలురాయిని అందుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఒక 30 ఏళ్ల యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఆ టెకీ అరుదైన, ప్రాణాంతకమైన ఆరోగ్య సమస్యతో బాధపడేవాడు. ఈక్రమంలోనే ఆయువకుడి ప్రాణాలు రక్షించేందుకు ఉస్మానియా ఆస్పత్రి సర్జన్లు రంగంలోకి దిగారు. ఈఆపరేషన్ ఏకధాటిగా 36 గంటల పాటు నిర్వహించి అత్యంత సంక్లిష్టమైన విప్లవాత్మక శస్త్రచికిత్సలో ఆ రోగికి ఒకేసారి 5 అవయవాలను విజయవంతంగా మార్పిడి చేశారు.



జీర్ణాశయం, ద్వాదశ శుక్లం, క్లోమం, చిన్న పేగు, కుడి వైపు పెద్ద పేగు వంటి 5 అవయవాలను మార్పిడి చేసి వైద్య చరిత్రలోనే సరికొత్త అధ్యాయం లిఖించారు.

సాధారణంగా ఒక వ్యక్తికి, ఒకసారి ఒక అవయవం మార్పిడి చేయడమే డాక్టర్లకు ఎంతో పెద్ద సవాలుతో కూడుకున్న పని. అలాంటిది ఒకే సర్జరీలో 5 అవయవాలను సక్సెస్‌ఫుల్‌గా మార్పిడి చేయడం మన దేశ వైద్య చరిత్రలోనే ఇది తొలిసారి కావడం విశేషం. కార్పొరేట్ ఆస్పత్రులకు ఏమాత్రం తీసిపోని వి ధంగా ప్రభుత్వ రంగంలో ఉస్మానియా జనరల్ ఆస్పత్రి ఈ స్థాయి విజయం సాధించడం ఎంతో గర్వకారణంగా నిలిచింది.

ఉస్మానియా ఆస్పత్రి సాధించిన ఈ అసాధారణ విజయంతో తెలంగాణ ప్రభుత్వ వైద్య రంగ కీర్తి కిరీటంలో మరో మణిహారం చేరినట్లయింది.

# నల్గొండ రైల్వే స్టేషన్‌కు సరికొత్త రూపు

### చివరి దశలో రూ.17.01కోట్లతో ఆధునికీకరణ పనులు



**తార్నాక, జూలై 1 ప్రభాతవార్త:** అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏబీఎస్ఎస్) కింద నల్గొండ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. రూ.17.01 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పునరాభివృద్ధి పనులు తుదిదశకు చేరుకోగా, పూర్తయిన అనంతరం ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లను ఆధునికీకరించి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో భారతీయ రైల్వే అమృత్ భారత్ స్టేషన్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా తెలంగాణలో రూ.2,000 కోట్లకు పైగా వ్యయంతో 40 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2023 ఆగస్టు నుంచి 2024 ఫిబ్రవరి మధ్య ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన నల్గొండ రైల్వే స్టేషన్ నడికుడి-బీబీనగర్ రైల్వే మార్గంలో కీలక కేంద్రంగా ఉంది. రోజూ సుమారు 3 వేల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్న ఈ స్టేషన్‌లో డెమూ, మెమూ రైళ్లతో కలిపి రోజుకు దాదాపు 44 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ, లింగంపల్లి ప్రాంతాలకు ఉద్యోగ, వ్యాపార అవసరాల కోసం ప్రయాణించే వారికి ఈ స్టేషన్ ప్రధాన కేంద్రంగా నిలుస్తోంది.పునరాభివృద్ధి పనుల్లో భాగంగా 12 మీటర్ల వెడల్పుతో ఆధునిక ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫారాలపై 3,309 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అదనపు షెడ్లు, 9,657 చదరపు మీటర్ల ప్లాట్‌ఫారమ్ ఉపరితల అభివృద్ధి, స్టేషన్ ప్రాంగణ సుందరీకరణ, కాన్‌కోర్స్ ఆధునికీకరణ, విఐపీ లాంజ్, విశ్రాంతి గదులు, ఆధునిక మరుగుదొడ్లు, దివ్యాంగులకు అనుకూల సౌకర్యాలు, నూతన సూచిక బోర్డులు, ఆధునిక ఫర్నిచర్, స్టేషన్ ముఖద్వారం (ఫసాడ్) అభివృద్ధి వంటి పనులు చేపట్టారు. ఈ పునరాభివృద్ధి పూర్తయిన అనం తరం నల్గొండ రైల్వే స్టేషన్ ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, సురక్షితమైన, ఆధునిక ప్రయాణ అనుభూతిని అందించనుంది. భారతీయ రైల్వే మౌలిక సదుపాయాల ఆధునీ కరణకు నిదర్శనంగా నిలిచే ఈ ప్రాజెక్టు నల్గొం డను ప్రాంతీయ రవాణా పరంగా మరింత కీలక కేంద్రంగా తీర్చిదిద్దనుంది.

# నితిన్ నబిన్ పర్యటనతో తెలంగాణ కాంగ్రెస్ గుండెల్లో రైళ్లు

### కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని, ఆర్ఆర్ ట్యాక్స్‌ను ఎండగట్టడంతో భయపడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి: బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై1:** బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ మూడు రోజుల రాష్ట్ర పర్యటన విజయవంతం కావడం చూసి అధికార కాంగ్రెస్ పార్టీలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో భయాందోళన మొదలైందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుల పర్యటనకు తెలంగాణ ప్రజల నుండి, పార్టీ శ్రేణుల నుండి లభించిన అపూర్వ స్వాగతం, ఆశీర్వాదాలు చూసి ముఖ్యమంత్రి ఫ్యూజులు ఎగిరిపోయాయని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని సైతం ఎన్నికల వ్యూహంతో ఓడించిన ఘనత కలిగిన నితిన్ నబిన్‌పై రేవంత్ రెడ్డి అహంకారంతో, రాజకీయ దురహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బుధవారం రాష్ట్ర పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. మమతా బెనర్జీ బలహీనమైన ముఖ్యమంత్రి కాబట్టే ఓడిపోయిందని, తనను ఓడించడం ఎవరితరం కాదంటూ రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు ఆయనలోని అభద్రతాభావాన్ని, భయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు. నితిన్ నబిన్ పిలుపునిచ్చిన కాంగ్రెస్ ముక్త్ తెలంగాణ నినాదానికి రాష్ట్ర ప్రజలు ఇప్పటికే సిద్ధమయ్యారని, కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని, ఆర్ఆర్ ట్యాక్స్ వసూళ్లను బిజెపి ఎండగట్టడంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏం మాట్లాడాలో పాలుపోవడం లేదని విమర్శించారు.

గడిచిన కాలంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఏం చేసింది, అలాగే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు ఎంత మోసం చేసింది అనే అంశాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని రాంచందర్ రావు స్పష్టం చేశారు. దమ్ముంటే సచివాలయం (సెక్రటేరియట్) గేటు ముందు రెండు కుర్చీలు వేసుకుని డెవలప్ మెంట్‌పై చర్చిద్దామని, వాన పడితే గొడుగులు కూడా తామే తెస్తామని సవాల్ విసిరారు. బిజెపి నిర్వహించిన సంస్థాగత సమావేశాలకు వచ్చిన అపూర్వ స్పందనను చూసి కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు తట్టుకోలేకపోతున్నాయని మండిపడ్డారు. హైదరాబాద్‌లో 10,000 బూత్‌లకు గాను 10,000 మంది బూత్ ప్రెసిడెంట్లు, వరంగల్‌లో 5,000 మంది, పార్టీ ఆఫీస్ ప్రారంభోత్సవానికి 3,000 మంది జిల్లా కార్యకర్తలు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌కు ఆశించిన దానికంటే ఎక్కువగా 450 మంది ప్రతినిధులు హాజరయ్యారని వివరించారు.

# ధరణి, భూ భారతి పోర్టల్‌లలో అక్రమాలపై అధికారులతో ప్రత్యేక కమిటీ

### రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై1:** ధరణి, భూ భారతి పోర్టల్లలో వెలుగులోకి వచ్చిన అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ తెలిపారు. ఈ అంశంపై బుధవారం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. ధరణి పోర్టల్‌పై కొనసాగుతున్న ఫోరెన్సిక్ ఆడిట్ పురోగతిపై జరిగిన సమీక్షలో కొన్ని ఆందోళనకర అంశాలు మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు లోకేష్ కుమార్ తెలిపారు. ధరణి పోర్టల్ సిస్టమ్ నిర్మాణంలో సహజ సిద్ధమైన భద్రతా లోపాలు ఉన్నాయని, వాటిని కొందరు అక్రమ శక్తులు దుర్వినియోగం చేసి కొన్ని మాడ్యూళ్ల ద్వారా అనధికారిక ఎంట్రీలు చేసినట్లు గుర్తించినట్లు చెప్పారు. అలాగే నేషనల్ ఇన్‌పార్మటిక్స్ సెంటర్‌రూపొందించిన భూ భారతి పోర్టల్ కూడా ధరణి ఆధారిత సాంకేతిక నిర్మాణాన్ని అనుసరించడం వల్ల అదే తరహా లోపాలకు గురయ్యే అవకాశం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ నేప థ్యంలో ప్రభుత్వం ప్రత్యేకకమిటీనిఏర్పాటు చేసిందని వెల్లడించారు. **ఈ కమిటీలో సభ్యులుగా:** మిక్కిలినేని మను చౌదరి – కలెక్టర్, మేడ్చల్‌మల్కాజిగిరి, ప్రతీక్ జైన్ – కలెక్టర్, సంగారెడ్డి,అనుదీప్ దురిశెట్టి – సంయుక్త కార్యదర్శి,ఐటీ అండ్ కమ్యూనికేషన్స్, హర్ష వర్ధన్– తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, అపూర్వ్ చౌహాన్– ప్రాజెక్ట్ డైరెక్టర్, సీఎంఆర్ఓ, మంద మకరంద్– ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐటీడీఏ, ఉట్నూర్, ఏ.సంపత్ –డీఎస్పీ, తెలంగాణ సీఐబీ, సైబర్ క్రైమ్స్, ఎం. సుభా షిణి – డీఐజీ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్,ఏ. శ్రీనివాస సుబ్బారావు –సీనియర్ డైరెక్టర్ (ఐటీ), ఎన్ఐసీ కాగామంత్రి పొంగులేటి ఆదేశాల మేరకు నేషనల్ ఇన్‌ఫార్మటిక్స్ సెంటర్ పూర్తిగా కొత్తగా, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా సరికొత్త సిస్టమ్ ఆర్కిటెక్చర్‌నుఅభివృద్ధి చేయాలని సూచించినట్లు తెలిపారు.ఈ కమిటీ 15 రోజుల్లోగా ప్రభుత్వానికినివేదికను సమర్పించనుందని, ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

# రోజు వారీ జీవితంలో విద్యుత్ భద్రత అంతర్భాగం

### కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్‌లాల్

**హైదరాబాద్, జూలై 1, ప్రభాతవార్త:** విద్యుత్ భద్రత అంత్యంత ముఖ్యమైనదని, దీన్ని రోజువారీ జీవితంలో ఒక అంతర్భాగంగా మార్చుకోవాలని కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్ లాల్ పిలుపునిచ్చారు. క్రమం తప్పని భద్రతా తనిఖీలు, నివారణ నిర్వహణ, సరైన ఎర్తింగ్, భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా షార్ట్ సర్క్యూట్ల వల్ల సంభవించే చాలా విద్యుత్ అగ్నిప్రమాదాలను నివారించవచ్చన్నారు. విద్యుత్ భద్రతా దినోత్సవం సందర్భంగా సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల భారత విద్యుత్ భద్రతా అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి మాట్లాడుతూ " నేటి అవగాహన, రేపటి నివారణ – విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన కలిగే అగ్ని ప్రమాదాలను నివారించడానికి మనమందరం ఏకమవుదాం " అని అన్నారు. నివాస సంక్షేమ సంఘాలు, పరిశ్రమలు, ఆసుపత్రులు, వాణిజ్య సంస్థలు మరియు మౌలిక సదుపాయాల ఏజెన్సీలు విద్యుత్ భద్రతా పద్ధతులను బలోపేతం చేయాలని సూచించారు. మరో పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద యెస్సో నాయక్ మాట్లాడుతూ ఇళ్లలో, కార్యాలయాల్లో మరియు బహిరంగ ప్రదేశాల్లో సురక్షితమైన విద్యుత్ పద్ధతులను పాటించడం ద్వారా ప్రతి పౌరుడు విద్యుత్ భద్రతను తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని కోరారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఛైర్‌పర్సన్ ఘనశ్యామ్ ప్రసాద్ ప్రసంగిస్తూ విద్యుత్ భద్రత చిన్న చిన్న, రోజువారీ చర్యలతో ప్రారంభమవుతుందని నొక్కిచెప్పారు. విద్యుత్ ప్రమాదాల నివారణ అనేది ఒకేసారి చేసే ప్రయత్నం కాకుండా నిరంతర అభ్యాసంగా మారే సంస్కృతిని పెంపొందించాలని పిలుపునిచ్చారు. నివాస సంక్షేమ సంఘాలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, పౌరులు సురక్షి తమైన విద్యుత్ పద్ధతులను అవలంబించాలన్నారు. సంభావ్య విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. విద్య ద్వారా ప్రజలలో అవగాహనను బలోపేతం చేయడానికి మరియు సురక్షితమైన విద్యుత్ పద్ధతులను ప్రోత్సహించడానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. అంతకు ముందు ఇంధన శాఖ మంత్రి మనోహర్ లాల్ పిల్లల కోసం విద్యుత్ భద్రతా హ్యాండ్‌బుక్ అయిన విద్యుత్ సురక్షా బోధ్, ఎలక్ట్రికల్ ఫైర్ సేఫ్టీ బుక్‌ను విడుదల చేశారు. ప్రజలలో అవగాహనను బలోపేతం చేయడానికి, భద్రతా స్పృహ కలిగిన భవిష్యత్ తరాలను పెంపొందించడానికి ఇవి ముఖ్యమైన కార్యక్రమాలని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టరేట్ జనరల్ సునీల్ కుమార్ ఝా, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ సభ్యులు (ప్లానింగ్) ఎ. బాలన్, (థర్మల్) ప్రవీణ్ గుప్తా, హేమంత్ జైన్, వి.కె. సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## అరుణాచల్‌లో చైనా ఆక్రమణ ఆరోపణలు

### దర్యాప్తునకు కమిటీ.. అంగుళం భూమి కూడా వదులుకోం: హోంమంత్రి



**ఇటానగర్,జూలై 1:** అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా ఆక్రమణ ఆరోపణలు రాజకీ యంగా, వ్యూహాత్మకంగా చర్చనీయాంశమయ్యాయి. ఎగువ సుబన్‌సిరి జిల్లాలోని నాహ్ తెగకు చెందిన పూర్వీకుల భూములను గత ఆరేళ్లుగా చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ ఆక్రమించిందంటూ నాహ్ వెల్ఫేర్ సొసైటీ చేసిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఈ వ్యవహారంపై విచారణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు అరుణాచల్ ప్రదేశ్ హోంమంత్రి మామా నటుంగ్ వెల్లడించారు. భారత్‌కు చెందిన ఒక్క అంగుళం భూమిని కూడా చైనాకు అప్పగించే ప్రసక్తే లేదని అరుణాచల్ ప్రదేశ్ హోంమంత్రి మామా నటుంగ్ స్పష్టం చేశారు. ఎవరైనా భారత భూభాగాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే అరుణాచల్ ప్రజలు, భారత ప్రజలు ఎన్నటికీ సహించరని ఆయన హెచ్చరించారు.నాహ్ వెల్ఫేర్ సొసైటీ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగానికి పూర్తి స్థాయిలో విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ అంశంపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ రాలేదని, మీడియాలో వచ్చిన కథనాలు, వైరల్ అవుతున్న ఫోటోలను కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సంబంధిత సంస్థల నుంచి అధికారిక నివేదిక వచ్చిన తర్వాతే వాస్తవాలు వెల్లడిస్తామని హోంమంత్రి పేర్కొన్నారు. ఈ అంశంపై నిజానిజాలు తేల్చేందుకు ప్రత్యేక బృందం ఇప్పటికే పని ప్రారంభించిందని వెల్లడించారు. ఇదిలా ఉండగా, అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా సైన్యం తాజాగా చొరబడి కొత్త శిబిరాలు ఏర్పాటు చేసిందంటూ వచ్చిన వార్తలను భారత సైన్యం పూర్తిగా ఖండించింది. అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా పీఎల్ఏ తాజాగాచొరబాటుకు పాల్పడిందని, కొత్త క్యాంపులు ఏర్పాటు చేసిందని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని భారత సైన్యం స్పష్టం చేసింది. ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని, వాస్తవాలకు విరుద్ధమని అధికారిక ప్రకటనలో పేర్కొంది.భారత్‌చైనా సరిహద్దు పరిస్థితిపై భారత సైన్యం ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతోందని, ప్రజలు నిర్ధారించని వార్తలను నమ్మవద్దని సూచించింది. ప్రస్తుతం ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర భద్రతా సంస్థలు సమన్వయంతో వాస్తవాలను నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోంది.

## జనాభా మార్పులపై క్షేత్రస్థాయి అధ్యయనానికి హైలెవల్ కమిటీ

### అమిత్‌షాను కలిసిన కమిటీ బృందం



**న్యూఢిల్లీ,జూలై 1:** దేశంలో అక్రమ వలసలు, అసాధారణ కారణాల వల్ల సంభవిస్తున్న జనాభా మార్పుల పై క్షేత్ర స్థాయి అధ్యయనం చేయడానికి ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ త్వరలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పర్యటించనుంది. ఈ మేరకు ఈ అత్యున్నత స్థాయి కమిటీ చైర్మన్ జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నవ్లేకర్ నేతృత్వంలోని బృందం కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి తమ వ్యూహాలు, భవిష్యత్ కార్యాచరణపై వివరాలను అమిత్ షా కు తెలియజేసింది. రాష్ట్ర ఈ కమిటి రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాం తాల పరిపాలనా యంత్రాంగాల నుంచి క్షేత్రస్థాయి వివరాలు, జనాభా మార్పు లకు సంబంధించి స్థానిక అభిప్రాయాలను నేరుగా సేకరించనుంది. ఈ పర్యటనలను మరింత సమర్థవంతంగా చేయడానికి సంబంధిత సమాచారాన్ని ముందుగానే స్వీకరించేందుకు వివరణాత్మక ప్రశ్నావళి సిద్ధం చేసినట్లు కమిటీ హోం మంత్రికి తెలియజేసింది.

## తెలంగాణకు రూ.3825 కోట్ల ఉపాధి నిధులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై1:** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విబీజీ రామ్‌జీ కింద రాష్ట్రానికి రూ.3,825.31 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ పథకం కింద కేంద్రం 60శాతం,రాష్ట్రం 40శాతం భరించాలి, కేంద్రం తన వాటా నిధులను ఉమ్మడి ఖాతాలో వేసింది. రాష్ట్రం తన వాటాగా రూ.2550.21 కోట్లు జమ చేయాలి. లేకుంటే కూలీలకు చెల్లింపులు నిలిచిపోతాయి. కాగా, స్కీమ్‌ను రాష్ట్రం వ్యతిరేకిస్తోంది. గురువారం జరిగే కేబినెట్ భేటీలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

## ప్రధాని, సిఎంల పదవులపై కీలక బిల్లులు

### వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు ఎన్డీయేయోచన

**న్యూఢిల్లీ,జూలై 1:** ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల పదవులకు సంబంధించి కీలక రాజ్యాంగ సవరణకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. 130వ రాజ్యాంగ సవరణ బిల్లును రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. అవినీతి వంటి తీవ్రమైన కేసుల్లో ప్రధాని లేదా సీఎం అరెస్టై 30 రోజులకు పైగా జైలులో ఉంటే వారి పదవిని రద్దు చేయాలన్నదే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం.

## ఉగ్రరూపం దాలుస్తున్న పీవోకే నిరసనలు

**ముజఫరాబాద్,జూలై 1:** పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లో రాజకీయ సంక్షోభం మరోసారి తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. నియంత్రణ రేఖకు సమీపంలో వేలాది మంది ప్రజలు భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టడం ఇస్లామాబాద్‌ను వణికిస్తోంది. పీఓకే అనేది పాకిస్థాన్‌లో భాగం కాదు మాకు పాకిస్థాన్ అవసరం లేదంటూ వేలాది మంది నిరసనకారులు గొంతుకలిపారు.

# కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం

**• శ్రీకాళహస్తి నియోజకవర్గస్థాయి టిడిపి కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేష్**



**రేణిగుంట, జులై 1 ప్రభాతవార్త:** కార్యకర్తలే పార్టీకి బలమని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం ఎల్లమండ్యం పంచాయితీ కొత్తపాలెం వద్ద జరిగిన శ్రీకాళహస్తి నియోజకవర్గ స్థాయి టిడిపి కార్యకర్తల సమావేశం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన బుధవారం వేడుకగా జరిగింది. సభా ప్రాంగణ పరిసరాలు పసుపు జెండాలతో పసుపు మయంగా మారిపోయాయి. పార్టీకి కష్టకాలంలో సేవలు చేసిన దాదాపు 200 మంది కార్యకర్తలకు ఉత్తమ కార్యకర్తలుగా నారా లోకేష్ చేతుల మీదగా మెమెంటోలు అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నారా లోకేష్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలే పార్టీకి బలమని అన్నారు. తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు అన్యాయం జరగదన్నారు. ప్రతి కార్యకర్తకు సొంతింటి కల సహకారం చేస్తామన్నారు. పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు పేద ప్రజలకు చేసిన సేవలు అన్నిర్వచనీయమన్నారు. చిత్తూరు జిల్లా మహిళలు చదువుకోవడానికి తిరుపతిలో మహిళా యూనివర్సిటీ స్థాపించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రతిరోజు వేలాదిమంది భక్తులు దర్శించుకునే శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధి తిరుమల నందు నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించారన్నారు. ఎన్టీఆర్ ఎలాగైతే ప్రజాసేవకు అంకితమయ్యారో అదేబాటలో ముఖ్యమంత్రి చంద్రబాబు పయనిస్తున్నారని, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న శ్రమజీవిగా అభివర్ణించారు. తెలుగుదేశం పార్టీ నియమ నిబద్ధత క్రమశిక్షణలకు నిజమైన చిరునామా అన్నారు. పార్టీ కార్యకర్తలంతా ఏకతాటిపై ఉండి ప్రతిపక్ష పార్టీలకు గుండెల్లో దడ పుట్టించాలన్నారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ కోఆర్డినేటర్ దామచర్ల సత్య, తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, ఉభయ చిత్తూరు జిల్లాల గ్రంధాలయ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి, మార్కెటింగ్ చైర్మన్ చెంచయ్య నాయుడు, శ్రీకాళహస్తి సీనియర్ టిడిపి నాయకులు మునిరాజా నాయుడు, కాసారం రమేష్, తిరుపతి పార్లమెంటరీ టిడిపి ఉపాధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్య రెడ్డి, రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, సింగిల్ విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రేణిగుంట మండల టిడిపి సీనియర్ నాయకులు దేవళ్ళ రమణ, కన్నన్ రెడ్డి, ముచ్చెలి భాస్కర్ రెడ్డి, మునిస్వామి నాయుడు, జి.పాళెం టిడిపి సీనియర్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, మహిళా నాయకురాలు లూవీనా మేరీ, ఏర్పేడు టిడిపి సీనియర్ నాయకులు ధనుంజయులు నాయుడు, అడిషనల్ ఎస్పీ శ్రీలత, రూరల్ సీఐ మంజునాథరెడ్డి, ఏర్పేడు సీఐ శ్రీకాంత్, గాజులమండ్యం ఎస్ఐ హరీష తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్తు

**• పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులతో విడియో కాన్ఫరెన్స్‌లో సిఎండి శివశంకర్ లోతేటి**



**తిరుపతి, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పి డిసిఎల్ పరిధిలో పరిశ్రమలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి సిఎండి శివశంకర్ బుధవారం వినియోగదారుల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా 5 మంది పారిశ్రామిక విని యోగదారులు తమ విద్యుత్ సమస్యలపై చర్చిస్తూ, పరిశ్రమలకు నాణ్యమైన, నిరంత రాయ విద్యుత్తును సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులకు మెరు గైన సేవలతో నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రాంతా ల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని వివరించారు. అదేవిధంగా పారిశ్రామిక విద్యుత్ సర్వీసులకు అంతరాయం లేని విద్యుత్తును సరఫరా చేసేందుకు వీలుగా ప్రత్యేక ఫీడర్లను ఏర్పాటు చేశామన్నారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అత్యంత ప్రాధా న్యతనివ్వాలని సంస్థ అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా నుంచి లార్విన్ గ్లాస్ ఇండస్ట్రీ ప్రతినిధి కె.హరిబాబు మాట్లాడుతూ తమకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోం దని తెలియజేశారు. ఈ అంశంపై అధికారులు స్పందిస్తూ సరఫరాలో అంతరాయాలను నిరోధిం చేందుకు వీలుగా లైన్ పెట్రోలింగ్ నిర్వహించి, లోటుపాట్లను సరిచేయిస్తామని తెలియజేశారు.

**స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వేగవంతం:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ఆ సంస్థ అధికారులతో బుధవారం సాయంత్రం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ సంస్థ పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రాధాన్యత నిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ విద్యుత్ సర్వీసులతోపాటు కొన్ని ఇతర కేటగిరీల సర్వీసులకు కూడా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశామని వివరిం చారు. స్మార్ట్ మీటర్ల పనులను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) విభాగం ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. విద్యుత్ బిల్లింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు ఆన్లైన్ చెల్లింపులను సరళతరం చేస్తున్నా మని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే సందర్భంలో సమాచారాన్ని వినియోగదారులకు ముందుగానే తెలియజేసేం దుకు వీలుగా విద్యుత్ మిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, కె.ఆదిశేషయ్య, ఎన్.శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్రరావు, కె.సంపత్ కుమార్, ఎస్.రమణ, పిఆర్ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తీశ్వరుని సేవలో లోకేష్



శ్రీకాళహస్తీశ్వరునికి దండం పెడుతున్న మంత్రి లోకేష్

**శ్రీకాళహస్తి, జులై 1 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం శ్రీకాళహస్తీశ్వరునికి భక్తి శ్రద్దలతో పూజలు జరుపుకున్నారు. ఆలయం వద్ద శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. నారా లోకేష్ రాగా దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఇఒ బికె వెంకటేశు పర్యవేక్షణలో వేదపండితులతో మేళతాళాలతో స్వాగతం పలికారు. నారా లోకేష్ ఎంతో సంతోషంగా భక్తితో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్నారు. ఆలయమర్యాదలతో దక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లును చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఇఒ వెంకటేశు, ఎఇఒలు లోకేష్‌బాబు, విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు హరియాదవ్, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు. మంత్రి లోకేష్‌కు స్వాగతం పలికిన వారిలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, పట్టణ టిడిపి అధ్యక్షుడు విజయకుమార్ తదితరులున్నారు.

# కైలాసగిరి ఎకో పార్కు ప్రారంభం



టూరిజం ఎకో పార్కును ప్రారంభించిన ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్

**తొట్టంబేడు, జులై 1 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని కైలాసగిరుల్లోని 50హెక్టార్లలో రూ.2 కోట్లతో రూపొందించిన 'ఎకో పార్కు'ను బుధవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ ఎకో పార్కులో ప్రకృతి సౌందర్య, అరుదైన సంపద, కుటుంబ వినోదంలతో మేళవించి రూపొందిం చారు. పిల్లలకు ఆటస్థలాలు, లోటస్ పాండ్, రైఫిల్ షూటింగ్, బోటింగ్ అర్చరి, వర్చువల్ రియాల్టి, కుటీర వనాలు, రాసి నక్షత్ర, నవగ్రహవనాలు, తులసి వనాలు, మీచ్ గార్డెన్ కెపిరియాలను ఏర్పాటు చేసారు.

ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టెసాయి ప్రసాద్, సత్యవేడు శాసనసభ్యుడు కోనేటి ఆదిమూలం అటవీశాఖ చీఫ్ కన్‌సర్వేటర్ వై.శ్రీనివాసులు రెడ్డి, తిరుపతి సర్కిల్ జిల్లా అటవీశాఖ అధికారి వి.సాయిబాబా, జిల్లా అధికారులు కుమారి బబిత, హారిక, కెవి.శ్రీకాంత్, రేంజ్ అధికారి, లోకేష్, బుజ్జిబాబు, సుబ్బరాయుడు, డెప్యూటీ రేంజ్ అధికారులు దేవరాజులు, ప్రవీణ్‌కుమార్, సుహాసిని, ఇతర అటవీ తదితరులు పాల్గొన్నారు.

## మావిగన్, అమరావతిల్లో ప్రజల మద్దతు ఎవరికి ఉందో

# ఎన్నికల్లో తేల్చుకుందాం

**• అమరావతి ప్రాంతానికి వ్యతిరేకం కాదు, అక్కడి రైతులపై పూర్తి సానుభూతి ఉంది**

**• రాష్ట్రమంతా అభివృద్ధి జరగాలంటే విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ రాజధానిగా రావాల్సిందే**


**• వైసిపి అధ్యక్షుడు, మాజీ సిఎం వైఎస్ జగన్**



**విజయవాడ, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో వచ్చే ఎన్నికలు మావిగన్ వర్సెస్ అమరావతి మధ్య జరుగు తాయని వైసిపి అధినేత మాజీ సిఎం వైఎస్ జగన్మోహన రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసారు. మావిగన్ ప్రతిపాదనకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. మావిగన్‌కు మద్దతు ఇచ్చేవారంతా వైసిపికి ఓటు వేస్తారని చెప్పారు. ఈ రెండు రాజధానుల్లో ప్రజల మద్దతు దేనికి ఎక్కువగా ఉందో వచ్చే ఎన్నికల్లో తేలిపోతుందని అన్నారు. తాడేపల్లిలో జగన్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తాను అమరావతి ప్రాంతానికి వ్యతిరేకం కాదని, అక్కడి రైతులపై తనకు పూర్తి సానుభూతి ఉందని జగన్ స్పష్టం చేశారు. అవినీతికి ఆస్కారం లేకుండా రాష్ట్రమంతా అభివృద్ధి జరగాలంటే విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ రాజధానిగా రావాల్సిందేనని పునరుద్ఘాటించారు. తాము ప్రతిపాదించిన రాజధాని అంశానికే కట్టుబడి ఉన్నామని చెప్పారు. రాబోయే ఎన్నికలు మావిగన్ వర్సెస్ అమరావతిల మధ్యే జరుగుతాయని, ప్రజల మద్దతు ఎవరికి ఉందో అప్పుడే తేలిపోతుందని సవాల్ విసిరారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమం గురించి చర్చ జరిగితే, నేడు చంద్రబాబు పాలనలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు, కస్టోడియల్ మరణాలపై చర్చ జరగడం బాధాకరమని అన్నారు. ఈ ఘటనలో రాష్ట్ర పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన అధికారులు ప్రమేయం ఉందన్న ఆరోపణలు ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయని జగన్ అన్నారు. ఇలాంటి ఘటనలపై ప్రశ్నిస్తే, క్రిమినల్స్‌కు మద్దతు ఇస్తున్నారని ఎదురుదాడి చేయడం సరికాదన్నారు. సాయికృష్ణను మొదట రౌడీషీటర్‌గా పేర్కొన్న ప్రభుత్వం, ప్రజల ఆగ్రహం వ్యక్తమవడంతో యూటర్న్ తీసుకుని కుటుంబ సభ్యులను సచివాలయానికి పిలిపించుకుందని జగన్ విమర్శించారు. కుటుంబాలు, చిన్నారులతో కలిసి ప్రశాంతంగా గడిపే బీచ్‌లను కూడా ప్రభుత్వం వదలడం లేదు. బీచ్ షాక్స్ పేరుతో కొత్త మద్యం సంస్కృతికి తెరలేపుతోంది అంటూ వైసిపి అధినేత జగన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాడేపల్లిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వ నిర్ణయాలు రాష్ట్ర సామాజిక వాతావరణాన్ని పూర్తిగా చెడగొట్టేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, విదేశీ పెట్టుబడులు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పెట్టుబడులను ఆకర్షించే చేతగాని ఈ ప్రభుత్వం, కేవలం అవినీతి, దోపిడీ రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని దుయ్యబట్టారు. 'రాష్ట్రానికి కొత్తగా విదేశీ పెట్టుబడులు రావడం లేదు కానీ, ఇక్కడ దోచుకున్న సొమ్ము మాత్రం విదేశాలకు వెళ్తోంది' అంటూ జగన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**సర్ పేరుతో పెద్ద కుట్ర:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరుతో రాష్ట్రంలో పెద్ద కుట్ర జరుగుతోంది. స్వార్థ రాజ కీయ ప్రయోజనాల కోసం పేదవాడి ఓటు హక్కునే కాల రాస్తున్నారు అంటూ వైసిపి అధినేత జగన్ కూటమి ప్రభు త్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. టిడిపి శ్రేణులు ఒక ప్రత్యేక యాప్‌ను ఉపయోగించి ఓటర్ల జాబితాలో అక్రమం గా జోక్యం చేసుకుంటున్నాయని జగన్ ధ్వజమెత్తారు. తమకు అనుకూలమైన వారి ఓట్లను చేర్చుతూ, వ్యతి రేకంగా ఉన్న పేదల ఓట్లను తొలగిస్తున్నారని విమర్శించా రు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను, ఎన్నికల విశ్వసనీయ తను పూర్తిగా దెబ్బతీసే చర్యని జగన్ మండిపడ్డారు.

# తిరుమల సమాచారం



## జూన్‌లో గణనీయంగా పెరిగిన భక్తులు

**• గత రెండేళ్ళకంటే ఈ ఏడాది అధికం • 24.40 లక్షల మంది భక్తులు దర్శనం, రూ.125 కోట్లు హుండీ ఆదాయం**

**తిరుమల, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని జూన్ నెలలో అత్యధికంగా 24.40లక్షల మందికి పైగా భక్తులు దర్శనం చేసుకున్నారు. భక్తుల సంఖ్యకు తగ్గట్లు తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకల రూపంలో హుండీకి రూ.125 కోట్లు ఆదాయం లభించింది. గత ఏడాది జూన్ నెల కంటే భక్తుల సంఖ్య 40వేల మంది అదనంగా దేవదేవుడిని దర్శనం చేసుకోవడం విశేషం. ముఖ్యంగా జూన్ నెలలో గురు, శుక్ర, శనివారాల్లో అదనంగా మరో పదివేల మందికి పైగా భక్తులకు ఆయా రోజుల్లో శ్రీవారి దర్శనం చేసుకునేలా చూడటం ఈ రికార్డుస్థాయి దర్శనాలకు కారణమైంది. 2025 జూన్ నెలలో ఇష్టదైవాన్ని దర్శించుకున్న భక్తుల సంఖ్య 24,08,781లక్షల మంది కాగా 2024 జూన్‌లో 22.18లక్షల మందిగా నమోదైంది. గత రెండేళ్ళతో పోల్చితే అదనంగా 2లక్షల మంది వరకు భక్తులు ఈ ఏడాది తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం విశేషం. 2025 జూన్ నెలలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీకి రూ.116.86 కోట్ల ఆదాయం మార్కును అధిగమించింది. 2024 జూన్‌లో రూ.113.65 కోట్ల వరకు భక్తులు కానుకల ద్వారా ఆదాయం నమోదైంది. 2026 జూన్‌లో రూ.125 కోట్లు రికార్డుస్థాయిలో ఆదాయం లభించింది.

# దర్శన టోకెన్లు రద్దు

**• టిటిడి ప్రకటించినా భారీగా వచ్చిన భక్తులు**

**తిరుమల, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి గురువారం ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం, దివ్యదర్శనం టోకెన్లు రద్దుచేయడంతో భక్తులు సమాచారం తెలియక భారీగా తరలివచ్చారు. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం భూదేవి కాంప్లెక్స్ ప్రాంతాల్లో ప్రతిరోజూ నిర్ణయించిన మేరకు ఆఫ్‌లైన్‌లో టైమ్‌స్లాట్ దర్శనం టోకెన్లు, కాలినడక భక్తులకు దివ్యదర్శనం టోకెన్లు జారీచేస్తారు. అయితే వేసవిసెలవులు ముగిసినా భక్తుల రద్దీ విపరీతంగా ఉండటంతో గురువారం స్వామివారికి నేత్ర దర్శనం, తిరుప్పావడ సేవ, సాయంత్రం పూలంగి సేవలతో సామాన్యభక్తులకు ఇబ్బందులు లేకుండా ముందుగానే గురువారం దర్శనాలకు బుధవారం టోకెన్లు ఇవ్వడం లేదని మంగళవారం టిటిడి ప్రకటించింది. దీంతో శుక్రవారం దర్శనానికి సంబంధించి గురువారం(నేటి) సాయంత్రం యధావిధిగా ఆఫ్లైన్‌లో తిరుపతిలో టైమ్ స్లాట్ టోకెన్లు, దివ్యదర్శనం టోకెన్లు జారీచేసేలా టిటిడి అధికారులు చర్యలు తీసుకున్నారు. భక్తులు నేరుగా తిరుమలకు చేరుకుంటే సాధారణ సర్వదర్శనమ్‌లో భక్తులను అనుమతిస్తామని టిటిడి తెలిపింది. ప్రతిరోజూ టైమ్‌స్లాట్ సర్వదర్శన టోకెన్లతో 12వేల మంది వరకు, దివ్యదర్శనం 2వేల వరకు భక్తులు తిరుమలకు వస్తున్న విషయం విదితమే.

# రేపటి అక్షర గోవిందానికి సర్వం సిద్ధం

**- టిటిడి జెఇఒ డాక్టర్ శరత్**



**తిరుమల, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ ధర్మపరిరక్షణలో భాగంగా టిటిడి ఆధ్వర్యంలో వకుళమాత సన్నిధిలో రేపు 'శుక్రవారం' నిర్వ హించనున్న 'అక్షర గోవిందం - అన్నప్రాశన్ల కార్య క్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నట్లు టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్ తెలిపారు. బుధవారం ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో, వకుళమాత కరుణా కటాక్షాల మధ్య వేదోక్తంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశన నిర్వహించనున్నట్లు తెలిపారు. వేద మంత్రోచ్చారణల నడుమ సంప్రదాయబద్ధంగా జరిగే ఈ పవిత్ర కార్యక్రమంలో తొలి రోజు నమోదు చేసుకున్న 25 మంది చిన్నారులు తమ తల్లిదండ్రులతో నిర్ణీత సమయానికి హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. అక్షర గోవిందంలో పాల్గొనే ప్రతి చిన్నారికి ఉచితంగా 'అక్షర గోవిందం' కిట్ అందజేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు వకుళామాత ఆలయ సమీపంలోని యాగశాలలో విశ్వక్సే నారాధన, పుణ్యాహవాచనం, అగ్ని ప్రతిష్ఠ, కుంభారాధన, శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, వకుళమాతకు చతుర్‌కలశ స్నపనం, పంచగవ్య, క్షీర, జలాభిషేకాలు, వివిధ హోమాలు వేదపండి తుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మప్రచార పరిషత్ ఇన్‌చార్జి కార్యదర్శి డాక్టర్ మేడసాని మోహన్, డిప్యూటీ ఇఒలు వరలక్ష్మి, శివప్రసాద్, ఎస్ఇ మనోహారం, విఎస్ఒలు గిరిధర్, వేంకటేశ్వర్లు, ఇఇ మల్లికార్జున ప్రసాద్, డిఇ సరస్వతి, అదనపు ఆరోగ్య అధికారి డాక్టర్ సునీల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

**9న మేల్‌చాట్ వస్త్రాల ఇ వేలం:** తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన మేల్‌చాట్ వస్త్రాలు జులై 9న ఆన్‌లైన్‌లో ఇ వేలం వేయనున్నారు. ఉపయోగించిన పాక్షికంగా దెబ్బతిన్న 47లాట్లు ఉన్నాయి. ఆసక్తిగల బిడ్డర్లు ఇతర వివరాలకు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో గానీ, టిటిడి వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. తిరుమల. ఒఆర్‌జి, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. కొనుగోలు. ఎపి.జివొవి. ఇన్ సంప్రదించగలరు.

# వెంకయ్యనాయుడుకు బర్త్‌డే విషెస్ చెప్పిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత మాజీ ఉపరాష్ట్రపతి, పద్మ విభూషణ్ ముప్పవరపు వెంకయ్య నాయుడుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వెంకయ్య నాయుడు పుట్టినరోజు సందర్భంగా చంద్రబాబు 'ఎక్స్' సామాజిక మాధ్యమం వేదికగా ఓ ప్రత్యేక సందేశాన్ని పోస్ట్ చేశారు. వెంకయ్య నాయుడు సంపూర్ణ ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని చంద్రబాబు ఆకాంక్షించారు. భారతీయ విలువలతో పాటు తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. "భారత మాజీ ఉపరాష్ట్రపతి, పద్మవిభూషణ్ వెంకయ్య నాయుడుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. భారతీయ విలువలను, తెలుగుదనాన్ని సమున్నతంగా చాటుతూ, తెలుగు భాషాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మీ సేవలు అందరికీ స్ఫూర్తిదాయకం. మీరు సంపూర్ణ ఆయురారోగ్యాలతో, ఆనందంగా, మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా" అని చంద్రబాబు తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# 16న ఆణివార ఆస్థానం

**• 14న కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం**

**• 13న విఐపి బ్రేక్ సిఫార్సు తీసుకోరు**



**తిరుమల, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** వడ్డీకాసులవాడికి ఈనెల 16వ తేదీ ఆణివార ఆస్థానం జరగనుండటంతో 14వ తేదీ మంగళవారం ఆలయ శుద్ధి నిర్వహించనున్నారు. ఆనందనిలయం నుంచి బంగారువాకిలి, వెండివాకిలి, మహద్వారం వరకు ఆలయంలోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం పూజాసామాగ్రి తదితర వస్తువులను సుగంధ ద్రవ్యాలు నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర వాటితో కలగలిపిన నీటితో శుద్ధిచేస్తారు. ఆ సమయంలో స్వామివారి మూలవిరాట్టును శ్వేత వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచుతారు. 16న ఆణివార ఆస్థానం వేడుకలు ఆలయంలో బంగారువాకిలిలో నిర్వహిస్తారు. 14వ తేదీ అష్టదళపాదపద్మారాధన సేవ రద్దుచేశారు. కాగా 14వ తేదీ విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేశారు. అలాగే 16వ తేదీ విఐపి బ్రేక్ రద్దుచేశారు. 15న ఎలాంటి సిఫార్సులు స్వీకరించరు. ఈ రెండు ప్రత్యేక రోజుల్లో ఆలయంలో విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేశారు. సోమవారం 13వ తేదీ విఐపి బ్రేక్ దర్శనాల సిఫార్సులేఖలు తీసుకు రావద్దని టిటిడి విజ్ఞప్తి చేసింది. అలాగే 15వ తేదీ బుధవారం కూడా 16వతేదీ విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి సిఫార్సులేఖలు స్వీకరించ బోమని టిటిడి వెల్లడించింది. భక్తులు ఈ విషయాలను గమనించి టిటిడికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

# విద్యుత్ పొదుపుపై టిటిడి ప్రత్యేక దృష్టి

**విద్యుత్ వినియోగ నియంత్రణకు ఇఒ ఆదేశాలు**



**తిరుమల, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ పరిరక్షణ, వనరుల సద్వినియోగం, స్వయం సమృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా టిటిడి పరిపాలనా భవనంతో పాటు అన్ని టిటిడి కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో విద్యుత్ వినియోగాన్ని సమర్థ వంతంగా నియంత్రించేందుకు టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర బుధవారం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వనరుల పరిరక్షణ మార్గదర్శకాలు, టిటిడి ముఖ్య ఇంజినీర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు అన్ని విభాగాధిపతులు, కార్యాలయాల అధిపతులు ఈ ఆదేశాలను తక్షణమే అమలుచేయాలని సూచించారు. అవసరం లేని సమ యంలో లైట్లు, ఫ్యాన్లు, ఎయిర్ కండిషనర్లు, కంప్యూ టర్లు, ప్రింటర్లు తదితర విద్యుత్ పరికరాలను తప్పని సరిగా నిలిపివేయాలని స్పష్టం చేశారు. 'విద్యుత్ పొదుపే వనరుల పరిరక్షణకు తొలి అడుగు' అనే లక్ష్యంతో విద్యుత్ వ్యయాన్ని గణనీయంగా ఆదా చేసేందుకు అధికా రులు, ఉద్యోగులందరూ పూర్తి సహకారం అందించాలని కోరారు. తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘన గుర్తిస్తే తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని ఇఒ హెచ్చరించారు.

## మండలి వెంకట కృష్ణారావు జయంతిని

# రాష్ట్ర పండుగగా ప్రకటించాలి

**• సిఎం చంద్రబాబుకు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు వినతి**

**విజయవాడ, జులై 1 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన మహానేత, దివిసీమ గాంధీ, గాంధేయవాది, మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే మండలి వెంకటకృష్ణారావు జయంతిని ప్రతి సంవత్సరం ఆగస్టు 4వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారిక పండుగ (స్టేట్ ఫెస్టివల్)గా ప్రకటించాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి కార్యా లయ అధికారులకు వినతిపత్రాన్ని సమర్పిం చినట్లు తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, విద్య, గ్రామీణాభివృద్ధి, సామా జిక సంక్షేమం, మానవతా సేవలకు జీవితాంతం అంకితమయ్యారని పేర్కొన్నా రు. 1975లో నిర్వహించిన తొలి ప్రపంచ తెలుగు మహాసభలకు ప్రధాన శిల్పిగా నిలిచి ప్రపంచవ్యాప్తంగా తెలుగు జాతిని ఒకే వేదికపైకి తీసుకువచ్చిన మహోన్నత దార్శనికుడని కొనియాడారు. 1977 దివిసీమ ఉప్పెన సమయంలో మంత్రి పదవికంటే ప్రజాసేవకే ప్రాధాన్యతనిస్తూ సహాయక చర్యల్లో ప్రత్యక్షంగా పాల్గొని వేలాది బాధితులకు అండగా నిలిచారని, అందుకే ప్రజలు ఆయనను ప్రేమతో 'దివి సీమ గాంధీ'గా అభివర్ణించారని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. మండలి వెంకటకృష్ణారావు నిజాయితీ, నిరా డంబరత, గాంధేయ విలువలు, ప్రజల పట్ల అంకితభావానికి ప్రతీకగా నిలిచారని, భావితరాలకు ఆయన జీవితం ఆదర్శప్రా యమని వీరాంజనేయులు పేర్కొన్నారు. తెలుగు భాష, సంస్కృతి, సేవా భావం, సామాజిక బాధ్యత వంటి విలువలను భావితరాలకు చేరవేయడానికి ఇది గొప్ప ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. కాబట్టి, 2026 ఆగస్టు 4 నుంచి ప్రతి సంవత్సరం మండలి వెంకటకృష్ణారావు జయంతిని రాష్ట్ర అధికారిక పండుగగా ప్రకటించి ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని జాస్తి వీరాంజ నేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# గిన్నిస్ బుక్‌లో 5 భారతీయ వంటలు!

భారతీయ వంటకాలు అంటే ప్రపంచ వ్యాప్తంగా గుర్తొచ్చేవి వాటి అద్భుతమైన రుచి, ఘుమఘుమలాడే సుగంధ ద్రవ్యాల మేళవింపు. అయితే, మన వంటకాలు కేవలం రుచిలోనే కాదు, వాటి భారీ పరిమాణంతోనూ చరిత్ర సృష్టించాయి. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో స్థానం సంపాదించి, భారతీయ పాకశాస్త్ర నైపుణ్యాన్ని, సామూహిక స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పాయి. అలా గిన్నిస్ బుక్కెక్కిన 5 భారతీయ వంటకాల ప్రత్యేకతలు ఏమిటో చూద్దాం. అలా గిన్నిస్ బుక్కెక్కిన 5 భారతీయ వంటకాలు:



**భారీ పరిమాణంలో బిర్యానీ తయారీతో రికార్డు:** బిర్యానీ ప్రియులకు ఇదొక పండగలాంటి వార్త. 2008లో న్యూఢిల్లీలో ఏకంగా 14.06 టన్నుల (14,060 కిలోలు) బిర్యానీని తయారు చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పారు. వేల కిలోల బియ్యం, మాంసం, నెయ్యి, సుగంధ ద్రవ్యాలను ఉపయోగించి, ఎందరో చెఫ్‌లు కలిసి ఈ బృహత్కార్యాన్ని పూర్తిచేశారు. బిర్యానీకి ప్రత్యేకత ను తెచ్చిపెట్టే పొరల విధానాన్ని, అసలైన రుచిని ఇంత భారీ పరిమాణం లోనూ చెక్కుచెదరకుండా నిలబెట్టడం వారి నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది.



**918 కిలోల కిచిడీ వడ్డన:** పౌష్టికాహారంగా, సులభంగా జీర్ణమయ్యే వంటకంగా కిచిడీకి మంచి పేరుంది. ఈ సాధారణ వంటకం కూడా గిన్నిస్ రికార్డుల్లో చోటు దక్కించుకుంది. 2017లో న్యూఢిల్లీలో జరిగిన 'వరల్డ్ ఫుడ్ ఇండియా' కార్యక్రమంలో ప్రముఖ చెఫ్ సంజీవ్ కపూర్ నేతృత్వంలో సుమారు 50 మంది చెఫ్‌ల బృందం 918 కిలోల కిచిడీని వండి వడ్డించారు. రికార్డు నెలకొల్పిన తర్వాత, ఈ కిచిడీని పలు స్వచ్ఛంద సంస్థలకు పంచిపెట్టడం విశేషం. ఇది ఆహారం యొక్క పోషక విలువలతో పాటు సామాజిక బాధ్యతను కూడా గుర్తుచేసింది.



**29 టన్నుల తాపేశ్వరం లడ్డూ:** తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచిన రికార్డు ఇది. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా, తాపేశ్వరం గ్రామానికి చెందిన మిఠాయి తయారీదారు పీవీవీఎస్ మల్లిఖార్జున రావు (మల్లిక్) ఈ అద్భుతాన్ని సృష్టించారు. 2016లో ఏకంగా 29,465 కిలోల బరువున్న భారీ బూందీ లడ్డూను తయారు చేసి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు. శనగపిండి, పంచదార, నెయ్యి, జీడిపప్పు, యాలకుల వంటి సంప్రదాయ దినుసులతో ఈ మహా లడ్డూను రూపొందించారు. పండుగలకు ప్రత్యేకంగా నిలిచే లడ్డూ, ఈ రికార్డుతో ప్రపంచవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది.

**54 అడుగుల పొడవైన దోశ:** హైదరాబాద్ నగరం కూడా ఈ జాబితాలో తనదైన ముద్ర వేసింది. 2014లో ఇక్కడి 29 మంది చెఫ్‌ల బృందం కలిసి 16.68 మీటర్ల (సుమారు 54 అడుగుల 8 అంగుళాలు) పొడవైన దోశను తయారు చేసి రికార్డు సృష్టించింది. ఇంత పొడవున్న దోశను తయారుచేయడంలో చెఫ్‌ల మధ్య సమన్వయం, కచ్చితమైన సమయపాలన కీలకంగా నిలిచాయి. ముఖ్యంగా, దోశకు ఉండాల్సిన కాగితంలాంటి పల్చదనం, కరకరలాడే స్వభావాన్ని చివరి వరకు కాపాడటం ఒక పెద్ద సవాలు. ఈ ఘనత సాధించి వారు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.




**145 కిలోల చపాతీ :** భారతీయుల దైనందిన ఆహారంలో భాగమైన చపాతీ కూడా గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించింది. 2012లో గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో దగడూ సేఠ్ గణపతి మహోత్సవం సందర్భంగా 145 కిలోల బరువున్న అతిపెద్ద చపాతీని తయారు చేశారు. దీనికోసం ప్రత్యేకంగా 33 మీటర్ల కొలతలతో ఒక లోహపు పెనాన్ని తయారుచేశారు. డజన్ల కొద్దీ వాలంటీర్లు కలిసి పిండిని రుద్దడం, చపాతీని తిప్పడం, కాల్చడం వంటి పనుల్లో పాలుపంచు కున్నారు. ఇది ఒక సాధారణ వంటకాన్ని సామూహిక ప్రయత్నంతో అద్భుతంగా ఎలా మార్చవచ్చో తెలియజేసింది.



**చెలి చిట్కా**

దుస్తులు ఖరీదుకన్నా వాటి వెరైటీ అవి సరిగా సరిపోయినట్లు వున్నాయో లేదో అనేదానిమీద మీ అందం ఆకర్షణ ఆధారపడు తుంది.

ప్రశ్న :నేను నెలకు ఒకటి రెండు సార్లు నిద్రలో కలవరించడం జరుగుతోంది. ఎవరో నా గొంతు నొక్కడానికి ప్రయత్నిస్తున్నట్టు అనిపించి గట్టిగా అరుస్తున్నాను. మా వారు లేచి నన్ను నిద్ర లేపి మంచినీరు ఇచ్చి పడుకో పెడుతున్నారు. నాది మెతక స్వభావం. చిన్నప్పటి నుంచి కొంత భయపడే తత్వం ఉంది. శుచి, శుభ్రత పాటిస్తాను. నా వయస్సు 60 సంవత్సరాలు. పదేళ్లుగా మోస్తరు రక్తపోటు ఉంది. అది కూడా నియంత్రణలో ఉంది. ఇతర ఆరోగ్య సమస్యలు లేవు. నాకు మొబైల్ అలవాటు లేదు. టీవీలో పాత సినిమాలు చూస్తాను. ప్రశాంతమైన పాటలు వింటాను. రోజూ అరగంట వాకింగ్ చేస్తాను. నా సమస్యకు కారణాలు, పరిష్కార మార్గాలు సూచించండి. - ఒక సోదరి, నెల్లూరు



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

## వ్యథ మీ స్వభావమే కలలకు కారణం !



జవాబు : అమ్మా, మీరు వివరించిన లక్షణాలను బట్టి చూస్తే మీ సమస్యకు ప్రధాన కారణం శారీరక అనారోగ్యం కంటే మీ వ్యక్తిత్వ స్వభావం, అంతర్గత భయ స్పందనలు ఎక్కువగా కారణమై ఉండవచ్చని అనిపిస్తోంది. మీరు చెప్పినట్లు నిద్రలో ఎవరో గొంతు నొక్కుతున్నట్టు అనిపించడం, ఒక్కసారిగా భయంతో అరవడం, కుటుంబ సభ్యులు లేపిన తర్వాత మళ్లీ సాధారణ స్థితికి రావడం వంటి లక్షణాలు కొందరిలో కనిపించే నిద్ర సంబంధిత భయ ప్రతిచర్యలకు సంకేతాలు కావచ్చు. చిన్నప్పటి నుంచి భయపడే తత్వం, మెతక స్వభావం, శుచి శుభ్రత, క్రమశిక్షణకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వంటి లక్షణాలు ఉన్న వ్యక్తుల్లో మనసు, మెదడు సాధారణంగా ఎక్కువ అప్రమత్తంగా పనిచేస్తుంటాయి. పగటిపూట బయటకు కనిపించని చిన్న ఆందోళనలు కూడా రాత్రి నిద్రలో భయకలల రూపంలో బయటపడవచ్చు. కొంతమంది ప్రతి విషయాన్ని చాలా బాధ్యతగా తీసుకుంటారు. బయటకు ప్రశాంతంగా కనిపించినా, లోపల చిన్న ఒత్తిడులను కూడా ఎక్కువగా మనసులో ఉంచుకుంటారు. అలాంటి ఒత్తిడులు నిద్ర సమయంలో కలల రూపంలో వ్యక్తమవుతుంటాయి. అలాగే 60 సంవత్సరాల తర్వాత సహజంగానే నిద్ర విధానంలో మార్పులు వస్తాయి. గాఢనిద్ర కొంత తగ్గుతుంది. చిన్న శబ్దం, చిన్న భావోద్వేగం కూడా మెదడును త్వరగా ఉత్తేజితం చేయవచ్చు. అందువల్ల భయంతో కూడిన కలలు మరింత స్పష్టంగా అనిపించే అవకాశం ఉంటుంది. మీరు చెప్పిన వివరాల ప్రకారం ఇది తీవ్రమైన మానసిక సమస్య లేదా పెద్ద న్యూరాలజికల్ సమస్యలా అనిపించడం లేదు. ముఖ్యంగా మీ రోజువారీ అలవాట్లు చాలా ఆరోగ్యకరంగా ఉన్నాయి. మీరు ప్రస్తుతం చేస్తున్న వాకింగ్ కొనసాగించండి. రాత్రి భోజనం తేలికగా తీసుకోండి. పడుకునే ముందు కనీసం అరగంట ముందే టీవీ చూడడం ఆపేయండి. గోరువెచ్చని నీటితో ముఖం, కాళ్ళు కడుక్కోవడం మంచిది. మనసును ప్రశాంతంగా ఉంచేందుకు ప్రతిరోజూ 10 నిమిషాలు ప్రాణాయామం లేదా ధ్యానం చేయండి. అవసరమైతే ఒకసారి సైకాలజిస్ట్‌ను కలిసి భయం, ఆందోళన, ఒత్తిడి నియంత్రణపై సలహాలు తీసుకోవచ్చు. ఆత్మ విశ్వాసం, సానుకూల దృక్పథం పెంచుకోవడం మంచిది.

## సత్యనారాయణ స్వామి

వర్దే అనే భక్తుడు సత్యనారాయణ పూజను చేసుకుంటాను అనుమతి ఇవ్వమన సాయిని అర్థించాడు. సాయి సరే అన్నాడు. వర్దే చాలా గడుసు పిండం. వర్దే నా దగ్గర డబ్బు లేదు ఇవ్వమని సాయినే అడిగాడు. సాయి బాబా వద్ద ఆ సమయంలో డబ్బు లేదు. సాయిబాబా అప్పుడు శ్యామరావ్ జయకర్ ను చూపారు. అతడు ద్వారకామాయి సభామండపంలో కూర్చుని ఉన్నాడు. జయకర్ అనేకసార్లు సాయి సన్నిధిలో చూచాడు వర్దేను. అంతే గాని ఎట్టి పరిచయం లేదు ఆయనకు. వర్దే సరాసరి జయకర్ వద్దకు వచ్చి తాను సత్యనారాయణ పూజ చేసుకోవటానికి డబ్బును జయకర్ వద్ద నుండి తీసుకోమన్నారు సాయి అన్నాడు. డబ్బు ఎంతకావాలని అడిగాడు జయకర్ రెండు రూపాయల అయిదు అణాలు అవుతుందని వర్దే చెప్పాడు. జయకర్ జేబుల్లో ఉన్న డబ్బంతా తీసి లెక్కించాడు. సరిగ్గా రెండు రూపాయల అయిదు అణాలు మాత్రమే ఉన్నాయి. ఇది సాయినాథుని చమత్కార మని భావించాడు జయకర్. ఆ డబ్బును వర్దేకు ఇచ్చాడు. పూజలకు కావలసిన సరంజామా తెచ్చాడు వర్దే. వర్దే గడుసరి భక్తుడు. సాయిబాబానే సత్యనారాయణునిగా భావించి పూజ చేసుకుంటానన్నాడు వర్దే.

## హెయిర్ స్పా ఇంట్లో సులువే !



కారణాలేవైనా కానీ... కొన్నిసార్లు జుట్టు నిర్జీవంగా కనిపిస్తుంటుంది. జిడ్డు కారడం, చిట్లడం, పొడారడం, చుండ్రు... ఇతరత్రా బోలెడు సమస్యలు కనిపిస్తున్నాయి. ఇలాంటప్పుడు హెయిర్ స్పా చక్కని పరిష్కారం. కానీ, అది ఖరీదైన వ్యవహారం కదా! ఏం పరవాలేదు ఇంట్లోనూ సులువుగా ఈ రొటీన్ పాటించొచ్చు. అదెలాగంటే... • ముందుగా జుట్టుని గాఢత తక్కువగా, సల్ఫేట్ లేని షాంపూతో శుభ్రం చేయండి. ఆపై ఆరనిచ్చి గోరువెచ్చని నువ్వుల నూనె పట్టించి బాగా మర్దన చేయండి. కనీసం 15 నిమిషాలైనా ఇలా చేయండి. • ఆ తర్వాత కనీసం అరగంటైనా అలానే వదిలేయాలి. తర్వాత ఇంట్లో హెయిర్ స్టీమర్ ఉంటే సరేసరి. లేదంటే వేడినీళ్లలో ముంచి తీసిన టవల్ చుట్టండి. ఆవిరి పడుతుంది. కుదుళ్లు శుభ్రపడ తాయి. • అవకాడో తీసుకుని మెత్తగా చేయండి. దీనికి కాస్త పెరుగు, కోడిగుడ్డులోని తెల్లసొన చేర్చి బాగా గిలకొట్టాలి. దాన్ని తలకు పూతలా వేయాలి. గంట తర్వాత మరోసారి తలస్నానం చేయండి చివరగా .•. కండిషనర్ రాసుకోవడం మర్చిపోవద్దు. ఈ క్రమం జుట్టుని రాలకుండా చేయడమే కాదు... బలంగానూ మారుస్తుంది. కాంతిమంతంగా మెరిసేలా చేస్తుంది.

## వీటితో అలర్జీనా?

ఆడవాళ్లకు, నగలకు అవినాభావ సంబంధం ఉంటుంది. అయితే వీటిని ఎంత ఇష్టంగా ధరించినా.. వీటి తయారీలో వాడే కొన్ని లోహాలు కొన్ని చర్మతత్వాలకు సరిపడవు.

**ముఖ్యంగా ఆర్టిఫిషి ఆడవాళ్లకు నగలకు అవినాభావ సంబంధం ఉంటుంది.** అయితే వీటిని ఎంత ఇష్టంగా ధరించినా వీటి తయారీలో వాడే కొన్ని లోహాలు కొంతమంది చర్మతత్వా లకు సరిపడవు ముఖ్యంగా ఆర్టిఫిషియల్ నగల విషయంలో ఈ సమస్య ఎక్కువగా తలెత్తుతుంటుంది. ఫలితంగా చర్మం పై ఎర్రటి దద్దుర్లు, దురద, మంట.. వంటి సమస్య లొస్తాయి. మరి, వీటి మంచి విముక్తి పొందడమెలాగో తెలుసుకుందాం ..

◆ ఆర్టిఫిషియల్ నగల తయారీలో నికెల్ లోహాన్ని వాడుతుంటారు. చాలామందిలో అలర్జీ రావడానికి ఇదే ముఖ్య కారణమంటున్నారు నిపుణులు. ముఖ్యంగా సున్నితమైన చర్మతత్వం ఉన్న వారిలో దీని కారణంగా దురద, దద్దుర్లు, ఎరుపెక్కడం.. వంటి సమస్యలొస్తాయంటున్నారు. అలాంటి వారికే ఈ విబలు మేలు వస్తుంది. ◆ నగల అలర్జీ ఉన్న వారు వాటిని ధరించే ముందు మాయిశ్చరైజర్, పౌడర్, క్యాలమైన్ లోషన్స్, వంటివి రాసుకోవాలి. ఇవి చర్మానికి కవచంలా పనిచేసి ఆయా లోహాల ప్రభావం చర్మంపై పడకుండా చేస్తుంది.



◆ అవుటిఫిట్ ఏదైనా.. కొంతమంది మెడ దగ్గరగా ఉండే చోకర్.. వంటి బిగుతుగా ఉంటే జ్యుయలరీని ఎంచుకుంటారు. దీనివల్ల గాలి ఆడక కూడా అలర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే చాలా వరకు వదులుగా ఉండే నెక్‌పీస్‌లు, లాంగ్ చెయిన్స్,. ఎంపిక ఎంచుకోవాలి. ◆ ధరించే ముందు ట్రాన్స్‌పరెంట్ నెయిల్ పాలిష్‌ను నగలపై ఓ కోటింగ్ వేసి.. ఆపై వేసుకోవడం మంచిది. ఇది నగల్లోని లోహాల ప్రభావం చర్మంపై పడకుండా కాపాడుతుంది. ◆ ఆర్టిఫిషియల్ నగలే కదా అని వీటి విష యంలో చాలామంది శ్రద్ధ తీసుకోరు. తడిసినా, చెమట పట్టినా.. అలాగే వాటిని బాక్సుల్లో భద్రపరు స్తుంటారు. ఆ తడిదనం వల్ల నగల నాణ్యత, దెబ్బతింటుంది.

## 'హ్యాంగ్‌మెన్' .. ట్రైలర్ లాంచ్



అజయ్ మైసూర్ ప్రొడక్షన్స్, క్లోరో ఫిల్మ్ బ్యానర్ల మీద బ్రహ్మాజీ ప్రధాన పాత్రలో విహాన్ తెరకెక్కించిన చిత్రం 'హ్యాంగ్‌మెన్స్. వి. శ్రీకాంత్, అజయ్ మైసూర్, వి. హెచ్. రావు నిర్మించిన ఈ మూవీకి కమ్రాన్ సంగీతాన్ని అందించారు. ఈ సినిమాకి ఉదయ్ గుర్రాల కెమెరామెన్‌గా, ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేశారు. ఈ మూవీ జూలై 3 నుంచి సన్ నెక్స్ట్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది. బ్రహ్మానందం మాట్లాడుతూ .హ్యాంగ్‌మెన్ అనే టైటిల్ చూసి ఈ ఈవెంట్‌కు రావాలని నిర్ణయించుకున్నాను. దీన్ని ఎలాంటి ఉద్యోగం అనాలో కూడా నాకు తెలీడం లేదు. ఉరి తీసే వ్యక్తి జీవన విధానం ఎలా ఉంటుంది? అని అనుకుంటూ ఉంటాను. అతని మానసిక వ్యథ ఎలా ఉంటుంది? అనే దాన్ని విహాన్ చక్కగా పట్టుకున్నాడు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ .. హ్యాంగ్‌మెన్ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను. నేను తీసిన ఇండియా ఫైల్స్ ఐదు భాషల్లో రాబోతోంది. నందినీ రెడ్డి మాట్లాడుతూ .. 'హ్యాంగ్‌మెన్'హ్యాంగ్‌మెన్' ట్రైలర్ నాకు చాలా నచ్చింది. అందుకే ఈ రోజు ఇక్కడకు ఇలా వచ్చాను. ఇలాంటి సబ్జెక్ట్‌ని ఒప్పుకున్న నిర్మాత అజయ్‌కి హ్యాట్సాఫ్. విహాన్ గొప్ప దర్శకుడిగా పేరు తెచ్చుకోబోతోన్నారు. బ్రహ్మాజీ మాట్లాడుతూ .. 'హ్యాంగ్‌మెన్' మా కోసం వచ్చిన బ్రహ్మానందం గారికి, నందినీ రెడ్డి గారికి థాంక్స్. ఇలాంటి కథకు నన్ను అనుకున్న విహాన్‌కి ఎప్పుడూ రుణ పడి ఉంటాను. మేం కష్టాలు పడుతున్న టైంలో అజయ్ మాకోసం వచ్చారు. సినిమా పట్ల ఆయనకున్న అభిరుచికి హ్యాట్సాఫ్. అజయ్ మైసూర్ మాట్లాడుతూ ..'హ్యాంగ్‌మెన్' కథ నాకు చాలా నచ్చింది. గంటగంటకి మన దేశంలో క్రైమ్ పెరుగుతూనే ఉంటోంది. విహాన్ మేకింగ్ చూసి అందరూ ఆశ్చర్యపోతారు. విహాన్ మాట్లాడుతూ .'హ్యాంగ్‌మెన్'లోని ఎలిమెంట్స్ చాలా హార్డ్ హిట్టింగ్‌గా ఉంటాయి. మనం చేసే ఉద్యోగాల్లా హ్యాంగ్‌మెన్ జాబ్ ఉండదు


## ప్రారంభమైన 'నిమ్మకాయ.. నీకెందుకు భయం' చిత్రం



ఘనంగా ప్రారంభమైన 'నిమ్మకాయ.. నీకెందుకు భయం' చిత్రం ఆధునిక కాలంలోనూ మూఢనమ్మకాలను ఎండగట్టే ఉత్కంఠ రేపుతూ ఆసక్తికరంగా సాగే కథనంతో తెలుగు తెరపైకి ఓ సినిమా రాబోతుంది. రాజేష్ భూపతి, స్వప్నరాజ్, అబిత హీరో హీరోయిన్లుగా, ప్రముఖ నటుడు సుమన్, ఆమని ప్రధాన పాత్రల్లో, బి.వి.సి ఫిల్మ్స్ బ్యానర్‌పై, 'నిట్లు' సినిమాతో మంచి పేరు తెచ్చుకున్న రోశిరెడ్డి పందిళ్లపల్లి దర్శకుడిగా . విభిన్న కథా చిత్రం 'నిమ్మకాయ.. నీకెందుకు భయం' ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి పీసీసీ జనరల్ సెక్రటరీ ఉప్పల శ్రీనివాస్ గుప్తా క్లాప్ కొట్టారు. లయన్ వెంకట్ కెమెరా స్విచ్ ఆన్ చేయాగా, తొలి షాట్ కు టీఎఫ్‌సీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ దర్శకత్వం వహించారు. పలువురు అతిథులు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నటుడు సుమన్ మాట్లాడుతూ, "ఈ సినిమా కథలో హారర్, థ్రిల్లర్ అంశాలు ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయి. కథ నాకు బాగా నచ్చింది. ఇందులో నటి ఆమనితో కలిసి నటించడం ఆనందంగా ఉంది. దర్శకుడు రోశిరెడ్డి పందిళ్లపల్లి మాట్లాడుతూ, "ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. 'నిమ్మకాయ' చుట్టూ ఉన్న అపోహలను కథాంశంగా తీసుకుని వినోదాత్మకంగా, ఆలోచింపజేసేలా సినిమాను తెరకెక్కిస్తున్నాం. హీరో రాజేష్ భూపతి మాట్లాడుతూ, "ఇది నాకు తొలి చిత్రం. నిమ్మకాయను ఇప్పటికీ చాలామంది మూఢనమ్మకాలతో అనుసంధానించి చూస్తుంటారు. అలాంటి అంశాలను కొత్త కోణంలో నిజాలను చూపించే ప్రయత్నం ఈ సినిమా. ప్రతి ఒక్కరికి నచ్చుతుంది. పీసీసీ జనరల్ సెక్రటరీ ఉప్పల శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ, "కలియుగ వెంకటేశ్వర స్వామి పాత్రతో ప్రేక్షకుల మన్ననలు పొందిన సుమన్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించడం విశేషం ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులతో పాటు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని చిత్ర బృందాన్ని అభినందించారు.

# తెర

## 'రావు బహదూర్' తో నా కల నెరవేరింది : సత్యదేవ్



**'రావు బహదూర్'పై మీ టీమ్ అందరూ చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నారు... కారణం?**

సినిమా చూసిన తర్వాత వచ్చిన నమ్మకం ఇది. మేము సినిమా మొదలుపెట్టినప్పుడు "మునుపెన్నడూ చూడని విధంగా తెలుగు సినిమా" అనే ట్యాగ్‌లైన్‌ను అనుకున్నాము. మహేష్ బాబు గారు ఈ సినిమా చూసిన తర్వాత కూడా అదే ట్యాగ్‌లైన్ చెప్పారు.

**రావు బహదూర్ జానర్ ఏమిటి?**

ఇది కంప్లీట్ సైకాలజికల్ డ్రామా. మ్యాజికల్ రియలిజం, డార్క్ కామెడీ సబ్‌జానర్స్‌గా ఉంటాయి. ఏదైనా మెటాఫర్‌ను విజువల్‌గా చేసి చూపించడం మ్యాజికల్ రియలిజం. కాకపోతే, కొన్నిసార్లు ఇది హారర్‌లా అనిపించవచ్చు.

**ఇది మీ కెరీర్‌లో మోస్ట్ ఛాలెంజింగ్ క్యారెక్టర్ కదా?**

అవును. మొన్నటి వరకు నా కెరీర్‌లో 'జ్యోతిలక్ష్మి ' కి ముందు, తర్వాత అని చూసుకునేవాడిని. ఇప్పుడు 'రావు బహదూర్'కి ముందు, రావు బహదూర్‌కి తర్వాత అన్నట్టుగా చూస్తారని నమ్ముతున్నాను.

**రావు బహదూర్‌లో రామప్ప క్యారెక్టర్‌కు ఉన్న రిఫరెన్స్ ఏంటి?**

నిజానికి రావు బహదూర్‌లో రామప్ప క్యారెక్టర్‌కు ఎలాంటి రిఫరెన్స్ లేదు. రామప్ప వెరీ మ్యాడ్ క్యారెక్టర్. ఈ సినిమా చూసిన తర్వాత రామప్పలా చేయాలి అని ఒక రిఫరెన్స్ పాయింట్ ఏర్పడుతుంది.

**ఇది ఏ టైం పీరియడ్ సినిమా?**

1960–99 మధ్య జరిగే కథ. ఇందులో కథానాయకుడు దేశసంచారి. తను అలా సంచారం చేస్తూ మళ్లీ తన ప్యాలెస్ భువనాలయంకి వచ్చినప్పుడు ఎలాంటి సంఘటనలు చోటుచేసుకుంటాయనేది ఆసక్తికరం.

**ఇందులో యాక్షన్ సీక్వెన్స్ ఉన్నాయా?**

యాక్షన్ సీక్వెన్స్‌లు లేవు గానీ, యాక్టింగ్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. ఒక పాట కంప్లీట్‌గా రోప్‌పై ఉంటుంది. ఇందులో రిలీజ్ అయిన వాటితో పాటు ఇంకా మూడు పాటలు ఉన్నాయి. అందులో రెండు డాన్స్ నంబర్స్. నా కెరీర్ లో ఫస్ట్ టైం ఇంతాలా డ్యాన్స్ చేసిన సినిమా ఇదే. ఈ సినిమా కోసం సాల్సా కూడా నేర్చుకున్నాను.

**మహేష్ బాబు సినిమా చూసి ఎలాంటి ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు?**

మహేష్ బాబు , నమ్రత గారు కలిసి ఈ సినిమా చూశారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సినిమా గురించి మాట్లాడారు.

**రావు బహదూర్ ప్రేక్షకులకు ఎలాంటి ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది?**

ఇది ఒక డిఫరెంట్ విజువల్ స్పెక్టాకిల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా. ప్రేక్షకుడు పెట్టే టికెట్‌కు పూర్తి విలువ ఇచ్చే సినిమా.

## 'హైలెస్సో' శివాజీ పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్ రిలీజ్



సుడిగాలి సుధీర్‌గా అందరికీ సుపరిచితుడైన సుధీర్ ఆనంద్ హీరోగా ప్రసన్న కుమార్ కోట దర్శకత్వం వహిస్తున్న చిత్రం హైలెస్సో. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివ చెర్రీ, రవికిరణ్ నిర్మిస్తున్నారు. ఇది వారి బ్యానర్‌కు ప్రొడక్షన్ నంబర్ 1, సుధీర్ ఆనంద్‌కు హీరో గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో కోర్ట్ సినిమాలో తన ఇంటెన్స్ నటనతో ఆకట్టుకున్న శివాజీ లైలం బాబు అనే పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. పోస్టర్‌లో నల్లటి దుస్తులు, పంచెకట్టుతో రాతి సింహాసనంపై కూర్చొని, చేతిలో సీసా పట్టుకుని శివాజీ కనిపించిన తీరు ఆయన పాత్రలోని పవర్ ని చూపిస్తోంది. ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రముఖ కన్నడ నటి అక్షరగౌడ ఈ కీలక పాత్రలో కనిపించ నున్నారు. యంగ్ అండ్ టాలెంటెడ్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. అనుదీప్ దేవ్ సంగీతం అందించగా, సుజాత సిద్ధార్థ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. హై లెస్సో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది.

## 'సమ్మర్ హాలిడేస్' 'క్రష్..' సాంగ్ లాంచ్



కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా, డిస్ట్రిబ్యూటర్‌గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలి నేని. ఆయన తన ధీరజ్ మొగిలి నేని ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్ పై 'సమ్మర్ హాలిడేస్' అనే చిల్డ్రన్ మూవీని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. 'సమ్మర్ హాలిడేస్'. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తు న్నారు. త్వరలోనే 'సమ్మర్ హాలిడేస్' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ చిత్రం నుంచి క్రష్ సాంగ్‌ను హీరో ఆనంద్ దేవరకొండ, డైరెక్టర్ ఆదిత్య హాసన్, ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ చేతుల మీదుగా హైదరాబాద్ లో లాంఛ్ చేశారు. రైటర్ కొండల్ రావు మాట్లాడుతూ 'సమ్మర్ హాలిడేస్' సినిమాకు ఆర్నెళ్లు వర్క్ చేశాం. ఆ ఆరు నెలలు ఎలా గడిచిపోయాయో తెలియదు. అంత హ్యాపీగా టీమ్ అంతా ఈ మూవీకి పనిచేశాం. రీసెంట్‌గా టీజర్ రిలీజై హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చు కుంది. లిరిసిస్ట్ కిట్టూ విస్సాప్రగడ మాట్లాడుతూ ఈ సినిమాకు మేమంతా ఎంజాయ్ చేస్తూ వర్క్ చేశాం. కొరియోగ్రాఫర్ లక్ష్మణ్ మాట్లాడుతూ 'సమ్మర్ హాలిడేస్' కథను డైరెక్టర్ శ్రీకర్ చెప్పినప్పుడు నాకు నా కథ గుర్తొచ్చింది. ప్రొడ్యూసర్ గిరిబాబు వల్లభనేని మాట్లాడుతూ మా మూవీలో క్రష్ పాట చాలా బాగా వచ్చింది. సింగర్ అనురాగ్ కులకర్ణి మాట్లాడుతూ క్రష్ పాట పాడేప్పుడు పీచు మిఠాయి దగ్గర నుంచి నా బాల్యంలోని అనుభవాలు గుర్తొచ్చాయి. ఈ పాటలో దేవుడు కూడా కోరే వరం బాల్యం అనే లైన్ అద్భుతంగా రాశారు కిట్టు. మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి మాట్లా డుతూ మా మూవీ సాంగ్ లాంఛ్ చేసేందుకు వచ్చిన ఆనంద్, ఎస్ కేఎన్, ఆదిత్య హాసన్ కు థ్యాంక్స్. డైరెక్టర్ శ్రీకర్ మాట్లాడుతూ మా టీమ్ అంతా కలిసి ఈ పాటను అందంగా డిజైన్ చేశాం. ఒకప్పుడు ఇళయరాజా, మణిశర్మ లా ఇప్పుడు సింజిత్ ఎరా సాగుతోంది. లిటిల్ హార్ట్స్ మూవీతో బ్యూటిఫుల్ మెమొరీస్ ఇచ్చాడు. ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ శ్రీకర్ ఈ కథ చెప్పినప్పుడు చాలా హ్యాపీగా ఫీలయ్యా. ఒక మంచి మూవీ చేశామని మీ అందరితో అనిపించుకుం టాం. సింజిత్ మ్యూజిక్ చేయకుంటే ఈ పాటలు ఇంత బాగా వచ్చేవి కావేమో. మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి మాట్లాడుతూ మా మూవీ సాంగ్ లాంఛ్ చేసేందుకు వచ్చిన ఆనంద్, ఎస్ కేఎన్, ఆదిత్య హాసన్ కు థ్యాంక్స్. డైరెక్టర్ శ్రీకర్ మాట్లాడుతూ మా టీమ్ అంతా కలిసి ఈ పాటను అందంగా డిజైన్ చేశాం.

## ఏఐ ఫీచర్ ఫిల్మ్‌గా 'అంబ' S రివెంజ్



తెలుగు సినీ పరిశ్రమలో తొలి పూర్తి స్థాయి AI మూవీ విడుదలకు సిద్ధమవుతూ ప్రచార పర్వం ప్రారంభం తెలుగు సినీ పరిశ్రమలో సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ 'అంబ' S రివెంజ్ చిత్రం ముస్తాబవుతోంది. నక్క తోక ఫిలిమ్స్ బ్యానర్‌పై యోగేంద్ర పొట్లూరి, రాణి మాడిసన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, జయవర్ధన్ మడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి ఏఐ విజువల్ డిజైన్ డెవలప్‌మెంట్‌ను 'కాలై విజువల్ స్టూడియోస్' అందిస్తోంది. భారత ఇతిహాసమైన మహాభారతంలోని శక్తివంతమైన పాత్ర అంబ స్ఫూర్తితో ఈ చిత్రాన్ని రూపొంది స్తున్నారు. పురాణ గాథను ఆధునిక దృక్పథంతో, అత్యాధునిక ఏఐ సాంకేతికతను మేళవించి వినూత్నంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా నిర్మాత యోగేంద్ర పొట్లూరి, దర్శకుడు జయవర్ధన్ మడి మాట్లాడుతూ, తెలుగు సినిమాకు ఇది ఒక కొత్త ప్రయోగాత్మక అధ్యాయానికి నాంది అని తెలిపారు. టైటిల్ పోస్టర్ విడుదలతో చిత్రాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసే తొలి అడుగు పడిందని, సినిమా విడుదలకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. పురాణ ఇతివృత్తాన్ని అత్యాధునిక కృత్రిమ మేధ సాంకేతికతతో మేళవిస్తూ రూపొందుతున్న 'అంబ'S రివెంజ్' ఇప్పటికే సినీ అభిమానులు, పరిశ్రమ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# స్వీడన్‌ను చిత్తుచేసిన ఫ్రాన్స్, ప్రిక్వార్టర్స్‌కు మెక్సికో




కలిసికట్టుగా ఫ్రాన్స్ అటాక్

**న్యూజెర్సీ, జూన్ 1 :** హాట్ ఫేవరెట్, రెండు సార్లు ఛాంపియన్ ఫ్రాన్స్... ముచ్చటగా మూడోసారి కప్ అందుకునే దిశగా సాకర్ ప్రపంచకప్‌లో దూసుకుపోతోంది. ఎంబాపె మ్యాజిక్ గోల్స్‌తో ఫ్రాన్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. నాకౌట్‌లో స్వీడన్‌ను 3-0 గోల్స్ తో చిత్తు చేసింది. కైలియన్ ఎంబాపె మరోసారి డబుల్ గోల్స్ (45, 74వ నిమిషం)తో మెరవగా, బ్రాడ్లీ బార్కోలా (53వ నిమిషం) మరో గోల్ సాధించాడు. ప్రి క్వార్టర్ ఫైనల్లో పరాగ్వేతో ఫ్రాన్స్ తలపడనుంది.

మ్యాచ్ ప్రారంభం నుంచి ఫ్రాన్స్ అటాకింగ్ గేమ్ మొదలు పెట్టింది. పలుసార్లు స్వీడన్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసింది. ఫ్రాన్స్ ఫార్వర్డ్‌ల స్పీడ్‌కు స్వీడన్ వద్ద సమాధానం లేకపోయింది. మ్యాచ్‌లో ఎక్కువసేపు బంతిని ఫ్రాన్స్ తమ ఆధీనంలోనే ఉంచుకుంది. తొలి అర్ధభాగం గోల్ లెస్‌గా ముగుస్తుందనుకుంటున్నదశలో ఎంబాపె అద్భుత గోల్‌తో ఫ్రాన్స్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. ఉస్మానే డెంబెలే, మైఖేల్ ఒలిసేలు చాకచక్యంగా ఆడిన షార్ట్ కార్నర్ వ్యూహం స్వీడన్‌ను దెబ్బతీసింది. ఎడమ వైపు నుంచి బంతిని అందుకున్న ఎంబాపె.. మెరుపు వేగం తో స్వీడన్ స్ట్రైకర్ విక్టర్ గ్యోకెరెస్‌ను కింద పడేశాడు. ఆ వెంటనే కుడికాలి క్లినికల్ షాట్‌తో బంతిని గోల్ కీపర్ జాకబ్ విడెల్ జెటర్‌స్ట్రోమ్‌కు అందకుండా నెట్‌లోకి పంపాడు దీంతో ఫ్రాన్స్ మొదటి గోల్ సాధించింది.

రెండో అర్ధభాగంలో ఫ్రాన్స్ మరింత దూకుడుగా ఆడింది. 53వ నిమిషంలో మైఖేల్ ఒలిసే స్వీడన్ డిఫెన్స్‌ను దాటుకొని అందించిన బంతిని బ్రాడ్లీ బార్కోలా గోల్‌గా మలిచాడు. దీంతో ఫ్రాన్స్ రెండో గోల్ సాధించింది. ఇక 74వ నిమిషంలో ఫ్రాన్స్ విజయం అధికారికం గా ఖరారైంది. ఒలిసే మరోసారి స్వీడన్ డిఫెన్స్ ను చేధిస్తూ ఎంబాపెకు అద్భుతమైన పాస్ ఇచ్చాడు. బంతితో దూసుకెళ్లిన ఫ్రెంచ్ కెప్టెన్ బంతిని కర్ల్ చేస్తూ ఫార్ కార్నర్‌లోకి పంపాడు. స్కోరు 3-0గా మార్చాడు.



ఈక్వెడార్‌పై మెక్సికో ఆటగాళ్ల గెలుపు సంబరాలు

**40యేళ్ల తర్వాత మెక్సికో**

అమెరికా, కెనడాతో కలిసి ఆతిథ్యమిస్తున్న మెక్సికో అద్భుత ప్రదర్శనతో 40 ఏళ్ల తర్వాత నాకౌట్ మ్యాచ్‌లో విజయం సాధించింది. ఈక్వెడార్‌పై 2-0 గోల్స్ తేడాతో నెగ్గి ప్రి క్వార్టర్ ఫైనల్ చేరింది. వర్షం వల్ల గంట ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో హోమ్ క్రౌడ్ మద్దతు తో మొదటి నుంచే ఆధిపత్యం చూపించింది. మ్యాచ్ తొలి అర్ధభాగంలో కేవలం 9 నిమిషాల వ్యవధిలోనే రెండు గోల్స్ చేసింది. జూలియన్ క్వినోనెస్ అద్భుత గోల్‌తో ఖాతా తెరవగా.. వెంటనే రౌల్ జిమెనెజ్ రెండో గోల్‌తో ఆధిక్యం పెంచాడు. గ్రూప్ దశలో జర్మనీపై సంచలన విజయం సాధించి అనూహ్యంగా అంచనాలు పెంచుకున్న ఈక్వెడార్... ఈ మ్యాచ్‌లో మాత్రం తేలిపోయింది. రెండో అర్ధభాగంలో పీరో హింకాపీ రెడ్ కార్డ్‌తో వైదొలగడంతో జట్టు 10 మందికే పరిమితమైంది.

మెక్సికో చివరిసారిగా 1986 ఎడిషన్‌లో బల్గేరియాపై నాకౌట్ విజయం సాధించింది. ఇప్పుడు అదే అజ్‌టెకా స్టేడియంలో, అదే స్కోర్ లైన్‌తో మరోసారి నాకౌట్ గెలుపొందింది. వరుసగా 7 నాకౌట్ పరాజయాల తర్వాత వచ్చి న ఈవిజయం మెక్సికోకు భారీ ఊరట ఇచ్చింది.



## కైలియన్ ఎంబాపె సరికొత్త రికార్డు

మెస్సీకి కూడా సాధ్యం కాని రికార్డును ఎంబాపె తన పేరిట లిఖించాడు. ఫిఫా ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాడిగా ఎంబాపె (10 గోల్స్) నిలిచాడు. అర్జెంటీనా స్టార్ లియోనల్ మెస్సీ 5 గోల్స్‌తో ఎంబాపెకు ఆమడ దూరంలో ఉన్నాడు. జస్ట్ ఫాంటైన్, వావా, ఒల్డ్‌రిచ్, పీలే చెరో ఏడు గోల్స్ సాధించారు. ఎంబాపె ఆడిన మూడు వరల్డ్‌కప్స్ 2018, 2022, 2026 నాకౌట్ స్టేజ్‌లో మొత్తం 10 గోల్స్ కొట్టాడు. 2018ఫిఫా నాకౌట్ దశలో మూడు గోల్స్, 2022 ఫిఫా నాకౌట్ దశల్లో ఐదు గోల్స్, తాజాగా 2026 ఫిఫాలో నాకౌట్ దశలో ఇప్పటికే రెండు గోల్స్ సాధించాడు.

**మెస్సీ రికార్డుకు అడుగు దూరంలో..**

ఫ్రాన్స్ సంచలనం ఎంబాపె రికార్డుల మీద రికార్డులు సాధిస్తున్నాడు. స్వీడన్‌పై రెండు గోల్స్ చేయడం ద్వారా ఎంబాపె (18 గోల్స్) ఫిఫాలో అత్యధిక గోల్స్ చేసిన ఆల్ టైమ్ ఆటగాళ్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకున్నాడు. ఈ క్రమంలో జర్మనీ దిగ్గజం మిరాస్లావ్ క్లోజ్ (16 గోల్స్) రికార్డును బద్దలుకొట్టాడు. ఇక అర్జెంటీనా స్టార్ మెస్సీ 19 గోల్స్‌తో తొలి స్థానంలో ఉన్నాడు. మెస్సీ రికార్డును సమం చేయడానికి ఒక్క అడుగు దూరంలో ఉన్నాడు.



## ఓటమితో రీఎంట్రీ

**లండన్, జూలై 1:** నాలుగేళ్ల తర్వాత 44 ఏళ్ల వయస్సులో గ్రాండ్‌స్లామ్ బరిలోకి దిగిన టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ రీఎంట్రీ ఓటమితో ప్రారంభమైంది. వైల్డ్ కార్డ్ ఎంట్రీతో వింబుల్డన్‌లో పునరాగమనం చేసిన ఈఅమెరికా స్టార్‌కు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. 23గ్రాండ్‌స్లామ్స్ విజేత సెరెనాపై 20ఏళ్ల ఆస్ట్రేలియా ప్లేయర్ మాయా జాయింట్ 6-3, 6-7, 6-3తో గెలుపొందింది. 44 ఏళ్ల వయస్సులోనూ తన ఆటలో పదును తగ్గలేదని సెరెనా ఈ మ్యాచ్‌లో రుజువుచేసుకుంది. తొలి సెట్‌ను 3-6తో కోల్పోయినా... రెండో సెట్‌లో సెరెనా అద్భుతంగా పుంజుకుని తన టెన్నిస్ కెరీర్ కంటే తక్కువ వయస్సు క్రీడాకారిణిపై పవర్ గేమ్ చాటింది. పోటాపోటీగా సర్వీసులు నిలబెట్టుకుంటూ సెట్‌ను ట్రైబ్రేకర్‌కు తీసుకెళ్లింది. ఇక్కడ మాయా సర్వీసును కొల్లగొడుతూ రెండో సెట్‌ను 7-6తో ముగించి సమవుజ్జీగా నిలిచింది. దీంతో నిర్ణయాత్మక మూడో రౌండ్ మరింత ఉత్కంఠగా సాగుతుందని అభిమానులు భావించారు. కానీ, మాయా దూకుడు ముందు సెరెనా నిలవలేకపోయింది. ఈ మ్యాచ్‌ను సెరెనా కుమార్తె ఒలంపియా ప్రత్యక్షంగా వీక్షించింది.

వింబుల్డన్‌లో సింగిల్స్, డబుల్స్‌లో వైల్డ్‌కార్డ్ పొందిన సెరెనా.. మహిళల డబుల్స్‌లో సోదరి వీనస్ విలియమ్స్‌తో కలిసి బరిలోకి దిగనుంది. ఈ క్రమంలో సెరెనా పేరుతో.. వింబుల్డన్ నిర్వాహకులు ఓ ప్రకటన విడుదల చేశారు. వింబుల్డన్‌లోకి తిరిగిరావడం చాలా ఆనందంగా ఉంది. దీన్ని చాలా మిస్ అయ్యా. మళ్లీ వస్తానని ఎప్పుడూ ఊహించలేదు. ఇక్కడి వాతావరణం అద్భుతంగా ఉంది. బాగా ఆస్వాదించాను. ప్రతిక్షణాన్ని ఎంజాయ్ చేశా అని సెరెనా వెల్లడించింది.

## మెరుపు హాఫ్ సెంచరీలతో చెలరేగిన అభిషేక్, శ్రేయాస్





**చెస్టర్-లీ-స్ట్రీట్, జూన్ 1:** ఇంగ్లాండ్‌తో తొలి టీ20 మ్యాచ్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. మరో వైపు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. తానెదుర్కొన్న రెండో బంతినే కవర్స్ మీదుగా బౌండరీతో ఖాతా తెరిచిన అభిషేక్... ఇంగ్లాండ్ బౌలర్లను ఊచకోత కోశాడు. ఇక డాసన్ బంతికి సిక్స్ బాదాడు. ఇక మహమూద్‌నైతే ఆడుకున్నాడు. వరుసగా 4,6,6తో రెచ్చిపోయాడు. వుడ్ బౌలింగ్‌లోనూ వరుసగా మూడు ఫోర్లు కొట్టాడు. కేవలం 20 బంతుల్లోనే ఆరు ఫోర్లు, మూడు సిక్స్‌లతో మెరుపు హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కెప్టెన్ శ్రేయాస్ బాధ్యతగా ఆడుతూ 38బంతుల్లోనే 4 ఫోర్లతో అర్ధసెంచరీ సాధించాడు.

**సంజూ, ఇషాన్ ఫ్లాప్ షో**

టీ20 ప్రపంచకప్ హీరో సంజూ శాంమ్సన్ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ విఫలమయ్యాడు. సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. ఏడు బంతులు ఎదుర్కొని ఒక పరుగు చేసిన సంజూ.. మహ్మద్ బౌలింగ్‌లో బాంటన్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ఐర్లాండ్ తో రెండు మ్యాచ్‌ల్లో 5, డకౌట్ అయిన సంజూ.. మూడు మ్యాచ్‌ల్లో మొత్తం 6 పరుగులే చేశాడు. ఇక వన్‌డౌన్ బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్ కూడా ఫ్లాప్ షో కొనసాగుతోంది. ఈ మ్యాచ్‌లో ఏకంగా డకౌట్ అయ్యాడు. రెండు బంతికి రన్ తీసే ప్రయత్నంలో రనౌట్‌గా వెనుదిరిగాడు. ఇషాన్ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ రనౌటైయ్యాడు. ఇర్లాండ్‌పై 1, 12 పరుగులు చేసిన ఇషాన్.. మొత్తంగా మూడుమ్యాచ్‌ల్లో13రన్స్ చేయగలిగాడు. టాప్‌ఆర్డర్‌లో వీరి ఫెయిల్యూర్ .. టీమిండియాపై ప్రభావం చూపుతోంది.

**వైభవ్‌కు నో ఛాన్స్**

టీమిండియాలోకి దూసుకొచ్చిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి ఈమ్యాచ్‌లోనూ తుది జట్టులో చోటు దక్కలేదు. సంజూ, ఇషాన్ కిషన్‌లలో ఒకరిని తప్పించి వైభవ్‌కు చోటు ఇస్తారని ఆశించిన ఫ్యాన్స్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ నిరాశపరిచింది. సీనియర్ల వైపే మొగ్గు చూపింది. కాగా ఇంగ్లాండ్‌తో తొలి టీ20 కోసం ఏకంగా ముగ్గురు స్పిన్నర్లతో టీమిండియా బరిలోకి దిగింది. స్పిన్ ఆల్‌రౌండర్‌గా అక్షర్ పటేల్‌తో పాటు వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్‌లకు చోటు కల్పించింది.



## వింబుల్డన్‌లో ఒసాకా ఫ్యాషన్స్

**లండన్:** జపాన్ క్రీడాకారిణి నయోమి ఒసాకా.. వింబుల్డన్‌లో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆటతోనే కాకుండా రోజుకో ఫ్యాషన్ డ్రెస్‌తో తళతళమెరుస్తూ హోరెత్తిస్తోంది. తొలిరోజు జపాన్ డాల్‌గా కనిపించిన ఒసాకా...రెండో రోజు మరింత భిన్నంగా డ్రెస్‌తో కోర్టులోకి అడుగుపెట్టింది. ఇక ఆటపరంగా చూస్తే నయోమి ఒసాకా...అలవోకగా మూడో రౌండ్‌లోకి ప్రవేశించింది. రెండో రౌండ్‌లో క్వాలిఫయర్ అనస్టాసియా గుసనోవాపై ఒసాకా 6-3, 6-2తో వరుస సెట్లలో అలవోకగా గెలుపొంది మూడో రౌండ్‌కు చేరుకుంది.

## రెండురోజుల నష్టాలకు బ్రేక్ లాభాల్లో ర్యాలీ తీసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, జూలై 1:** రెండురోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. ఆటో, ఎఫ్‌ఎంసీజీ, ఫైనాన్షియల్ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు బలంగా ముగిశాయి. ఐటీ షేర్లపై ఒత్తిడి కొనసాగినా నిఫ్టీ మళ్లీ 24 వేల మార్కును దాటింది. గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, పెద్దకంపెనీల షేర్లలో విలువ ఆధారిత కొనుగోళ్లు మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 443పాయింట్లు లాభపడి 76 వేల 922 వద్ద ముగిసింది. నిఫ్టీ 140 పాయింట్లు పెరిగి 24 వేల 5 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ర్యాలీకి ఎటర్నల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రధానంగా మద్దతు అందించాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా స్వల్ప లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయంగా యూరప్ మార్కెట్లు స్వల్పనష్టాల్లో ట్రేడ్ కాగా ఆసియామార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి.



అమెరికాఇరాన్ చర్చలు, యూఎస్ ట్రెజరీ రాబడుల పెరుగుదల, అమెరికా ఉద్యోగ గణాంకాలపై పెట్టుబడిదారులు దృష్టి సారించారు. వాహన విక్రయాల గణాంకాలు విడుదల చేసిన కంపెనీల్లో ఆశోక్ లేలాండ్ దాదాపు 3 శాతం, ఓలా ఎలక్ట్రిక్ 2.6 శాతం, వీఎస్‌టీ టిల్లర్స్, ఎస్కార్ట్స్ కుబోటా షేర్లు కూడా లాభాల్లో ముగిశాయి. స్టీల్ స్ట్రిప్స్ వీల్స్ షేర్ ఏకంగా 7 శాతానికి పైగా ఎగిసింది. అయితే కేపీఐటీ టెక్నాలజీస్ షేర్ భారీగా 16 శాతానికి పైగా పతనమైంది. తొలి త్రైమాసికం మాదిరిగానే రెండో త్రైమాసికంలోనూ ఆదాయం బలహీనంగానే ఉండొచ్చని కంపెనీ అంచనా వేయడంతో పెట్టుబడిదారులు అమ్మకాల బాట పట్టారు. ఫైసాలో డిజిటల్ షేర్ 19 శాతం ఎగిసిపడగా రైట్స్ 12 శాతం, జీఎన్‌జీ ఎలక్ట్రానిక్స్, వీఏ టెక్ వాబాగ్, ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ రెక్టిఫైయర్స్ షేర్లు కూడా లాభాలతో ముగిశాయి. నాక్ ప్యాకేజింగ్ ఐపీఓకు రెండున్నర రెట్లకు పైగా సబ్‌స్క్రిప్షన్ లభించింది.

ఆస్తా స్పింటెక్స్ ఐపీఓకు 4.6 రెట్లకు పైగా స్పందన వచ్చింది. రెండు ఇష్యూలకూ పెట్టుబడిదారుల నుంచి మంచి ఆదరణ లభించింది. రెండు రోజుల నష్టాల తర్వాత మార్కెట్లు బలంగా పుంజుకోవడం పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని నింపింది.

## స్టాక్ మార్కెట్‌లో భారీ కుంభకోణం 221 మందిపై సెబీ నిషేధం

### రూ.144 కోట్లను వడ్డీతో చెల్లించాలని హుకుం



**ముంబయి, జూలై 1:** భారతీయ స్టాక్ మార్కెట్‌లో సెబీ భారీ మోసాన్ని బయటపెట్టింది. ఐదు లిస్టెడ్ కంపెనీల షేర్లలో ధరలను కృత్రిమంగా పెంచి, అమాయక పెట్టుబడిదారులను మోసం చేసిన భారీ పంప్ అండ్ డంప్ కుంభకోణంపై కఠిన చర్యలు తీసుకుంది. మొత్తం 221 మందిపై మార్కెట్ నిషేధం విధించడంతో పాటు, అక్రమంగా సంపాదించిన రూ.143.79 కోట్లను వసూలు చేయాలని ఆదేశించింది. 2017 నుంచి 2020 వరకు కొనసాగిన ఈ భారీ షేర్ మార్కెట్ మోసానికి హనీఫ్ షేక్ సూత్రధారిగా వ్యవహరించినట్లు సెబీ తన విచారణలో వెల్లడించింది.

మోరియా ఉద్యోగ్, 7ఎన్ఆర్ రిటైల్, డార్జిలింగ్ రోప్‌వే కంపెనీ, జీబీఎల్ ఇండస్ట్రీస్, విశాల్ ఫ్యాబ్రిక్స్ అనే ఐదు లిస్టెడ్ కంపెనీల షేర్లలో కృత్రిమంగా ధరలు, ట్రేడింగ్ పరిమాణాన్ని పెంచినట్లు గుర్తించింది. ఈ మోసంలో 200 మందికి పైగా వివిధ బాధ్యతలు నిర్వహించినట్లు సెబీ గుర్తించింది. ముందుగా కొందరు సమన్వయంతో కొనుగోలు, అమ్మకాల ద్వారా షేర్ ధరలను పెంచి తర్వాత వేలాది మంది రిటైల్ పెట్టుబడిదారులకు భారీ ఎత్తున ఈ షేర్లు కొనండి అంటూ ఎస్ఎంఎస్‌లు పంపించారు. ఇలా అక్రమంగా వచ్చిన నిధులను షెల్ కంపెనీలు, ఫైనాన్షియర్లు, విదేశీ మారక సంస్థల ద్వారా బదిలీ చేసి, చివరకు హనీఫ్ షేక్‌కు చెందిన సంస్థలు లేదా ఆయా కంపెనీల ప్రమోటర్లకు చేరేలా వ్యవస్థ రూపొందించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ వ్యవహారంలో మొత్తం రూ.143.79 కోట్ల అక్రమ లాభాలు ఆర్జించినట్లు అంచనా వేసిన సెబీ, ఆ మొత్తాన్ని 2020 అక్టోబర్ నుంచి సంవత్సరానికి 12 శాతం వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ప్రధాన నిందితుడు హనీఫ్ షేక్‌పై ఏడేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్‌లో నిషేధం విధించడంతో పాటు రూ.10 కోట్ల జరిమానా కూడా విధించింది. ఆతని మరో 5సంస్థలకు ఆరేళ్ల నిషేధం, ఒక్కో సంస్థకు 2కోట్ల జరిమానా విధించింది. మిగిలిన నిందితులపై ఐదేళ్ల వరకు మార్కెట్ నిషేధం విధించడంతో పాటు రూ.5లక్షల నుంచి రూ.1 కోటి వరకు జరిమానాలు విధించింది.

## జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లు




**న్యూఢిల్లీ, జూలై 1:** దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి భారీగా నమోదయ్యాయి. ఈ ఏడాది జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1.94 లక్షల కోట్లు దాటింది. నేడు విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం గతేడాది ఇదే నెలతో పోలిస్తే వసూళ్లు 13.9 శాతం పెరిగాయి. ముఖ్యంగా దిగుమతులపై వచ్చే పన్ను రాబడి గణనీయంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. జూన్ నెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1,94,812 కోట్లుగా నమోదైంది. గత సంవత్సరం జూన్‌లో ఈ మొత్తం రూ.1,71,105 కోట్లుగా ఉంది. ఈపెరుగుదలలో దిగుమతులపై వచ్చే జీఎస్టీ వాటానే అధికం. దిగుమతులపై పన్ను రాబడి ఏకంగా 34.6 శాతం పెరిగి రూ.60,038 కోట్లకు చేరుకుంది. దేశీయ లావాదేవీల ద్వారా సమకూరిన జీఎస్టీ ఆదాయం మాత్రం 6.5 శాతం వృద్ధితో రూ.1,34,774 కోట్లుగా నమోదైంది. దేశీయ వసూళ్ల వృద్ధి రేటు కంటే దిగుమతులపై వసూళ్ల వృద్ధి రేటు ఎక్కువగా ఉండటం గమనార్హం.

రీఫండ్‌ల తర్వాత ప్రభుత్వానికి అందిన నికర జీఎస్టీ ఆదాయం జూన్‌లో 11.2 శాతం వృద్ధితో రూ.1,62,377 కోట్లకు చేరింది. గతేడాది ఇదే నెలలో నికర వసూళ్లు రూ.1,45,984కోట్లుగా ఉన్నాయి. ఈసారి మొత్తం రిఫండ్‌లు కూడా దాదాపు 30 శాతం పెరిగి రూ.32,436 కోట్లుగా నమోదయ్యాయి. ఇందులో దేశీయ రిఫండ్‌లు 42.9 శాతం పెరిగి రూ.17,767 కోట్లకు చేరగా, ఎగుమతులపై ఐస్‌గేట్ ద్వారా ఇచ్చిన రిఫండ్‌లు 15.6 శాతం పెరిగి రూ.14,669 కోట్లుగా ఉన్నాయి. ఇక, నికర ఆదాయాన్ని విశ్లేషిస్తే దేశీయ లావాదేవీలపై వచ్చిన నికర జీఎస్టీ రాబడి కేవలం 2.6 శాతం మాత్రమే పెరిగి రూ.1,17,007 కోట్లుగా ఉంది. అదే సమయంలో దిగుమతులపై వచ్చిన నికర కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం ఏకంగా 42.2 శాతం పెరిగి రూ.45,370 కోట్లకు చేరింది.

ఇది దిగుమతులపై ఆధారపడి పన్ను వసూళ్లు ఎంతగా పెరిగాయో స్పష్టం చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం గణాంకాలను పరిశీలిస్తే స్థూల జీఎస్టీ వసూళ్లు 8.4 శాతం వృద్ధితో రూ.6,31,699 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే సమయంలో ఈ వసూళ్లు రూ.5,82,542 కోట్లుగా ఉన్నాయి. ఇదే కాలంలో నికర జీఎస్టీ రాబడి7.1శాతం పెరిగి 5,40,218 కోట్లుగా నమోదైంది. మే నెలలో కూడా జీఎస్టీ వసూళ్లు రూ.1.94 లక్షల కోట్లుగా నమోదవగా, జూన్‌లోనూ అదే స్థాయి వసూళ్లు కొనసాగడం ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతకు సూచికగా నిపుణులు భావిస్తున్నారు.

## పెట్రోడీజిల్ ధరలు తగ్గించిన నయారా




**ముంబయి, జూలై 1:** దేశవ్యాప్తంగా వాహనదారులకు నయారా ఎనర్జీ భారీ ఊరటనిచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 5, డీజిల్‌పై లీటర్‌కు రూ. 3 చొప్పున కోత విధించింది. దేశవ్యాప్తంగా ఉన్న 7వేలకు పైగా నయారా రిటైల్ ఔట్‌లెట్లలో తగ్గిన ధరలు తక్షణమే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడం, కీలకమైన సముద్రమార్గాలు తిరిగి తెరుచుకోవడంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలోనే నయారా ఎనర్జీ ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రాల వారీగా ఉండే వ్యాట్ వంటి స్థానిక పన్నుల కారణంగా తుది రిటైల్ ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. నయారా ధరలను తగ్గించినప్పటికీ, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు మాత్రం పాత ధరలనే కొనసాగిస్తున్నాయి. దేశంలోని 90 శాతానికి పైగా ఇంధన మార్కెట్‌ను నియంత్రించే ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ తమ ధరలలో ఎటువంటి మార్పు చేయలేదు.




## ఇండిగో లైట్ పేరుతో కొత్త టికెట్ ఛార్జీలు

**ముంబయి, జూలై 1:** దేశీయ పౌర విమానయాన సంస్థ ఇండిగో లోబడ్జెట్‌లో ప్రయాణించాలనుకునే సాధారణ ప్రజల కోసం కొత్త ఛార్జీలతెచ్చింది. హ్యాండ్ బ్యాగ్ లేదా క్యాబిన్ లగేజ్‌తో మాత్రమే ప్రయాణించే వారి కోసం "ఇండిగో లైట్" పేరుతో ఓఎకానమీ క్లాస్ ఛార్జీల కేటగిరీని ప్రవేశపెట్టింది. లగేజీ రహిత ప్రయాణికులకు విమాన టికెట్ ఛార్జీలపై మరింత రాయితీ కల్పించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈ ప్రత్యేక సదుపాయం ద్వారా లభించే విమాన టికెట్ల బుకింగ్స్ నేటి నుంచే ప్రారంభం అయ్యాయి కూడా. ప్రయాణికులు ఈ టికెట్లతో జూలై 15వ తేదీ నుండి ప్రయాణాలు సాగించవచ్చని ఇండిగో యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. ఇండిగోకు చెందిన అధికారిక వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్, నేరుగా కాల్‌సెంటర్ వంటి అధికారిక యాక్సెస్ మార్గాల ద్వారా టికెట్ బుక్ చేసుకునే వారికి మాత్రమే ఇండిగో లైట్ ప్రయోజనాలు దక్కుతాయి. డొమెస్టిక్ తో పాటు అంతర్జాతీయ నాన్ స్టాప్ విమాన ప్రయాణాలన్నింటికీ ఈ విధానం వర్తిస్తుంది. ఈ సదుపాయాన్ని వన్ వే, రౌండ్ ట్రిప్, మల్టీసిటీ బుకింగ్‌లకు కూడా సమానంగా వర్తింపజేసుకోవడం ఇండిగో లైట్ ఛార్జీల ప్రత్యేకత. పెద్దలతో పాటు పిల్లల టికెట్లకు కూడా ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని సంస్థ తెలిపింది.

## వాట్సాప్‌లో నంబర్‌లేకుండా యూజర్‌నేమ్ సెట్టింగ్ ప్రమాదకరం అని హెచ్చరిస్తున్న కేంద్రం




**న్యూఢిల్లీ, జూలై 1:** వాట్సాప్‌లో త్వరలో యూజర్ నేమ్ పేరుతో కొత్త ఫీచర్ రాబోతోంది. ఇకపై యూజర్లు తమ నెంబర్ కనిపించకుండా యూజర్ నేమ్ సెట్ చేసుకోవచ్చు. ఫోన్ నెంబర్ షేర్ చేయకుండా యూజర్ నేమ్ ద్వారా ఇతరులతో చాట్ చేయవచ్చు. ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉన్న ఈ ఫీచర్‌పై కేంద్రం దృష్టి సారించింది. ఈ ఫీచర్ ఎంత వరకు ప్రమాదకరమో పరిశీలిస్తోంది.

కొత్త ఫీచర్ ద్వారా ఏమైనా ఆన్‌లైన్ మోసాలకు అవకాశం ఉందా, యూజర్ నేమ్‌ల ద్వారా ఇతర యూజర్లకు ఎలాంటి సేఫ్టీ ఉంటుంది, తప్పుడు సమాచారం చేరవేసేందుకు ఉన్న అవకాశాలు వంటి అంశాల్ని పరిశీలించనుంది. ఈ ఫీచర్‌పై కేంద్ర ప్రభుత్వం సమీక్షించిన తర్వాతే దీనికి అనుమతి లభిస్తుంది. ఈ కొత్త ఫీచర్ ఈ ఏడాది చివరి నుంచి అందుబాటులోకి రానుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ఇతర సోషల మీడియా యాప్‌లలో ఉండే యూజర్ నేమ్‌లలాగే పని చేస్తుంది. ఇందుకోసం యూజర్లు తమ యూజర్ ఐడీని రిజర్వ్ చేసుకునే అవకాశం కూడా ఉంది. దీనిపై యూజర్లకు వాట్సాప్ సమాచారం కూడా ఇస్తోంది. ఈ కొత్త ఫీచర్ వల్ల ప్రయోజనాలతోపాటు ఇబ్బందులు కూడా ఉంటాయి. ఎవరితో నైనా తాత్కాలికంగా చాట్ చేయాల్సి వచ్చినప్పుడు ఫోన్ నెంబర్‌తో పని లేకుండా యూజర్ నేమ్ ద్వారానే చాట్ చేయవచ్చు. ఇతరులు కూడా అలాగే, చాట్ చేస్తే వారి ఒరిజినల్ నెంబర్ గుర్తించడం కష్టం. కొత్త ఫీచర్ అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఇప్పటికే ఉన్న బ్లాక్, అన్‌నోన్ కాలర్స్ సైలెన్సింగ్ వంటి ఫీచర్లు కొనసాగుతాయి. యూజర్ నేమ్ 3 నుంచి 35 అక్షరాల వరకు ఉండొచ్చు. ఇంగ్లీష్‌లో ఏ టు జడ్ 09 వరకు అంకెలు, డాట్, అండర్‌స్కోర్ మాత్రమే వాడుకోవచ్చు. యూజర్ నేమ్ ఇతరులు యాక్సెస్ చేయాలంటే నాలుగు అంకెలతో ఒక కీ కూడా సెట్ చేసుకోవాలి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.